thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 163 | కరీంనగర్ గురువారం, 21 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!

న్యూఢిల్లీ : భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌లోనే అతి పెద్ద ప్రావిన్స్(విస్తీర్ణం పరంగా) అయిన బలూచిస్థాన్.. పాకిస్థాన్ నుంచి విడిపోతున్నట్టు బలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్థాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ ఏర్పాటును తన పోస్టుల్లో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను దేశంగా గుర్తించి.. కరెన్సీ, పాస్‌పోర్టు జారీ వంటి ప్రాథమిక అవసరాలకు నిధులు సమకూర్చాలని ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించారు.

# విశ్వనగరంగా హైదరాబాద్!

## పదేళ్ళలో ఎవరూ ఊహించని అభివృద్ధి చేసి చూపుతాం!




### గచ్చిబౌలిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భూమి పూజ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ లో నిర్మించబోయే ఫ్యూచర్ సిటీ ప్రపంచానికి వేదిక కావాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. 2034 వరకు ప్రపంచం మొత్తం మన హైదరాబాద్ నగరాన్ని చూడడానికి రావాల్సిందేనన్నారు. ప్రపంచంలోని అన్ని రకాల సాంకేతిక విభాగాలు ఫ్యూచర్ సిటీ నుంచే పనిచేస్తాయన్నారు రేవంత్. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లే శత్రువులని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకోవడానికి వచ్చే వాళ్లను ప్రజలే అడ్డుకోవాలని సూచించారు రేవంత్. హైదరాబాద్ అభివృద్ధి జరగాలంటే మూసీ ప్రక్షాళన జరగాల్సిందేనన్నారు .

**న్యూయార్క్, టోక్యో, సింగపూర్ తో హైదరాబాద్ పోటీ...**

గచ్చిబౌలిలోని తాలిమ్ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు సీఎం రేవంత్ ..ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..న్యూయార్క్, టోక్యో సింగపూర్ తో హైదరాబాద్ కు పోటీ మూసీ ప్రక్షాళన కొంత మందికి ఇష్టం లేదు. హైదరాబాద్ ను విశ్వనగరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. 15 ఏళ్లుగారాష్ట్రం క్రీడల్లో వెనుకబడిపోయింది. మూసీ వద్దంటున్నారు..ఫ్యూచర్ సిటీ వద్దంటున్నారు. ఆనాడు కూడా ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్టును కొందరు హేళన చేశారు. నాటి సీఎంల ముందు చూపుతోనే అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ కు వచ్చాయి. హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలంటే మూసీ ప్రక్షాళన చేయాల్సిందే. ఓల్డ్ సిటీని గోల్డ్ సిటీగా మార్చాలంటే మూసీ ప్రక్షాళన చేయాలి. గంగా,యమునా,సబర్మతిని వాళ్లు ప్రక్షాళన చేసుకోలేదా?. గజం స్థలం దొరకనోళ్లు మూసీ మురికిలో ఇబ్బంది పడుతున్నారు. మూసీని ప్రక్షాళన చేసి నైట్ మార్కెట్ ను అభివృద్ధి చేస్తాం. మూసీ పరివాహక ప్రాంతంలో 24 గంటలు వ్యాపారం జరిగేలా చూస్తాం. మూసీలో 24 గంటలు నీళ్లు ఉండేలా రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తాం . మూసీ రివర్ ఫ్రంట్ ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తాం. ట్రిపుల్ రావాలంటే నగరం విస్తరించాలి. ఎలివేటెడ్ కారిడార్లు,మెట్రోను కనెక్టివిటీ చేస్తాం.

**తెలుగు వాళ్లు లేకపోతే అమెరికాలో ఐటీ కంపెనీలు నడవవు...**

2047 లక్ష్యంగా తెలంగాణ అడుగులేస్తోంది. హైటెక్ సిటీకి కాంగ్రెస్ హయాంలోనే పునాది రాయి. ఐటీ అభివృద్ధి వెనుక రాజీవ్ గాంధీపాత్ర ఉంది. హైదరాబాద్ అభివృద్ధిలో చాలా మంది పాత్ర ఉందిఅప్పటి కేంద్రమంత్రి జనార్థన్ రెడ్డి వల్ల హైటెక్ సిటీకి పునాది పడింది. చంద్రబాబు, వైఎస్సార్ కూడా కృషి చేశారు. రాజీవ్ గాంధీ వల్ల దేశంలో ఐటీ రంగం రాణిస్తోంది. హెటెక్ సిటీ వల్ల రాష్ట్రానికి లక్షలాది రూపాయల ఆదాయం వస్తోంది. హైటెక్ సిటీని ఆనాడు కొంత మంతి అవహేళన చేశారు. ఇన్ఫోసిస్, గూగుల్,మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఇక్కడి నుంచి పనిచేస్తున్నయ్. మౌలిక వసతుల్లో హైదరాబాద్ గొప్పగా అభివృద్ధి చెందింది. అమెరికాలోని సిలికాన్ వ్యాలీని తెలుగువాళ్లు శాసిస్తున్నారు. తెలుగు వాళ్లు లేకపోతే అమెరికాలో ఐటీ కంపెనీలు నడిచే పరిస్థితి లేదు అని రేవంత్ అన్నారు.



## తెలుగు రాష్ట్రాలకు అతిభారీ రెయిన్ అలెర్ట్

అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దండయాత్ర చేస్తున్నాయ్. తెలంగాణలో ఐదు రోజులు, ఏపీలో మరో మూడ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాల అలర్ట్ ఇచ్చారు వాతావరణశాఖ అధికారులు. తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం.. మహబూబాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేయగా.. ఆదిలాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్.. అలాగే మరో 20 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. వాయుగుండం పశ్చిమ, వాయువ్య దిశలో కదిలి క్రమేపీ బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు తెలంగాణలోని కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షాలు.. ఆదిలాబాద్, కొమరం భీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అటు ఏపీలో అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రమంతటా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయ్. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం.. అల్లూరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడనున్నాయ్.

## ఉప రాష్ట్రపతి పోరు...

## బీజేపీని డీఎంకే దెబ్బ కొడుతుందా ?




దేశంలో బలమైన ప్రాంతీయ పార్టీగా డీఎంకే ఉంది. ద్రవిడ వాదాన్ని నమ్ముకుని దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్న డీఎంకేకి బీజేపీతో సిద్ధాంతపరంగా వైరం. హిందూత్వ నుంచి హిందీ వరకూ వ్యతిరేకిస్తూనే ఉంటుంది. అయితే బీజేపీ కానీ డీఎంకే కానీ ప్రత్యక్షంగా ఎక్కడా తలపడినది లేదు. తమిళనాట బీజేపీకి పెద్దగా బలం లేదు. ఇక డీఎంకే తమిళనాడు దాటి బయటకు పోటీ చేసిన పార్టీ అయితే కాదు. దాంతో ఈ రెండు పార్టీల పోరాటం పార్లమెంట్ లోనే సాగుతుంది. అలాగే బీజేపీ మీద డీఎంకే నేతలు ఎపుడూ విమర్శలు చేస్తారు. దానికి బీజేపీ నుంచి ధీటు అయిన బదులు వస్తుంది.

**తొలిసారి రేసులోకి :** ఇదిలా ఉంటే మొదటిసారిగా బీజేపీని డీఎంకే ఢీ కొట్టబోతోంది అన్నది ఇపుడు అతి పెద్ద చర్చగా ఉంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఏరి కోరి మరీ తమిళనాడుకు చెందిన సీపీ రాధాక్రిష్ణన్ ని బీజేపీ ఎంపిక చేసింది. ఎన్డీయే అభ్యర్థిగా ఆయన పోటీకి దిగుతున్నారు. ఆయన పూర్వాశ్రమంలో ఫక్తు బీజేపీ వారు. అయితే ఇపుడు మహారాష్ట్ర నుంచి గవర్నర్ గా ఉన్నారు తాయన తమిళనాడుకు చెందిన వారు కాబట్టే బీజేపీ పెద్ద ప్లాన్ తోనే ఆయనను ఎంపిక చేసింది అని అంటున్నారు. బీజేపీకి తమిళనాడులో బలం పెంచుకోవడం అవసరంగా ఉంది. దానికి ఈ ఎంపిక ఒక విధంగా ఉపయోగపడుతుంది అని ఆలోచించిన మీదటనే ఇలా చేసింది అని అంటున్నారు. దీంతో బీజేపీతో పోరుకి తొలిసారి డీఎంకే రంగంలోకి దిగుతోంది అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

**తిరుచి శివనే అభ్యర్థిగా :** డీఎంకేకి చెందిన రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివను ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకి దించబోతున్నారు అని అంటున్నారు. ఆయన పేరుని దాదాపుగా ఇండియా కూటమి ఆమోదించింది అని అంటున్నారు. ఆయన అభ్యర్థి అయితే తమకు ఎండీయేని బీజేపీని కాసుకోవడానికి ఎంతో బాగుంటుంది అని అంటున్నారు. దాంతో నూరు శాతం ఆయనే అభ్యర్థి అని అంటున్నారు. తమిళనాడుకు చెందిన శివని ముందు పెట్టి డీఎంకే కే కూడా బీజేపీతో తేల్చుకోవాలని చూస్తోంది.

**సనాతనం వర్సెస్ ద్రవిడవాదం :** చాలా కాలంగా బీజేపీ సనాతనవాదం డీఎంకే ద్రవిడవాదం ల మధ్యన పోరు సాగుతోంది. సనాతన ధర్మాన్ని డీఎంకే యువ నాయకుడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా వ్యతిరేకిస్తూ మాట్లాడారు. సనాతన ధర్మం మీద బీజేపీ అయితే పేటెంట్ హక్కులు తమవే అని క్లెయిం చేసుకుంటోంది. అలాగే హిందీ భాషను తమిళనాడులో ప్రాథమిక విద్యా విధానం నుంచి తొలగించింది డీఎమెకే ప్రభుత్వం. ఆ విధంగా రెండు పార్టీల మధ్య ఒక రకమైన యుద్ధం అయితే సాగుతోంది. ఇపుడు అది ఓపెన్ అయ్యే అవకాశాలు బలంగా ఉన్నాయి.

**ప్రతిష్ట గా తీసుకుంటూ :** నిజానికి ఉప రాష్ట్రపతి ఎన్నికను ఏకపక్షం చేయలని ఎన్డీయే అంటోంది. కానీ ఇండియా కూటమి నేతలు పార్టీలు అయితే ససేమిరా అని అంటున్నారు. అసలే పార్లమెంట్ వర్షాకల సమావేశాలు బీహార్ లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ మీద దద్దరిల్లుతున్నాయి.

రాహుల్ గాంధీ అయితే ఓటు చోరీ అని జనంలోకి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే ఇండియా కూటమిల మధ్య ఉప్పు నిప్పులా ఉంది. దాంతో ఎకగ్రీవం అన్నది కుదిరేది కాదని అంటున్నారు.

**భీకరమైన పోరు:** తమిళనాడు గుండా దక్షిణాది మీద కన్నేసిన బీజేపీకి అదే తమిళనాడులోనే రెడ్ సిగ్నల్ చూపించాలని ఇండియా కూటమి పథక రచన చేసింది. దానికి సిద్ధాంతపరంగా బద్ధ శతృవుగా ఉన్న డీఎంకేనే ఫీల్డ్ లోకి దించుతోంది. సో ఈ ఉప రాష్ట్రపతి ఎన్నికల సమరం భీకరంగా ఉండబోతోంది.




# గురిచూసి కొట్టిన రేవంతుడు!

## ఇరకాటంలో తెలుగు రాష్ట్రాల నేతలు!

## ఒక్క దెబ్బకు 'మూడు' పిట్టలు!!

హైదరాబాద్/అమరావతి : ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరును ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఎన్డీయే కూటమి నుంచి తమిళనాడుకు చెందిన మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బరిలో నిలవగా.. ఇండియా కూటమి నుంచి సుదర్శన్ రెడ్డి పోటీ చేయనున్నారు.

ఈ మేరకు ఢిల్లీలో సమావేశమైన ఇండియా కూటమి నేతలు సుదర్శన్ రెడ్డి పేరును ఖరారు చేశారు. అయితే తెలంగాణకు చెందిన సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. గెలుపోటములతో సంబంధం లేకుండా వ్యూహాత్మకంగా ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని సుదర్శన్ రెడ్డిని అనుహ్యాంగా తెరపైకి తీసుకొచ్చారు. దాంతో పాటుగా ఒక్క దెబ్బకు రెండు కాదు.. మూడు పిట్టలు అన్నట్లుగా తన రాజకీయ చతురతో అందరి నోళ్లు మూయించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్ హైకమాండ్‌కు సీఎం రేవంత్ రెడ్డికి మధ్య గ్యాప్ వచ్చినట్లు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పదే పదే ఆరోపిస్తోంది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ కనీసం ఆయనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటం లేదని చెబుతోంది. రేవంత్ రెడ్డి ఇప్పటికే 50 సార్లకు పైగా ఢిల్లీ వెళ్లారని కానీ ఎప్పుడు రాహుల్‌ను కలిసే అవకాశం రాలేదని అంటోంది. రేవంత్ అనాలోచిత నిర్ణయాల పట్ల హైకమాండ్ సీరియస్ గా ఉందని.. అందుకే ఆయనకు రాహుల్, సోనియా అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదని బీఆర్ఎస్ నేతల వాదన. ఒకవేళ రేవంత్ రాహుల్‌ను కలిస్తే ఆ ఫోటోలు బయటకు రావాలి కదా? అని పలు సందర్భాల్లో గులాబీ నేతలు ప్రశ్నించారు. అయితే ఏనాడు ఈ విషయంపై రేవంత్ నోరు మెదప లేదు. కానీ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయటంతో అందరి నోళ్లు మూయించారు. కాంగ్రెస్ హైమాండ్ వద్దే కాదు.. ఇండియా కూటమిలోనూ తన మాట చెల్లుబాటు అవుతుందని నిరూపిస్తూ తెలంగాణకు చెందిన సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఖరారు చేయటంలో రేవంత్ కీలక పాత్ర పోషించినట్లు రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్లు వెలమ సామాజిక వర్గానికి చెందిన కేసీఆర్ సీఎంగా కొనసాగారు. ఆ సమయంలో బలమైన సామాజిక వర్గంగా పేరున్న రెడ్లకు ఆయన సరైన ప్రాధాన్యత ఇవ్వలేదనే విమర్శ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. ఆ లోటును భర్తీ చేస్తూ రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. తన మంత్రివర్గంలోనూ నలుగురు రెడ్లకు ఛాన్స్ ఇచ్చారు. పలు నామినేటెడ్ పదవులను కూడా కట్టబెట్టారు. అయినా ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు, ప్రజలు కాస్త అసంతృప్తితోనే ఉన్నారు. సీఎం రేవంత్ నుంచి రెడ్డి సామాజిక వర్గం నేతలు అంతకు మించి కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే దేశంలోనే రెండో అత్యున్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తీసుకురావటం ద్వారా వారికి భరోసా కల్పించినట్లు అయింది. సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించటంలో కీరోల్ ప్లే చేసి ఏపీ సీఎం చంద్రబాబును సైతం పరోక్షంగా ఇరుకున పెట్టారు సీఎం రేవంత్.

ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో టీడీపీ ముఖ్యమైన భాగస్వామి. ఎంపీ సీట్ల పరంగా బీజేపీ తర్వాత రెండో అతిపెద్ద పార్టీ. అలాంటి చంద్రబాబును రేవంత్ ప్రస్తుతం ఇరుకున పెట్టారు. తెలుగువాడి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగు దేశం.

ఆ పార్టీ పేరులోనే 'తెలుగు' అనే పేరు ఉంటుంది. అలాంటి టీడీపీకి ఇప్పుడు సంకటస్థితి వచ్చి పడింది. ఇండియా కూటమి తెలుగు వ్యక్తి సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించటంతో ఆ పార్టీ ఎవరికి మద్దతిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. తెలుగు వ్యక్తిగా సుదర్శన్ రెడ్డికి మద్దతిస్తుం దా..? పొత్తు ధర్మంలో భాగంగా ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతి స్తుందా..? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇందులోనూ సీఎం రేవంత్ వ్యూహం ఉండే ఉంటుందని.. తెలుగు వ్యక్తిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటంచం ద్వారా ఎన్డీయే కూటమిలో కీలకమైన చంద్రబాబును, ఇతర పార్టీలు వైసీపీ, జనసేన, బీఆర్ఎస్‌లను ఇరకాటంలో పెట్టవచ్చుననే భావనతోనే సుదర్శన్ రెడ్డి పేరును ప్రకటించేలా చేసినట్లు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలా ఒక్క దెబ్బకు మూడు పిట్టలు అన్నట్లుగా ఇండియా కూటమిలో తన బలం, రెడ్డి సామాజిక వర్గానికి భరోసా, ఎన్డీయేలో కీలకమైన చంద్రబాబును ఇరకాటంలో పెట్టడంలో రేవంత్ సక్సెస్ అయినట్లు తెలుస్తోంది.



## అప్పుడు హైటెక్ సిటీపై.. ఇప్పుడు మూసీ ప్రక్షాళనపై..

హైదరాబాద్: రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని వెల్లడించారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాద్‌ను అప్పటి సీఎంలు అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని పలు సంస్థలు నిర్మించారని గుర్తు చేశారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారు. హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోంది. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం కావాలి. అమెరికాలో మన ఐటీ నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చాం. రాబోయే పదేళ్లలో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు. మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారు? తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందాం. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పిస్తుంది. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకొనే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలి. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. హైదరాబాద్ పాత బస్తీ.. ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ సిటీ. మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నాం. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నాం. నగర అభివృద్ధి అడ్డుకునే వారు మనకు శత్రువే" అని రేవంత్ వ్యాఖ్యానించారు.




## కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పోటెత్తిన వరద

**భూపాలపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద పోటెత్తింది. ఇక్కడ 12.41 మీటర్ల మేర ప్రవాహం కొనసాగుతోంది. జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ప్రవాహం ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.**

## కాళేశ్వరం కమిషన్‌పై 21న తెలంగాణ హైకోర్టులో విచారణ


హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై న్యాయ విచారణకు జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కూడా అందులో సవాలు చేశారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌ను పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని



అప్రతిష్ఠపాల్జేసే రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్ నియామకం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషన్లలో పేర్కొన్నారు.

## పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులకు ఇలాంటి పరిస్థితి రాలేదు: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణలో రెండు నెలలుగా దయనీయమైన పరిస్థితి ఉందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. "ఎరువుల బస్తాల కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులకు ఇలాంటి పరిస్థితి రాలేదు. వ్యవసాయశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి సమీక్ష చేయలేదు. ముందస్తు ప్రణాళిక లేకుండా పాలన చేస్తున్నారు. భారత రాష్ట్ర సమితి నేతలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వ్యవసాయ శాఖకు ఇతర శాఖలతో సమన్వయం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఓ రైతు 3 బస్తాల యూరియా తీసుకుంటే నాన్‌బెయిలబుల్ కేసు పెట్టారు. బ్లాక్ మార్కెట్‌లో కాంగ్రెస్ నేతలే యూరియా అమ్ముతున్నారు.



ఢిల్లీకి 51సార్లు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. ఒక్క బస్తా యూరియా తీసుకురాలేకపోయారు. ఎరువుల కొరతపై లోక్‌సభలో రాహుల్‌గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదు?ఏపీ మంత్రులు ఢిల్లీకి వెళ్లి యూరియా తెచ్చుకుంటున్నారు. కాంగ్రెస్, భాజపా రైతులను మోసం చేస్తున్నాయి. రామగుండం యూనిట్‌ను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కవిత స్థానంలో.. గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్ నియమితులయ్యారు. సంఘం కార్యవర్గ సమావేశంలో కొప్పుల ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవిత స్థానంలో ఈశ్వర్‌ను ఎన్నికోవడం గమనార్హం. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి నిర్ణయం తీసుకుంది.



## ఆర్థిక రాజధాని అస్తవ్యస్తం..!

## ముంబైలో కుండపోత వర్షాలు.. జనజీవనం అస్తవ్యస్తం

ముంబై: భారీ వర్షాలకు ముంబై నగరం అతలాకుతలం అవుతోంది. నేడూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా జన జీవనం స్తంభించిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంబైతోపాటు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ భారతీయ వాతావరణ శాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు అప్రమత్తమయ్యాయి. వర్షాల కారణంగా విమాన రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. ముంబై నుంచి బయలుదేరాల్సిన 155 విమాన సర్వీసుల్లో జాప్యం జరిగింది. ముంబై ఎయిర్‌పోర్టుకు రావాల్సిన మరో 102 విమానాల ల్యాండింగ్ కూడా ఆలస్యం కానుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రయాణికులకు ఇండిగో అలర్టులు జారీ చేసింది. మరోవైపు ఎయిర్‌పోర్టుకు వచ్చే పలు మార్గాలు నీట మునిగి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఫలితంగా కార్యకలాపాల నిర్వహణలో ఆటంకాలు ఏర్పడి విమాన రాకపోకల్లో జాప్యం జరుగుతోంది. వర్షాల కారణంగా నగర జీవనం అస్తవ్యస్థం కావడంతో ముంబై నగర పాలక సంస్థ నేడు సెలవును ప్రకటించింది. అత్యవసర ప్రభుత్వ సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు నేడు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించాలని కూడా నగర పాలక సంస్థ సూచించింది.

వర్ష బీభత్సం కారణంగా ఇప్పటికే పలు స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయి. కొంకణ్ ప్రాంతాల్లోని (పాల్ఘడ్, థానే, రాయ్‌గఢ్, రత్నగిరి, సింధూదుర్గ్ జిల్లాలు) కాలేజీలకు సెలవు ఇచ్చినట్టు ఉన్నత విద్యాశాఖ పేర్కొంది. రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్టు బస్సులను కూడా కొన్ని ప్రాంతాల్లో దారి మళ్లించారు. రైళ్ల రాకపోకల్లో కూడా ఆలస్యం చోటుచేసుకుంది. కొన్ని ప్రాంతాల్లో ట్రాక్స్‌పై నీరు చేరడంతో ఆటంకాలు ఏర్పడ్డాయని రైల్వే అధికారులు తెలిపారు.



## భారీ వర్షాలకు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు.. ప్రాజెక్టులకు జలకళ

భారీ వర్షాలకు తెలంగాణలోని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతోంది. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,45,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా 38 ప్రధాన గేట్లు ఎత్తి 1,73,578 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీ వరద ప్రవాహం రావడంతో 26 క్రస్ట్ గేట్లను ఎత్తి స్పిల్ వే ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద జలకళ సంతరించుకుంది. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.



## ఉద్ధృతంగా మూసీ ప్రవాహం

భువనగిరి : ఎగువన కురుస్తున్న వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లాలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కుంటలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. జిల్లాలోని బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. లోలెవల్ బ్రిడ్జికి ఇరువైపులా పోలీసులు బారికేడ్‌లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పని చేస్తాం : తేజస్వీ యాదవ్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పని చేస్తాం అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ.. రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార యాత్ర' ప్రారంభించిన సంగతి తెలిసిందే. మంగళవారం నవాడాలో జరిగిన ఈ యాత్రలో తేజస్వీ పాల్గొని మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతిపక్షాలన్నీ కృషి చేస్తాయన్నారు. తేజస్వీ వ్యాఖ్యల సమయంలో రాహుల్ కూడా పక్కనే ఉన్నారు. ఇక, దీనికి ముందు తేజస్వీ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విలేకరుల సమావేశంలో ఆయన వాస్తవాలతో కూడిన స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని విమర్శించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన స్క్రిప్ట్‌ను ఆయన చదివి వినిపించారని ఎద్దేవా చేశారు. ప్రాణాలతో ఉన్నవారిని చనిపోయినట్లు ఎందుకు పేర్కొంటున్నారో తమకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన భాజపాలో సభ్యత్వం తీసుకొని ఉంటే చెప్పాలంటూ విమర్శలు చేశారు. ఓటర్ అధికార యాత్రకు ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తుందన్నారు. దీంతో ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి.. భాజపా ఓట్లను ఎలా దొంగిలిస్తుందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు.



## జలదిగ్బంధంలోనే ఏడుపాయల వనదుర్గమ్మ

**మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం వారం రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. అర్చకులు రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. సింగూర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో పాటు నక్క వాగు ప్రవాహంతో వనదుర్గ ఆనకట్టకు భారీగా వరద పోటెత్తుతోంది. వనదుర్గ ఆనకట్ట మీదుగా 50,985 వేల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట, గర్భగుడి వైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు బారికేడ్లు ఏర్పాటు చేశారు.**

# నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు

## ఆగస్టు 21... నేషనల్ సీనియర్ సిటిజన్స్ డే



కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టు కుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశంలో నెలకొన్న పరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించకపోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

**"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"...** జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ సమర్థ వంతంగా నిర్వహించ బడుతున్నది.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# మిస్ యూనివర్స్ ఇండియా - 2025 విజేత ఈమె.. బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే షాక్!




అందాల పోటీలు ఎప్పటికప్పుడు ప్రపంచ స్థాయి దృష్టిని ఆకర్షిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రతి ఏడాది జరుగుతున్న ఈ అందాల పోటీలలో ఎంతోమంది తమ ప్రతిభను చాటుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఇకపోతే 2025వ సంవత్సరానికి గానూ జైపూర్ వేదికగా 'మిస్ యూనివర్స్ ఇండియా – 2025' పోటీలు నిర్వహించారు. ఇందులో రాజస్థాన్ కి చెందిన మణిక విశ్వకర్మ టైటిల్ కిరీటాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. 2024 మిస్ యూనివర్స్ ఇండియాగా కిరీటాన్ని దక్కించుకున్న రియా సింగ్.. మణిక విశ్వకర్మకు కిరీటాన్ని అలంకరించారు.

**మిస్ యూనివర్స్ ఇండియాగా మణిక విశ్వకర్మ..** ఇదిలా ఉండగా.. ఈ ఏడాది నవంబర్లో థాయిలాండ్ లో జరగబోయే 74వ మిస్ యూనివర్స్ పోటీలలో భారత్ తరపున మణికా ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలుస్తోంది.

ఇకపోతే జైపూర్ వేదికగా జరిగిన ఈ మిస్ యూనివర్స్ ఇండియా 2025 అందాల పోటీలలో మణిక టైటిల్ విజేతగా నిలవగా.. ఉత్తరప్రదేశ్ కి చెందిన తాన్యా శర్మ ఫస్ట్ రన్నరప్ , మెహక్ ధింగా సెకండ్ రన్నరప్ , హర్యానా అమ్మాయి అమిషీ కౌశిక్ మూడవ రన్నరప్ గా నిలిచారు.

**పేరుపేరునా కృతజ్ఞతలు – మణిక విశ్వకర్మ...** మిస్ యూనివర్స్ కిరీటాన్ని సొంతం చేసుకోవడంతో సంతోషం వ్యక్తం చేసిన ఈమె మాట్లాడుతూ.. "నా ప్రయాణం నా స్వస్థలమైన గంగానగర్ నుంచి మొదలైంది. అక్కడి నుంచి ఢిల్లీకి వచ్చి ఈ పోటీకి సిద్ధమయ్యాను. మనపై మనం నమ్మకం, ఆత్మవిశ్వాసంతో ఉంటే ఏదైనా సాధించగలం. నా విజయం వెనుక ఎంతో మంది నిలిచారు. నాకు సహాయం చేస్తూ.. నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు" అంటూ తెలిపారు మణిక విశ్వకర్మ.

**మణిక విశ్వకర్మ బ్యాక్ గ్రౌండ్..** ఇకపోతే ఈ పోటీలలో విజేతగా నిలిచిన మణిక విశ్వకర్మ బ్యాక్ గ్రౌండ్ గురించి తెలుసుకోవడానికి నెటిజన్స్ తెగ వెతికేస్తున్నారు. మణిక విశ్వకర్మ విషయానికి వస్తే.. రాజస్థాన్ లోని శ్రీ గంగా నగర్ కు చెందిన ఈమె ప్రస్తుతం ఢిల్లీలో నివాసం ఉంటున్నారు.. పొలిటికల్ సైన్స్ , ఎకనామిక్స్ లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న మణిక.. అటు జాతీయస్థాయి కళాకారిణిగా కూడా గుర్తింపు సొంతం చేసుకున్నారు.

చిత్రలేఖనం , క్లాసికల్ డాన్స్ విభాగంలో ప్రావీణ్యం పొందిన ఈమె.. గత ఏడాది మిస్ యూనివర్స్ రాజస్థాన్ 2024 టైటిల్ ను సొంతం చేసుకున్నారు.

**సేవారంగంలో కూడా విశిష్ట సేవలు అందిస్తూ..** అటు సేవా రంగంలో కూడా విశిష్ట సేవలు అందిస్తూ గొప్ప మనసు చాటుకుంటున్నారు మణిక. "న్యూరోనోవా" అనే సంస్థను స్థాపించి, ADHD వంటి న్యూరోలాజికల్ సమస్యలతో బాధపడే వారికి సహాయం అందిస్తూ.. అండగా నిలుస్తున్నారు. ఇకపోతే విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్వహించిన బిమ్స్ టెక్ సెవోకాన్ లో భారత్ తరపున ప్రతినిధిగా పాల్గొన్న ఈమె ఇప్పటివరకు మూడుసార్లు మిస్ యూనివర్స్ కిరీటాన్ని సొంతం చేసుకుంది..

**మిస్ యూనివర్స్ కిరీటాన్ని దక్కించుకున్న ఇండియన్ సెలబ్రిటీస్..** ఇకపోతే ఇప్పటివరకు మిస్ యూనివర్స్ కిరీటాన్ని దక్కించుకున్న ఇండియన్ సెలబ్రిటీస్ విషయానికి వస్తే.. 1994లో సుస్మిత సేన్, 2000 సంవత్సరంలో లారా దత్తా, 2021లో హర్నాజ్ సంధు ఈ ఘనత సాధించారు.

ఇకపోతే గత ఏడాది భారత్ తరపున మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొన్న రియాసింగ్ టాప్ 12 లో చోటు తగ్గించుకోలేకపోయారు. కనీసం ఈసారి మణిక విశ్వకర్మ అయినా భారత్ కి కిరీటాన్ని తీసుకొస్తుందని అందరూ భావిస్తున్నారు.

# శివ పూజకు ఉద్దిష్టమైనది మాస శివరాత్రి





మాస శివ రాత్రి. ప్రతి నెలా వచ్చే మన శివుని పండుగ. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా కృష్ణ పక్షం చతుర్దశి నాడు ఆ భోళా శంకరుని ఉద్దేశించి చేసుకునే పూజ. ఈ రోజున ఉపవాసం, ప్రదక్షిణాలు ప్రత్యేకముగా, విశిష్టముగా ఉంటాయి. చంద్రమా మనసో జాతః అని పెద్దలు చెపుతూ ఉంటారు. అంటే చంద్రుడు మన మనస్సుకు కారకుడు. చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడు కేతువు ప్రభావము ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ చంద్రుడిని తల పైన పెట్టుకున్న చంద్రశేఖరుని శరణు వేడడం సదాచారం. ఓం నమఃశ్శివాయ అనే పంచాక్షరీ మహా మంత్రం యజుర్వేదం రుద్రాధ్యాయం లోనిది. 'న, మ, శి, వ, య. మంత్రం' 'ఓం' కారంతో ప్రారంభం అవుతుంది. ఓం... మహాబీజాక్షరం. 'న' అనేది భగవంతునిలోని కాంతిని తెలియ చేస్తున్న ఈ పంచాక్షరాలను పంచభూతాలు అని కూడా అంటారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు నిర్వచనం చెప్పారు. ఈ మంత్రోచ్చారణ పంచ భూతాల సంబంధంగా చెపుతారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు వివరణ ఇచ్చారు. మానవ శరీరం పంచభూతాత్మకం. నమశ్శివాయ అనే అయిదు అక్షరాలను పలికినప్పుడు పంచ భూతాలతో నిండిన శరీరం శుభ్రమవుతుంది. ఒక్కో అక్షరం ఒక్కో భూతాన్ని శుభ్రం చేస్తుంది. 'న' భూమికి సంబంధించిన భాగాలను, 'మ' నీటికి సంబంధించిన భాగాలను, 'శి' అగ్నికి సంబంధించిన భాగాలను, 'వ' గాలికి సంబంధించిన భాగాలను, 'య' ఆకాశానికి సంబంధించిన భాగాలను పరిశుభ్రం చేస్తాయి. భోళా శంకరుడు అభిషేక ప్రియుడు నాలుగు చుక్కల నీరు పోసి, మూడు దళాలు ఉన్న బిల్వ దళం మనసారా పెడితే సంతోషించి వరాలనిచ్చే వరదుడు. శివభక్తుడైన సౌనంద గణేశ ముని ఒకసారి యమ లోకానికి వెళ్లగా యమధర్మరాజు ఆయనను సత్కరించి, వచ్చిన కారణమేమిటని అడిగాడు. తాను యమలోకంలోని విశేషాలను చూడడానికి వచ్చినట్లు ముని చెప్పారు. దీంతో తన లోకంలో నరక యాతనలు అనుభవిస్తున్న పాపాత్ములను యముడు ఆ మునికి చూపించాడు. వారి పరిస్థితికి జాలిపడిన ఆ మహర్షి.. ఓ జనులారా! ఇది 'ఓం నమశ్శివాయ' అనే మంత్రం దీనిని ఉచ్చరిస్తే మీ యాతనలు పటాపంచ లవుతాయని తెలిపారు. ముని చెప్పగా వారంతా పంచాక్షరిని జపించారు. దీంతో వారికి నరక విముక్తి లభించి, అంతా కైలాసం చేరుకున్నారట. అధికార గర్వముతో దుర్వాస మహర్షిని అవమానించిన దేవేంద్రుడు ఆ మహానుభావుని శాప కారణంగా తన సమస్త సంపదలు సముద్రం పాలు అవ్వడం చూస్తూ ఉండి పోయాడు. మందర పర్వతమును కవ్వముగా, వాసుకిని తాడుగా చేసుకుని క్షీర సాగరమును మథించినప్పుడు ముందుగా లోకాలన్నిటినీ భస్మం చేస్తుందా అని అనిపించేలా ఉగ్రతతో హాలాహలం పుట్టింది. అమ్మవారి అనుమతి తీసుకుని ఆ లోకాధారుడు ఆ కాలకూట విషయాన్ని తాను స్వీకరించి లోకాలను కాపాడాడు. క్షీరసాగర మథనం మరలా కొనసాగేలా చూసాడు. తన లోపల ఉన్న లోకాలకు కష్టం కలగకుండా గొంతులోనే నిలుపుకుని శ్రీకంఠుడు, గరళకంఠుడు, నీలకంఠుడు అయ్యాడు. శివుడికి ఈ రోజును ప్రీతి పాత్రమైన రోజున శివుడికి అభిషేకాలు, పూజలు చేయడం వలన కోరిన కోర్కెలు నెరవేరుతాయి అని ప్రతీతి. శివరాత్రి అనగా శివుని జన్మదినం (లింగోద్భవం) అని అర్థం. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా జరుపుకునేదే మాస శివరాత్రి. మహాశివుడు లయ కారకుడు. లయానికి (మృత్యువునకు) కారకుడు కేతువు. అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి సమయంలో చంద్రుడు క్షీణించి ఉంటాడు. చంద్రమా మనసో జాతః అనే సిద్ధాంతము ప్రకారము చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడూ జీవులపై ఈ కేతు ప్రభావము ఉండటము వలన వారి వారి ఆహారపు అలవాట్లపై ప్రభావము చూపడం వలన జీర్ణశక్తి మందగిస్తుంది. తద్వారా మనస్సు ప్రభావిత మవుతుంది. మాస శివరాత్రి నాడు ఉపవాసము ఉండి, వీలైతే శివాలయ దర్శనం చేసుకొని, శక్తి మేర 3, 5, 11, 18, 21, 54, 108 ఇలా ప్రదక్షిణలు చేయవచ్చు. అదేవిధంగా ఆరోజు ప్రదోష వేళ శివునకు మారేడు దళములతో లేదా కనీసము గంగా జలముతో అభిషేకాది అర్చనలు చేయడము మంచిది. ఇవేమీ చేయడానికి అవకాశములేని వారు, ఆరోగ్యవంతులు, అలాగే గృహములో అశౌచ దోషము లేనివారు ఈ రోజు ఉపవాసము ఉండడం చేయాలి. శివనామ స్మరణ చేస్తూ సాయంకాలం ప్రదోష సమయంలో శివునికి అభిషేకం చేయాలి. అభిషేకానంతరం, బిల్వాష్టోత్తరం చెపుతూ బిల్వ దళాలను శివునికి అర్పించాలి. కనీసం ఉపవాసం ఉండి, సాయం కాలం శివాలయానికి వెళ్ళి దీపారాధన చేసి పంచాక్షరీ మంత్రమైన ఓం నమః శివాయను జపించడం కూడా మంచిది. పన్నెండు మాస శివరాత్రులలో ఏ శివరాత్రికైనా సత్కర్మలు చేయడం వల్ల సత్ఫలితాలు పొందుతారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# చైనా-భారత్ సంబంధాల్లో కొత్త పరిణామాలు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్యయుద్ధం ప్రభావంతో భౌగోళిక రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ పరిణామాల మధ్య న్యూఢిల్లీ-బీజింగ్ సంబంధాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. ఇరుదేశాల మధ్య ఉన్న వైరాన్ని పక్కనబెట్టి, పరస్పర సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్‌కు అత్యవసరంగా కావలసిన ఎరువులు, టన్నెల్ బోరింగ్ యంత్ర పరికరాలు (%టీబీఎం%), రేర్‌ఎర్త్ ఖనిజాల సరఫరాకు చైనా అంగీకరించడం ఈ భేటీ ముఖ్యఫలితంగా నిలిచింది.

**–ఎరువుల సరఫరాలో చైనాపై ఆధారపడుతున్న భారత్..** గత కొన్ని నెలలుగా భారత్‌కు చైనా ప్రత్యేక ఎరువుల ఎగుమతులను నిలిపివేసింది. అయితే ఇతర దేశాలకు మాత్రం అవే ఎరువులను సరఫరా చేయడం



గమనార్హం. పండ్లు, కూరగాయలు, ధాన్య పంటల దిగుబడిని పెంచడంలో ఈ ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయి. వీటి ఉత్పత్తి సామర్థ్యం భారత్‌లో పరిమితంగానే ఉండటం వల్ల 80 శాతం అవసరాలను చైనాపైనే ఆధారపడాల్సి వస్తోంది. 2023లో భారత్‌కు రావాల్సిన యూరియాను కూడా చైనాకు చెందిన రెండు పెద్ద కంపెనీలు నిలిపివేశాయి. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. తాజాగా వాంగ్‌యీ పర్యటనలో ఎరువుల సరఫరా సమస్యపై జైశంకర్ ప్రస్తావించగా, చైనా ప్రభుత్వం సహకరించేందుకు సిద్ధమని తెలిపింది.

**– తైవాన్‌పై భారత వైఖరి స్పష్టత...** తైవాన్ విషయంలో భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని జైశంకర్ స్పష్టం చేశారు. తైపీలో భారత ప్రతినిధులు కేవలం ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల కోసం మాత్రమే ఉన్నారని ఆయన వాంగ్‌యీకి వివరించారు.

**– రాబోయే సమావేశాల ప్రాధాన్యత...** నేడు సరిహద్దు సమస్యలపై ప్రత్యేక ప్రతినిధుల 24వ సమావేశం జరుగనుంది. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో వాంగ్‌యీ ఉదయం 11 గంటలకు భేటీ అయ్యారు.. ఈరోజు సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో కూడా ఆయన సమావేశమవుతారు.

**– ద్వైపాక్షిక సంబంధాలకు ఊపు...** ఇరుదేశాల మధ్య ఏర్పడిన కొత్త అవగాహన ఒప్పందాలు, గత చర్చల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడమే వాంగ్‌యీ పర్యటన ప్రధాన ఉద్దేశమని చైనా వెల్లడించింది. ముఖ్యంగా ఎరువులు, రేర్‌ఎర్త్ మినరల్స్ వంటి కీలక వనరుల సరఫరా పునరుద్ధరణతో భారత్%–%చైనా సంబంధాలు మళ్లీ సాధారణ స్థితికి చేరుకోవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# మోడీ ఎఫెక్ట్ : అమెరికాలో మెలోనీ 'నమస్తే'.. వైరల్

అమెరికా వైట్‌హౌస్‌లో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చేసిన చిన్న సంస్కార హావభావం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబించే 'నమస్తే' అంటూ అధికారులను పలకరించిన ఆమె వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ దృశ్యాన్ని చూసిన నెటిజన్లు "ఇది మోదీ ఎఫెక్ట్" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

**వైట్‌హౌస్‌లో మెలోనీ ప్రత్యేక శైలి...** ఉక్రెయిన్–రష్యా యుద్ధ పరిష్కారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్%–%జెలెన్‌స్కీ భేటీకి హాజరయ్యేందుకు వైట్‌హౌస్‌కు చేరుకున్న మెలోనీకి ఆతిథ్యమిచ్చిన అధికారులు ముందుగా షేక్‌హ్యాండ్స్‌తో స్వాగతం పలికారు. అయితే ఆమె కేవలం చేతులు కలపడం మాత్రమే కాకుండా భారతీయ శైలిలో



రెండు చేతులు జోడించి 'నమస్తే' అన్నారు. ఈ హావభావం చూసిన వారంతా ఆశ్చర్యపోయారు.

**– మోదీ ఎఫెక్ట్?...** ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికలపై 'నమస్తే'ను ప్రాధాన్యం ఇవ్వడం తెలిసిందే. కరోనా కాలంలోనూ, అధికారిక సమావేశాల్లోనూ ఆయన 'నమస్తే'ను గౌరవప్రదంగా ఉపయోగించారు. అదే ప్రభావం మెలోనీపై పడిందని నెటిజన్లు భావిస్తున్నారు. "ఇది మోదీ ఎఫెక్ట్", "ఇండియన్ కల్చర్ గ్లోబల్ లెవెల్‌లోకి వెళ్ళింది" అంటూ సోషల్ మీడియాలో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**– ఇది తొలిసారి కాదు..** మెలోనీ 'నమస్తే' చెప్పడం ఇదే తొలిసారి కాదు. 2024లో ఇటలీలో జరిగిన జీ7 సమ్మిట్‌లో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డేర్ లేయన్, యూకే ప్రధాని రిషి సునాక్, భారత ప్రధాని మోదీలకు ఆమె నమస్కారం చేసి స్వాగతం పలికారు. ఆ వీడియో కూడా అప్పుడు విపరీతంగా వైరల్ అయ్యింది.

**– గ్లోబల్ గుర్తింపు పొందుతున్న భారతీయ సంప్రదాయం...** భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా గౌరవం పెరుగుతోంది. 'నమస్తే' అనేది కేవలం అభివాదం మాత్రమే కాకుండా, "నేను నిన్ను గౌరవిస్తున్నాను" అనే అర్థాన్ని ఇచ్చే సంస్కార పద్ధతి. దీనిని మెలోనీ లాంటి అంతర్జాతీయ నేతలు అనుసరించడం భారతీయ సంస్కృతికి పెరుగుతున్న గౌరవానికి నిదర్శనం.

చురకలు

## సంపాదకీయం

### జీఎస్టీ 2.0: సామాన్య ప్రజలకు డబుల్ ధమాకా!

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రధాని నరేంద్ర మోదీ, దేశ ప్రజలకు ఒక గొప్ప శుభవార్తను అందించారు. ఈ దీపావళికి దేశానికి "డబుల్ ధమాకా" అందిస్తామని ప్రకటించారు. అందులో అత్యంత ముఖ్యమైనది, సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు, మధ్య తరహా పరిశ్రమలకు భారీగా ఊరటనిచ్చే జీఎస్టీ 2.0 సంస్కరణలు. ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలకనున్నాయి.

**జీఎస్టీ 2.0లో కీలక మార్పులు**... ప్రస్తుతం, జీఎస్టీలో 0%, 5%, 12%, 18%, 28% అనే ఐదు స్లాబ్‌లు ఉన్నాయి. వీటికి అదనంగా కొన్ని విలాసవంతమైన వస్తువులపై కంపెన్సేషన్ సెస్ కూడా ఉంది. అయితే, కొత్త సంస్కరణల్లో ఈ నిర్మాణంలో గణనీయమైన మార్పులు రాబోతున్నాయి. 12% స్లాబ్‌ను పూర్తిగా రద్దు చేసి, అందులోని వస్తువులను 5% లేదా 18% స్లాబ్‌లలోకి మార్చనున్నారు. ముఖ్యంగా, 12% స్లాబ్‌లోని 99% వస్తువులను 5% స్లాబ్‌లోకి మార్చే అవకాశం ఉంది. అత్యధిక పన్ను రేటు అయిన 28% స్లాబ్‌లోని 90% వస్తువులు 18% స్లాబ్‌లోకి రానున్నాయి. దీని వల్ల అనేక గృహోపకరణాలు, ఇతర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయి. విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై ప్రస్తుతం ఉన్న సెస్‌కు బదులుగా 40% ఏకరీతి రేటును విధించాలని ప్రతిపాదించారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సమస్యలు, రిఫండ్ ప్రక్రియలను మరింత సులభతరం చేయనున్నారు, ఇది చిన్న వ్యాపారులకు గొప్ప ఉపశమనం.

**- ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి?...** జీఎస్టీ రేట్ల తగ్గింపుతో కొన్ని ముఖ్యమైన వస్తువుల ధరలు తగ్గుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గృహోపకరణాలు అయిన ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మెషీన్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు 28% నుంచి 18% స్లాబ్‌లోకి మారడం వల్ల తగ్గే అవకాశం ఉంది. ఆహార ఉత్పత్తులు అయిన ఫ్రూట్ జ్యూస్‌లు, బటర్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్, సాసేజ్‌ల వంటి వాటి ధరలు తగ్గుతాయి. ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులు మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, గాజ్, బ్యాండేజ్‌లు, డయాగ్నస్టిక్ కిట్‌లు వంటి వైద్య ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్ల ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గుతాయి. బీమా సేవలు అయిన ఆరోగ్య, జీవన బీమా ప్రీమియంలపై జీఎస్టీ 18% నుంచి 12% లేదా 5%కి తగ్గవచ్చు, ఇది మధ్యతరగతి వారికి పెద్ద ఊరట. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు అయిన చిన్న ప్యాకెట్లలో లభించే షాంపూలు, సబ్బుల వంటి రోజువారీ అవసరాల ధరలు తగ్గుతాయి.

**- ఆర్థిక వ్యవస్థపై ప్రభావం...** ఈ సంస్కరణల వల్ల ఆర్థిక వ్యవస్థపై అనేక సానుకూల ప్రభావాలు ఉండనున్నాయి. సామాన్య ప్రజలకు ఊరట లభిస్తుంది. రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, జీవన నాణ్యత మెరుగుపడుతుంది. ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుంది. ధరలు తగ్గడం వల్ల వినియోగం పెరుగుతుంది, ఇది దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. ఎంఎస్ఎంఈలకు లాభం చేకూరుతుంది. సరళీకృత పన్ను నిర్మాణం, తగ్గిన రేట్లతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపార వ్యయాలు తగ్గుతాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. పన్ను నిర్మాణం సులభం కావడం వల్ల పన్ను వివాదాలు తగ్గి, వ్యాపార వాతావరణం మెరుగుపడుతుంది. దీంతో వ్యాపారులు మరింత సులభంగా తమ కార్యకలాపాలను నిర్వహించగలుగుతారు. పన్ను రేట్ల తగ్గింపు వల్ల స్వల్ప కాలంలో ప్రభుత్వ ఆదాయంపై కొంత ప్రభావం ఉన్నప్పటికీ, వినియోగం పెరగడం వల్ల దీర్ఘకాలంలో ఈ లోటు భర్తీ అవుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ సంస్కరణలు నిజంగానే దీపావళికి సామాన్య ప్రజలకు ఒక గొప్ప బహుమతిగా మారబోతున్నాయి.

## తెలుగు మహిళల హృదయ నేత్రి మాలతీ చందూర్ - ఆగస్టు 21...మాలతీ చందూర్ వర్ధంతి



ప్రపంచం గర్వించదగ్గ తెలుగు స్త్రీవాద రచయిత్రి మాలతీ చందూర్. చదువు ఎక్కువగా చదువక పోయినా, తెలుగు భాషకు, తెలుగు మహిళకు పట్టాభిషేకం చేసి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతగా గుర్తింపు పొందిన ప్రతిభాశాలి. రచయిత్రిగా, కాలమిస్టుగా, 1950ల నుండి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి ఆమె సుపరిచితం. మాలతీ చందూర్ (1930 - ఆగష్టు 21, 2013) కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జన్మించారు. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణం పక్కనే ఎస్ఆర్ఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు ఎస్ఎస్ఆర్ పాఠశాలలోనే చదివారు. 8వ తరగతి పూర్తి కాగానే ఏలూరు వెళ్ళి, అక్కడ వారి మామయ్య (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి.కామేశ్వరి, ఆనందా రామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పరుచు కున్నారు. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. 1947లో ఆమె, తన మేన మామ ఎన్. ఆర్. చందూర్ రచయిత, జగతి పత్రిక సంపాదకులు)ను వివాహం చేసుకున్నారు. మద్రాసు చేరుకుని, జార్జిటౌన్‌లో అద్దె ఇంటిలో ఉంటూ, మద్రాసులో ప్రైవేటుగా ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్‌లో ఉన్న రేడియో స్టేషన్‌కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళిన అనుభూతిని పొందేవారు. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి.రాజమన్నార్, ముని మాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. భర్త చందూర్‌ను ఎప్పుడూ "మామయ్య"గానే సంబోధించే మాలతి అన్యోన్య దాంపత్యలో ఆనందాన్ని పొందారు. సంతానం లేని మాలతీ, చందూర్ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు. మద్రాసులో తెలుగు సాహితీ సంస్థలకూ, సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' నిర్వహణలో, అభివృద్ధిలో దంపతులు ప్రధాన పాత్రలు పోషించారు. 1950లలో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'ప్రమదావనం' పేరిట స్త్రీల కోసం ప్రత్యేకంగా మాలతీ చందూర్‌తో కాలమ్ ప్రారంభించారు. ప్రమదావనం ద్వారా దశాబ్దాల కాలంగా పాఠకులతో ప్రశ్నలు, జవాబులు శీర్షికను విజయ వంతంగా నడుపుతూ, తెలుగు కాలమిస్టుల చరిత్రలో మాలతీ చందూర్ ఓ అరుదైన ఘనత సాధించారు. ఆ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం మొదలైనవి చేశారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారు. ఎప్పుడూ వంటింటికి దూరంగానే గడిపిన మాలతీ చందూర్ రాసిన 'వంటలు - పిండి వంటలు' రచన తెలుగునాట ఎంతో ప్రసిద్ధం. వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి. మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగవారు కూడా చదివేవారు. 'జవాబులు' శీర్షిక పేజీలను వారపత్రిక నుండి చించి, పుస్తకాలుగా బైండింగులు చేసి, చాలామంది అపురూపంగా దాచుకొనేవారు. స్వాతి' మాస పత్రిక ప్రారంభ రోజుల నుండి మూడు దశాబ్దాల పైచిలుకుగా 'పాత కెరటాలు' శీర్షిక నిర్వహించారు. చంపకం - చెద పురుగులు' (1955 సెప్టెంబర్ లో ప్రథమ ముద్రణ) తో ప్రారంభించి, దాదాపు 150కి పైగా కథలు ఆమె రాశారు. మహిళా ప్రధాన నవలలు రాయటమే కాక 300 కు పైగా రచనలను తెలుగులోకి అనువదించారు. ఇవి 'పాత కెరటాలు' శీర్షికన స్వాతి మాసపత్రికలో ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకొన్నది. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. అందుకోసం తమిళ తమిళ భాష నేర్చుకుని, రెండేళ్లకే అనువాదాలు ప్రారంభించి, ప్రముఖ తమిళ రచయితలు శివశంకరి, జయకాంతన్, ఎన్.ఎ.పార్థసారథి, పుళమై పిత్తన్, సుజాత, కలైంజర్ కరుణానిధి తదితరులు చేసిన తమిళ రచనలను ఆమె తెలుగులోకి అనువదించారు. భారత స్వాతంత్ర్య సమర కాలంలో జరిగిన ప్రసిద్ధ చీరాల - పేరాల ఉద్యమ నేపథ్యంతో 'వనిత' మాసపత్రికలో ఆమె రాసిన 'హృదయ నేత్రి' నవలకు 1990వ దశకం తొలి రోజుల్లో కలకత్తాలోని 'భారతీయ భాషా పరిషత్' వారి ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు వరించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను పొందారు. 2013 ఆగష్టు 21 న చెన్నైలో మాలతీ కన్ను మూసారు. మృతి చెందడానికి ముందు క్యాన్సర్ వ్యాధి గ్రస్తులయ్యారు. మెడికల్ కాలేజీకి ఆమె శరీర దానం చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## అసమాన సంగీత దర్శకులు ఆది నారాయణ రావు - ఆగస్టు 21... పి.ఆదినారాయణ రావు జయంతి

భారతీయ సంప్రదాయ సంగీతాన్ని సినిమా శైలికి మార్చిన గొప్ప సంగీత విద్వాంసులు ఆదినారాయణ రావు. తన సంగీతంతో అనేక పాటలకు ప్రాణం పోశారు. సరైన టెక్నాలజీ లేని రోజుల్లో ఆయన స్వరపరచిన పాటలు నేటి పాటలకు ఏవిధంగానూ తీసి పోకుండా వున్నాయి. అటు సంగీత ప్రియులను, ఇటు సామాన్యులను, తన సంగీతంతో మంత్రముగ్ధుల్ని చేసిన సంగీత మాంత్రికులు ఆయన. దశాబ్దాల కాల గమనంలో తెలుగు వారి నోళ్ళలో ఆయన స్వర పరిచిన పాటలు వేల నోళ్ళలో నానుతోనే ఉన్నాయి. పెనుపాత్రుని ఆదినారాయణ రావు (ఆగష్టు 21, 1914 - జనవరి 25, 1991) తెలుగు సినిమా సంగీత దర్శకులు, నిర్మాత. సినీ సంగీత సామ్రాణిగా ఒకనాడు తెలుగు చిత్రసీమకు ఏలిన... ఆయన సతీమణి, నటి అంజలీదేవి పేరుతో స్థాపించిన అంజలీ పిక్చర్స్ అధినేత ఆది నారాయణ రావు. ఆయన ఆగష్టు 21, 1914 సంవత్సరంలో విజయవాడలో కృష్ణాష్టమి రోజున జన్మించారు. బాల్యం లోనే శ్రీ రాజరాజేశ్వరి నాట్యమండలి వారి 'సావిత్రి' నాటకంలో నారదుని పాత్ర పోషించారు. విజయ నగరం జిల్లా సాలూరుకు చెందిన 'పెద గురువు' అనే పట్రాయని నరసింహశాస్త్రి వద్ద గాత్రం, హార్మోనియం వాయిద్యాలలో శిక్షణ పొందారు. తరువాత కాకినాడ మెక్లారిన్ ఉన్నత పాఠశాలలో మెట్రిక్ చదివారు. అప్పుడు అమెచ్యూర్ అసోసియేషన్, బర్మాషెల్ అసోసియేషన్ సంస్థలకు రచన, సంగీత బాధ్యతలు వహించే వారు. ఆ తరువాత సి.పుల్లయ్య దర్శకత్వం వహించిన గొల్లభామ చిత్రానికి గీత రచయితగా చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు. 1950లో బి.ఎ.సుబ్బారావు నిర్మించిన పల్లెటూరి పిల్ల చిత్రానికి మొదటిసారిగా సంగీత దర్శకత్వం వహించారు. అర్ధాంగి అంజలీదేవి పేరుతో 1953లో అంజలీ పిక్చర్స్ స్థాపించారు. అంజలీదేవి తన భర్త ఆదినారాయణ రావుతో కలసి సొంత నిర్మాణ సంస్థ 'అంజలీ పిక్చర్స్'ను స్థాపించి తెలుగు, తమిళం, హిందీ భాషలలో దాదాపు 28 సినిమాలను నిర్మించారు. అనార్కలి, చండీప్రియ, సువర్ణ సుందరి, స్వర్ణ మంజరి, మహాకవి క్షేత్రయ్య, భక్త తుకారాం వంటి సంగీత ప్రధాన చిత్రాలను నిర్మించారు. 1955లో నిర్మించిన అనార్కలి చిత్రం వీరిని ఉత్తమ నిర్మాతల కోవలోకి చేర్చింది. ఇందులోని 'రాజశేఖరా నీపై మోజు తీరలేదురా' అనే మధుర గీతం ఆయన సంగీత స్వర విన్యాసానికి ఒక మచ్చుతునక. 1957లో రూపొందించిన సువర్ణ సుందరి తెలుగు, తమిళ, హిందీ భాషలలో స్వర్ణోత్సవాలు జరుపుకున్న సంగీత సంగీత నిధి. సతీ సక్కుబాయి ఆయన కీర్తి కిరీటాన మరో కలికితురాయి. చండీప్రియ (1980), కన్నవారిల్లు (1978), మహాకవి క్షేత్రయ్య (1976) - నిర్మాత కూడా, అల్లూరి సీతా రామరాజు (1974), భక్త తుకారాం (1973), పెద్ద కొడుకు (1972), మోసగాళ్ళకు మోసగాడు (1971), అగ్ని పరీక్ష (1970), అమ్మ కోసం (1970) - నిర్మాత కూడా, సతీ సక్కుబాయి (1965), స్వర్ణ మంజరి (1962) - నిర్మాత కూడా, ఋణాను బంధం (1960), సువర్ణ సుందరి (1957) - నిర్మాత, రచయిత కూడా, అనార్కలి (1955), అన్నదాత (1954), పరదేశి (1953) - నిర్మాత కూడా, మాయల మారి (1951), పల్లెటూరి పిల్ల (1950), గొల్లభామ (1947) తదితర తెలుగు, తమిళ సినిమాలకు సంగీతం కూర్చారు. ఆయన 1991 సంవత్సరంలో జనవరి 25 న పరమ పదించారు. తెలుగు సంగీత ప్రియుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**




## వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి - ఆగష్టు 21... నేషనల్ సీనియర్ సిటిజన్స్ డే

బాల్య, కౌమార్య, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికయినా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. 'ఎండుటాకును చూసి పచ్చుటాకు నవ్వింది' అని తెలుగులో ఒక సామెత ఉంది. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండుటాకును చూసి చెట్టు రెమ్మలకు వేలాడే పచ్చుటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండుటాకు రాలిపోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యము లేదా ముసలితనము మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరము రోగనిరోధక శక్తిని క్రమక్రమముగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యముగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలే వృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగష్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపు కుంటున్నారు. ఐక్య రాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదుమందిలో ఒకరు 60 ఏళ్లు ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకితం అయేందుకు గాను ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపుతున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్ళకు, మునిమనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈ చట్టాలు అమలుకు పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదన్నది



తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ కావడంతో- వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసు కోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15 కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటు లోకి రావడంతో ఆయుర్దాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదే స్థాయిలో అధిక మవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 60 ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షల మంది ఉన్నారు. 80 ఏళ్లకు పైబడిన వారి 'సూపర్ సీనియర్ సిటిజన్స్' అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండి పోతాయట! అంటే వృద్ధుల జనాభా 120 కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమ పూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప- ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాలలోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందను కుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకని వారు మరచి పోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టు కుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసు కుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై 'హెల్పేజ్ ఇండియా' వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. సొంత కుటుంబ సభ్యులనుంచే నిరాదరణ ఎదురవుతోందంటూ 56 శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంటగలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టం'గా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధపడుతున్నారని జాతీయ నమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటుకావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే- రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొంద గలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నిర్వహణ నిధులేవి?



రెబ్బెన : కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా ప్రాథమిక పాఠశాలలో 1–5 తరగతుల్లో 32 విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల పథకంలో నల్లాలు బిగించారు. స్లాబ్ తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. రిజిస్టర్లు, చాక్‌పీసులు కోసం ప్రధానోపాధ్యాయుడే జేబు నుంచి కొనుగోలు చేస్తున్నారు. భవనానికి కొన్నేళ్లుగా సున్నం కూడా వేయడం లేదు. విద్యార్థులు నేలపైనే కూర్చుని చదువులు సాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం నిధులు ఇంతవరకు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తూ పనులు కొనసాగిస్తున్నారు. ఏటా సర్కారు బడుల్లో వివిధ కార్యక్రమాలు, కార్యకలాపాల నిర్వహణ కోసం నిధులు విడుదల చేస్తుంది. 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభమై 65 రోజులు దాటుతున్నా.. ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. ప్రతి విద్యాసంవత్సరంలో పాఠశాలలకు రెండుసార్లు నిధులు కేటాయిస్తారు. వీటితో హాజరు రిజిస్టర్లు, చాక్‌పీసులు, ప్రయోగశాలలకు అవసరమైన సామగ్రి, తాగునీరు, తరగతి గదుల చిన్నపాటి మరమ్మతులు చేపడతా రు. జాతీయ పండగలు, పరీక్షల నిర్వహణకూ ఖర్చుచేస్తారు. జులై తొలి వారంలో మంజూరు కావాల్సి ఉంది. గతేడాది నుంచి ఆలస్యం చేస్తుండటంతో.. ప్రధానోపాధ్యాయులు తమ జేబు నుంచి డబ్బులు వెచ్చిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాడే విద్యార్థులకు పాఠ్య, నోటుపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా జిల్లా విద్యాధికారులు సఫలీకృతులయ్యారు. పాఠశాలల నిర్వహణ నిధుల విడుదల విషయంలో వెనుకబాటు కనిపిస్తోంది.

**కేటాయింపు ఇలా..** విద్యార్థుల సంఖ్య ఆధారంగా బడులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. 30మంది లోపు ఉంటే రూ.10 వేలు, 31–100 మందికి రూ.25 వేలు, 100–250 మందికి రూ.50 వేలు, 251–1000 మంది ఉంటే రూ.75 వేలు, వెయ్యికి పైగా ఉ ంటే రూ.లక్ష వరకు మంజూరు చేస్తారు. బడి బాట కార్యక్రమానికి రూ.1000, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు రూ.1000 రావాల్సి ఉంది. క్రీడల నిర్వహణకు ప్రాథమికకు రూ.5 వేలు, ప్రాథమికోన్నతకు రూ.10,000, జడ్పీ ఉన్నత పాఠశాలలకు రూ.25 వేలు కేటాయిం చారు. ఇవి కూడా రాలేదు.

**పలుచోట్ల సమస్య..**

రెగ్యులర్ ఉపాధ్యాయులు లేని పాఠశాలల నిర్వహణ నిధులు సమీప పాఠశాలల ప్రధానోపాధ్యాయుడి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వారికి నిధులు అందడం లేదనే ఆరోపణలున్నాయి. తాము చేసిన ఖర్చుల వివరాలు సమీప పాఠశాలల హెచ్ఎంలకు అందజేసిన దాంట్లో కోత విధించి ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై ఎంఈఓ వాసాల ప్రభాకర్‌ను వివరణ కోరగా.. నిర్వహణ నిధులు త్వరలోనే విడుదల కానున్నాయని తెలిపారు. డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పాఠశాలల ఉపాధ్యాయులకు నిధులు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జిల్లా వివరాలు

| | |
|---|---|
| మొత్తం పాఠశాలలు | 721 |
| ప్రాథమిక పాఠశాలలు | 561 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 100 |
| ఉన్నత పాఠశాలలు | 60 |
| విద్యార్థుల సంఖ్య | 96,342 |

## చెప్పేందుకు ఏమున్నదిక..!

కూసుమంచి : ఈసారి భారీ వర్షాలు.. మండలంలో రైతులను అతలా కుతలం చేశాయి. వారంలో మూడు రోజులు, జిల్లాలోనే అత్యధికంగా కూసుమంచిపైనే కేంద్రీకృతమైనట్లు కుండపోత వర్షాలు కురిశాయి. ఫలితంగా వాగులు, వంకలు పొర్లి పొలాల్లోకి వరద పోటెత్తింది. వందలాది ఎకరాల్లో పొలాలు కోతకు గురికావడం, ఇసుక, వ్యర్థాలు మేటవేసి నష్టం వాటిల్లింది. వరద చేరి చెరువులన్నీ అలుగు పారడంతోపాటు, వెనక్కి పోటెయ్యడంతో వందల ఎకరాల్లో నాటువేసిన పొలాలు ముంపునకు గురయ్యాయి. శనివారం వర్షం కురవక పోవడంతో ఆ పొలాలు నీటిలోనుంచి బయటకు తేలాయి. అన్నీ కుళ్లిపోయి కన్పిస్తుండటంతో రైతులు దిగాలు చెందారు. పత్తి పైరుదీ



ఇదే దుస్థితి.వ్యవసాయ అధికారుల అంచనా..

కోతకు గురైన, ఇసుక మేట వేసిన, మునకకు గురైన పొలాలు: 1200 ఎకరాలు నీరు నిల్వడంతో పత్తి పైరుకు నష్టం: 300 ఎకరాలు

మండలంలో సాధారణ, నమోదైన వర్షపాతం (మి.మీ) ఇలా..

సాధారణ కురిసిన వర్షం

జులై 216.0 298.1

ఆగస్టు 17 వరకు 205.6 404.4

## జలసిరి.. అన్నదాతకు ఊపిరి

జగిత్యాల : ఈ వానాకాలంలో గోదావరి బేసిన్‌లోని ఉ మ్మడి జిల్లాకు ఆలస్యంగానైనా జల అభయం సిద్ధించింది. భారీ వర్షాలతో ప్రధాన ప్రాజెక్టుల్లోకి నీరు చేరడంతో ఆశావహ పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీరామసాగర్‌లోకి 1.51 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశముంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు 10 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ నీటిని మధ్యమానేరు జలాశయానికి తరలిస్తారు. ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లోనుబట్టి వరద కాలువకు 22 వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదలచేసి మధ్యమానేరుకు తరలించే అవకాశముంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తుండటంతో కొంతమేర గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

**మధ్యమానేరు నుంచి ఎల్ఎండీకి**

ఎల్లంపల్లినుంచి 9,450 క్యూసెక్కుల నీటిని నంది పంపుహౌస్ ద్వారా ఎత్తిపోసి మధ్యమానేరుకు తరలిస్తున్నారు. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి



ప్రాజెక్టుల నుంచి రోజుకు సగటున 1.5 టీఎంసీలకుపైగానే మధ్యమానే రులోకి వచ్చి ప్రాజెక్టు త్వరలోనే నిండనుంది. దీంతో మధ్యమానేరు నుంచి ఎల్ఎండీకి.. అనంతరం అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు కూడా నీటిని ఎత్తిపోసే వీలు కలగనుంది.

**ఇవన్నీ చేస్తే పూర్తి అభయం**

జగిత్యాల, నిర్మల్ జిల్లాల మధ్యలో గోదావరిపై నిర్మించిన సదర్‌మాట్ ప్రాజెక్టులోకి నీటి నిల్వ, గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలించే అనుబంధ తూముల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. బీర్‌పూర్‌లో రూ.165 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ప్రాజెక్టు గేట్లను బిగించి నీటిని నిల్వ చేయడం, వరద కాలువ నుంచి వేములవాడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చేపట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాకు జల అభయం కలగనుంది.

## గుంతల వ్యథ.. పట్టదా ప్రజల నివేదన!

వీర్నపల్లి: జిల్లాలో చిన్నపాటి రోడ్డు సమస్యలకూ పరిష్కార మోక్షం లభించడం లేదు. ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నా వారి మొరను ఆలకించేవారు లేకుండాపోతున్నారు. రోడ్లపై వర్షం నీరు నిలుస్తుండటంతో సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయని.. ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించి తగిన మరమ్మతులు చేపట్టాలని.. అవసరమైన చోట్ల నూతన రోడ్డు వేయాలని వాహనదారులు కోరుతున్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రహదారి విస్తరణ అసంపూర్తిగా నిలిచింది. ఏళ్ల కిందట తారు తొలగించడంతో సుమారు 400 మీటర్ల మేర మట్టి రోడ్డే దిక్కయింది. మురుగు కాలువలు లేక వరద, మురుగు రోడ్డుమీదకు వచ్చి చేరుతోంది. నీటి నిల్వతో గుంతలు, బురద ఏర్పడి వాహనాలు కూరుకుపోతుంటే... ద్విచక్రవాహనదారులపై బురద పడుతోంది.

**నాంపల్లి బస్టాప్ వద్ద..** వేములవాడ నుంచి కరీంనగర్ ప్రధాన రహదారిలోని నాంపల్లి బస్టాప్ వద్ద భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇక్కడే పక్కనున్న హోటళ్ల నిర్వాహకులు రహదారిని ఆక్రమించి పెద్ద వేయడంతో రహదారి ఇరుకుగా మారింది. మురుగునీటి కోసం గోతులు తవ్వడం ప్రమాదకరంగా మరింత మారిందని ప్రయాణికులు వాపోతున్నారు.

**మర్రిపేట శివారులో..**

కోనరావుపేట మండలం మర్రిపేట శివారులోని నాగారం ప్రధాన రోడ్డులో కల్వర్టుకు ఇరువైపులా తారు చెదిరి గుంతలమయంగా మారింది. సమీపంలోకి వచ్చే వరకూ గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

**వాహనదారుల ఇక్కట్లు**

ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో రోడ్లపై నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల సమీపంలో ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు మరింత ఇబ్బందిగా మారింది. గ్రామశివారులో, మోహినికుంట బస్టాండ్ ఆవరణలో పెద్దగుంతలు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు గుంతల్లో మట్టిపోసి పూడ్చేలా చొరవ చూపాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**రాచర్ల బొప్పాపూర్ – పోచమ్మకుంట్టకు వెళ్లే దారిలో..**

రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని పోచమ్మకుంట్టకు వెళ్లే దారిలో కిష్టం ఇంటి వద్ద, స్థానిక మజీద్ సమీపంలో విద్యుత్తు నియంత్రిక ఎదుట భారీ గుంతలేర్పడ్డాయి. వాహనాలు అదుపుతప్పి, పలువురు గాయాలపాలవు తున్నారు. సీసీ రహదారి వేసిన సమయంలో కొద్దిపాటి ఖాళీ ఏర్పడడంతో ఆ ప్రాంతాలు గుంతలుగా మారాయి.

# అనర్హులకు రేషన్ కార్డులు..!




మధిర : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇటీవల పెద్ద మొత్తంలో రేషన్ కార్డులు అందించింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హులు వచ్చి చేరారు. మీసేవ రూపంలో అందిన దరఖాస్తులను అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులకు కార్డులు మంజూరు చేయాలి. ఇంతవరకు బాగానే ఉన్నా.. మధిర మండలంలో విచారణలో లోటుపాట్ల కారణంగా అర్హతలేని వారికి ప్రయోజనం దక్కిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మధిర మండలంలో నూతన రేషన్ కార్డుల కోసం 2029మంది దరఖాస్తు చేశారు. విచారణ అనంతరం 1,839మందికి కార్డులందిం చారు. వీరిలో కొందరు అర్హత లేకున్నా దళారుల ద్వారా కార్డులు పొందారన్న ఆరోపణలున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. మధ్యవర్తుల సాయంతో ఒక్కొక్కరి నుంచి రూ. 2–5 వేల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ సమయంలో మేనేజ్ చేయటం ద్వారా అనర్హులకు లబ్ధి చేకూర్చగలిగినట్టు తెలుస్తోంది. డబ్బులు ముట్టజెప్పిన వారిలో కొందరికి కార్డులు మంజూరు కాలేదు. చక్రం తిప్పిన వ్యక్తి బదిలీ అయిపోవటం తో, కార్డుల కోసం నగదు చెల్లించామని ఆరోపిస్తున్నారు. బియ్యం కోసం కాకున్నా ఆరోగ్యశ్రీ, ఇతర అవసరాల కోసం రేషన్ కార్డు ఉ ండాలని అనర్హులు భావించటం దళారులకు పండుగలా మారింది.

**మచ్చుకు కొన్ని..**

మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పదెకరాల పొలం ఉంది. ఆ వ్యక్తి దరఖాస్తు చేసుకోగా కార్డు మంజూరైంది. మహదేవపురానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నా డు. అతనికి గ్రామంలో భారీగానే పొలం ఉంది. అయినా అధికారులు అర్హుల జాబితాలో చేర్చారు.మధిర పట్టణం వైరారోడ్డుకు చెందిన ఓ వ్యక్తికి రెండు అంతస్తుల భవనం ఉంది. ఇతను రూ.కోట్లలో స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటాడు. పదిహేను ఎకరాలకు పైగా పొలమూ ఉ ంది. అయినా అధికారులు కరుణించారు.మధిర పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఉపాధ్యాయ కాలనీలో రెండంతస్తుల భవనం ఉంది. ఇతనికీ కార్డు మంజూరు చేశారు.వివరాలు ఇవ్వకుండా తప్పుదారి పట్టిస్తే సహించం..రేషన్‌కార్డులు అనర్హులకు వస్తే విచారణ నిర్వహించి తొలగిస్తాం. పేదలకే ప్రభుత్వం కార్డులు అందించాలని సంకల్పించింది. ప్రభుత్వానికి సరైన వివరాలు ఇవ్వకుండా తప్పుదారి పట్టిస్తే సహించం.రాళ్లబండి రాంబాబు, తహసీల్దార్

# ఊరించి.. ఉసూరుమనిపించి!

ఖమ్మం : జిల్లాలో సాగర్ కాలువల కింద సాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన కాలువ, బోనకల్ బ్రాంచి, మధిర బ్రాంచి కాలువ, 16, 17 (నందిగామ) బ్రాంచి కాలువ సహా మేజర్ కాలువలపై క్రాస్ రెగ్యులేటర్ల నిర్వహణ సక్రమంగా లేదు. ప్రస్తుత సీజన్‌లో సాగర్ ఆయకట్టులో పుష్కలంగా నీరున్నా క్షేత్ర స్థాయిలో దీన్ని నిర్వహించే లస్కర్లు లేకపోవటంతో పూర్తి స్థాయిలో పంట పొలాలకు నీరందటం లేదు.



**అడుగు ముందుకు పడలేదు..** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది లస్కర్లను నియమించాలని నిర్ణయించింది. జిల్లాలో 176 లస్కర్, 49 హెల్పర్ పోస్టులు ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించి వారికి నెలకు రూ. 15,600 వేతనం ఇవ్వాలని గత ఖరీఫ్ ముగింపు దశలో నిర్ణయించారు. గతేడాది రబీ సీజన్ నాటికి వీరిని అందుబాటులో తేవాలని నిర్ణయించారు. ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో గుర్తించి నియామక ప్రక్రియ చేపట్టాలని స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని సాగునీటి విభాగం అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో జిల్లాలో పెద్ద మొత్తంలో దరఖాస్తులందాయి. ఆ తర్వాత 'మేం చెప్పిన వారికి ఇవ్వాలంటూ' రాజకీయ ఒత్తిళ్లు రావటం, నియామక ప్రక్రియలో స్పష్టమైన విధివిధానాలు లేకపోవటంతో పీటముడి పడింది. ఎంపిక ప్రక్రియలో విధివిధానాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించటంతో నియా మకాలు అటకెక్కాయి. మార్చి 31తో రబీ సీజన్ పూర్తయి, ప్రస్తుత వానాకాలం ముగింపునకు వస్తున్నా లస్కర్ల నియామకాల్లో అడుగు ముందుకు పడలేదు. దీంతో దరఖాస్తుదారులు వేచిచూస్తున్నారు.

**గతంలో ఇలా..**

సాగర్, చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టు ఆయకట్టు భూములకు సాగునీటి సరఫరాలో లస్కర్లు క్రియాశీలకంగా వ్యవహరించేవారు. ఎక్కడ, ఎలాంటి పంటలు సాగు చేస్తున్నారు? ఎంత నీరు ఏ సమయంలో సరఫరా చేయాలని వీరికి అవగాహన ఉండేది. కేటాయించిన ప్రాంతంలో కాలువలపై పిచ్చిమొక్కలు, ముళ్ల కంప తొలగించేబాధ్యత ఉండేది. తూములు, షట్టర్ల పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లేవారు. లస్కర్లు దాదాపుగా ఉద్యోగ విరమణ చేయగా, కొత్త నియామకాలు చేపట్టలేదు.

**ఇప్పుడిలా..**

రైతులే కాల్వల వెంట తిరుగుతూ తూముల షట్టర్లు ఎత్తటం, దించటం చేస్తున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుం టున్నాయి. పెద్ద క్రాస్ రెగ్యులేటర్ల షట్టర్లు ఎత్తటం, దించటం విద్యుత్తు మోటార్ల సాయంతో చేపడతారు. కరెంటు లేకుంటే మనుషులే ఆ పనిచేయాలి. ఈ ప్రక్రియ చాలా కష్టంతో కూడుకుంది. కంప చెట్లు, పిచ్చిమొక్కలు ఆవాసంగా కాల్వకట్టలు తయారవుతున్నా యి. లోపలి భాగంలో గడ్డి, జమ్మి పేరుకొని నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. ఫలితంగా కాల్వలకు గండ్లు పడుతున్నాయి.

'లస్కర్ల అవసరం ఉంది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని ప్రభుత్వం నియమించిన తర్వాత ఆ ఏజెన్సీ ద్వారా వీరి నియామక ప్రక్రియ పూర్తి చేస్తాం. త్వరలో ఇది పట్టాలెక్కే అవకాశం ఉంది.'

మంగళపుడి వెంకటేశ్వర్లు, నీటిపారుదల శాఖ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ.

సాగర్ ఆయకట్టు విస్తరించిన మండలాలు: 17

సాగు భూమి: 2.54 లక్షల ఎకరాలు అదనపు వనరులు: ఎస్సారెస్పీ, వైరా, లంకాసాగర్, పాలేరు రిజర్వాయర్లు, 1100 చెరువులు

మొత్తంగా సాగుభూమి: 5 లక్షల ఎకరాలు

## అన్నీ గుడిసెలే.. అయినా మంజూరు కాలే

సారంగాపూర్: అక్కడ నివసిస్తున్న వారంతా గిరిజన కుటుంబాలే. పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. అయినా అధికారులు, ఇందిర మ్మ కమిటీ సభ్యులు అక్కడా ఎవరికీ ఇళ్లు మంజూరు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి నాయకపుగూడెంలో 48 కుటుంబాలు ఉండగా.. 186 మంది నివసిస్తున్నారు. ఇక్కడ ఉన్నవారందరూ 40 ఏళ్లుగా పూరి గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా ఎవరికి మంజూరు చేయలేదని.. తమ గోదు పట్టించుకో వడం లేదని గూడెం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం పడితే తీవ్ర అవస్థలు**

తాము అటవీ ప్రాంతంలో ఉంటున్నప్పటికి అటవీ భూముల సాగు చేసుకోనివడంలేదని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇక్కడ ప్రభుత్వ పాఠశాలతోపాటు నిర్మాణంలో ఉన్న సామాజిక భవనం ఉందని.. అయితే ఇళ్ల మంజూరులో అధికారులు తీరుపై మండిపడుతు న్నారు. అంతేకాకుండా తండాకు వెళ్లాలంటే వర్షం పడితే కాలినడకన చేరుకోవడం తీవ్ర ఇబ్బందిగా ఉందని, మిషన్ భగీరథ నీరు రావడంలేదని చెబుతున్నారు. మురుగు కాలువల నిర్మాణాలు మరిచిపోయారని పేర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను వివరణ కోరగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మేరకే ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు.

**గోదు పట్టించుకోవడంలేదు** ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య తెలిపినా పట్టించు కోవడంలేదు. కండ్లపల్లిలో ఉన్నవారికే ఇళ్లు మంజూరు చేశారు. మేము పూరి గుడిసెల్లో ఉన్నా.. ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయలేదు. తండాలో కనీస వసతులు లేకపోవ డంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. భీమయ్య, తండావాసుడు

## స్త్రీ నిధి.. ఆర్థిక పెన్నిది

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత సాధించే స్త్రీనిధి రుణాల పంపిణీని పట్టాలెక్కించేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. వడ్డీ వ్యాపారుల బెడద తప్పించి అందుబాటు లోని రుణ సదుపాయం కల్పించేందుకు కలెక్టర్ శ్రీహర్ష ప్రత్యేక దృష్టిసారించారు. రుణాల పంపిణీతోపాటు బకాయిల వసూళ్లపై దిశానిర్దేశం చేస్తున్నారు. కోరిన 48 గంటల్లోపు రుణం మంజూరు చేయడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది రుణాల ప్రగతి శతశాతం సాధించేందుకు సన్నద్ధమవుతున్నారు.

**అయిదు రకాలుగా**

సూక్ష్మ రుణాల వడ్డీ వ్యాపారుల బారి నుంచి రక్షించి మహిళలకు ఆర్థిక సాంత్వనగా నిలిచేందుకు 2011లో స్త్రీనిధి ప్రారంభమైంది. అప్పటి నుంచి స్వశక్తి సంఘాల మహిళలకు అయిదు రకాలు సువిధ, ప్రగతి, అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య పేరిట రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రుణాలు తీసుకుని వాయిదాలు సకాలంలో చెల్లించిన సంఘాలకు పావలా వడ్డీ వర్తిస్తుంది. వీరంతా చిరు వ్యాపారాలు, వ్యవసాయం, వాహనాల కొనుగోలు, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పి ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నారు.

**రికవరీపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో స్త్రీనిధి రుణాల బకాయిల వసూళ్లను రికవరీ చేసేందుకు మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. మెప్మా పరిధిలో రూ.4.81 కోట్ల బకాయిలుండగా వీటిలో రూ.4.07 కోట్లు వసూళ్లయ్యాయి. ఇందిరాక్రాంతి పథం(ఐకేపీ) లో రూ. 14.06 కోట్లు ఉండగా రూ. 6.40 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణంలో రుణాల రికవరీ ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.415 కోట్లు, పట్టణాల్లో రూ.90.03 కోట్లు రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉంది. సూక్ష్మ రుణాల బ్యాంకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్త్రీనిధిలో అత్యవసర పరిస్థితుల్లో రుణాలు తీసుకునే వెలుసుబాటు ఉన్నప్పటికి ఆసక్తి చూపడం లేదు. ప్రైవేటు బ్యాంకులను ఆశ్రయించి మహిళలు ఆర్థికంగా నష్టపోవడంతో స్త్రీనిధి రుణాలు ఇప్పించే చర్యలు తీసుకుంటున్నారు.

**బకాయిలు చెల్లించాలి** రుణాల రికవరీపై ప్రణాళిక రూపొందించాం. ప్రైవేటు బ్యాంకులకు వెళ్లి నష్టపోవద్దు. తక్కువ వడ్డీతో స్త్రీనిధి రుణాలు పొందాలి బకాయిలు చెల్లించేందుకు అవగాహన కల్పిస్తున్నాం. స్త్రీనిధి రుణాల ప్రగతిపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దుర్గా ప్రసాద్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్

## ఎన్'క్యాష్'.. ఎప్పుడొస్తుందో?

నల్గొండ : ఆసుపత్రులకు వచ్చే రోగులకు అన్నిరకాల సేవలు అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు పేద, మధ్య తరగతి వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవచ్చని ఏర్పాటు చేసిన పథకం నిధుల కొరతతో నిలిచిపోయింది. దీంతో గతంలో మాదిరిగానే రోగులు ప్రైవేటుకు పరుగెత్తాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రకటించిన ఎన్‌క్వాష్ ప్రోత్సాహకాలు రెండేళ్లుగా అందడం లేదు. ఆసుపత్రుల పరిసరాల పరిశుభ్రత, ఆవరణలో ఆహ్లాద వాతావరణం, మొక్కల పెంపకం ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్యసేవలు, ఆసుపత్రి నిర్వహణ, వైద్య సిబ్బంది పనితీరు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకొని అందించే ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు కొరవడుతున్నాయి.

**నిధుల సరఫరా ఇలా..** ఎన్‌క్వాష్‌కి ఎంపికైన ప్రాథమిక, ఏరియా ఆసుపత్రులకు రూ.5లక్షలు, పట్టణ ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రూ.3 లక్షలు, సబ్‌సెంటర్లకు రూ.లక్ష చొప్పున అందిస్తారు. రెండేళ్లుగా ఒక్క పైసా కూడా కేంద్రాలకు అందించలేదు.

**ఎంపికైన ఆసుపత్రులు** జిల్లాలో 2023–24లో ఎన్‌క్వాష్, లక్ష్యకు మిర్యాలగూడ, దేవరకొండ ఏరియా ఆసుపత్రితో పాటు ముషంపల్లి, తాళ్లవెల్లంల, మామిడాల, బైరవోనిబండా, కొప్పోలు, వింజమూరు, గడియగౌరారం, మేళ్లవాయి, కుర్మేడ్ గ్రామాల్లోని సబ్‌సెంటర్లు ఎంపికయ్యాయి. ఆసుపత్రుల్లో టాయిలెట్లు, మురుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సబ్‌సెంటర్లు వర్షం వస్తే కురుస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో సామగ్రి లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

## సర్కారు వారి పాట

హైదరాబాద్: ప్రభుత్వ భూముల ఆన్‌లైన్ వేలానికి సర్వం సిద్ధమైంది. స్థిరాస్తి మార్కెట్‌లో సానుకూలత కన్పిస్తుండటంతో సర్కారు సైతం స్థలాలను విక్రయించేందుకు ముందుకొస్తోంది. తొలుత రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను ఈ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ బాధ్యతను ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. అప్‌సెట్ ధర చదరపు గజానికి సరాసరి రూ.25-30 వేల వరకు నిర్ణయించే అవకాశం ఉంది. కోకాపేట, చందానగర్, పుప్పాలగూడలాంటి ఖరీదైన ప్రాంతాల్లో ఎక్కువుంటాయి. కోకాపేట్ నియోపొలిస్‌లో గతంలో గజం రూ.లక్ష వరకు పలికింది. ఎకరా ఏకంగా రూ.100 కోట్లకు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. కోకాపేటలోని సర్వేనంబరు 144లో ప్రభుత్వానికి




చెందిన 8,591 చదరపు గజాల స్థలాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైంది. ఇక్కడ సర్వేనంబరు 146లో ప్రభుత్వానికి 1400 చ.గజాల స్థలం ఉంది. ఒకటి రెండు రోజుల్లో ఈ-వేలానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

**ఆక్రమణ చెర నుంచి..**

తొలుత హౌసింగ్ బోర్డుకు సంబంధించి స్థలాలను ప్రభుత్వం వేలం వేయడంతో మంచి స్పందన వచ్చింది. వారం క్రితం తొర్రూరులో ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించారు. అప్‌సెట్ కంటే మూడు రెట్లు ధర పలకడంతో హెచ్ఎండీఏ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను విక్రయించాలని నిర్ణయించారు. కొన్నింటిలో ప్లాట్లు విక్రయించగా ఇంకా మిగిలి ఉన్నాయి. అక్రమార్కులు వీటిపై కన్నేశారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అనంతరం హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లను వేలం వేయనున్నారు.

## వేగంగా నిర్మాణం.. సరిపోని నిధులు

గోదావరిఖని : గోదావరిఖనిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యం రూ.541 కోట్లు కేటాయించింది. నిర్మాణ పనులు వేగంగా చేపట్టడంతో వైద్య కళాశాల భవన సముదాయాలు పూర్తికాగా ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సింగరేణి కేటాయించిన నిధుల్లో వైద్య కళాశాల భవనాల నిర్మాణాలు పూర్తికాగా మిగిలిన రూ.142 కోట్లతో గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ముందు 9.53 ఎకరాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు అయిదంతస్తుల్లో 3,48,463 చదరపు అడుగుల వైశాల్యంలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. పడకల స్థాయితో పాటు వివిధ విభాగాల్లో వైద్య సేవలు మెరుగుపడడంతో ఆసుపత్రి ప్రధాన భవనం సరిపోవడం లేదు. అదనంగా 85 పడకల సామర్థ్యంతో రక్తబ్యాంకు ముందు మరో భవన నిర్మాణం చేపట్టినా ఆసుపత్రి అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో కాలు కదపలేని తీరుగా రోగుల రద్దీ ఉంటుంది.

**పెరిగిన జీఎస్టీ చెల్లింపులు**



ఆసుపత్రి ఆవరణలో అదనపు భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నప్పటికీ కేటాయించిన నిధులు సరిపోవడం లేదు. డిసెంబరులోగా కేటాయించిన నిధులకు సరిపడా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు వేగవంతం చేశారు. రూ.142 కోట్లతో ప్రతిపాదించిన అంచనాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు అయిదంతస్తుల భవనమే ఉండగా అదనంగా మరో అంతస్తు నిర్మాణం చేపట్టాలని ఆసుపత్రి వర్గాలు కోరుతున్నాయి. అయిదంతస్తుల వరకే నిధులు సరిపోయే అవకాశం లేదని గుత్తేదారు ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. అయిదంతస్తుల్లో స్లాబుల నిర్మాణాలు పూర్తయినా రెండు అంతస్తుల్లో మాత్రమే అంతర్గత పనులు పూర్తయ్యే అవకాశముంది. అదనంగా మరో రూ.100 కోట్లు కేటాయిస్తేనే నిర్మాణం పూర్తి కానుంది. వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు మొదలుపెట్టినప్పుడు జీఎస్టీ 12 శాతం మాత్రమే ఉండగా ప్రస్తుతం 18 శాతానికి చేరుకోవడంతో అదనంగా సుమారు రూ.31 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి అదనంగా చెల్లించిన జీఎస్టీ నిధులను తిరిగి చెల్లిస్తే సుమారు మరో రూ.50 కోట్లు కేటాయించినా కొంత మేరకు భవన నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశమున్నట్లుగా భావిస్తున్నారు.

## చెత్త గుట్టలు.. తప్పని చిక్కులు

మంచిర్యాల : మంచిర్యాల నగరపాలక సంస్థలోని అండాలమ్మకాలనీ నివాస గృహాల సమీపంలో తాత్కాలిక చెత్త డంపింగ్‌యార్డు నిర్వహిస్తున్నారు. అక్కడ రెండు ఎకరాల స్థలంలో చెత్తను వేస్తుండటంతో గుట్టలుగా పెరిగింది. తరచూ కార్మికులు కాల్చేస్తుండటంతో పొగతో సమీప కాలనీల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ ప్రక్రియ ఎప్పుడో నిలిచిపోయింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో శాశ్వత డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, వెలువడుతున్న చెత్తకు అనుగుణంగా డంపింగ్ యార్డు స్థలాలు ఏర్పాటు చేయడం లేదు. పైగా కుప్పలను కాల్చి ప్రజలను అనారోగ్యాలకు గురి చేస్తున్నారు. పర్యవేక్షణ కరవై ఉన్న స్థలంలోనే చెత్త కొండలుగా పేరుకుపోతోంది. మంచిర్యాలలో నస్పూరు పట్టణం, వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నర్సింగాపూర్ పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు కార్పొరేషన్‌తో పట్టణ పరిధి పెరగడంతో అధికారుల పర్యవేక్షణ లేక ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. పట్టణంలో వెలువడే చెత్తను కొంత అండాలమ్మకాలనీకి, మరికొంత నస్పూరు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

## ఊపిరి సలపనివ్వని ఉద్గారాలు



హైదరాబాద్: పారిశ్రామికవాడల్లో వెలువడే కాలుష్య ఉద్గారాలతో వాయునాణ్యత క్షీణిస్తోంది. జీడిమెట్ల, నాచారం, బాలానగర్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పాశమైలారం, బొల్లారం పారిశ్రామికవాడ నుంచి వెలువడే కలుషితాలు నగరవాసులకు ఊపిరి సలపనివ్వడం లేదు. ఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) అధ్యయనం ప్రకారం పాశమైలారంలో అత్యధిక కాలుష్యం నమోదవుతోందని పేర్కొంది. 2024-25లో ఇతర నగరాల్లోని ప్రాంతాలతో పోల్చితే.. పాశమైలారం మూడో స్థానంలో ఉందని తెలిపింది. ఘనపు మీటరు గాలిలో 62 మైక్రోగ్రాముల పీఎం 2.5 సీజనల్ సగటు నమోదైందని పేర్కొంది.


**ఇష్టారీతిన వ్యర్థాల పారబోత..**

పాశమైలారంలో ఔషధ, రసాయన పరిశ్రమలు అనేకం ఉన్నాయి. కాలుష్య కట్టడిని విస్మరించి కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయని పరిశ్రమలు వ్యర్థాలను ట్యాంకర్లలో తరలించి నగరంలోని జలాశయాల్లో పారబోస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల రాజేంద్రనగర్ సమీపంలో మూసీలో పారబోస్తున్న సమయంలో స్థానికులు రెడ్ హ్యాండెడ్‌గా ఈ ట్యాంకర్‌నుపట్టుకున్నారు. అలాగే మేడ్చల్ సమీపంలోని సుతార్‌పల్లిలోని చెరువులో వ్యర్థాలను పారబోస్తుండగా స్థానికులు అధికారుల సహాయంతో పట్టుకున్నారు. దీనికి తోడు ప్యాక్టరీలోని గొట్టాలకు స్క్రబ్బర్లు అమర్చకపోవడంతో ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దట్టమైన పొగసైతం ఊపిరి సలపనివ్వడం లేదు. ఇక్కడ సగటు వాయునాణ్యత సూచీ 105గా ఉంది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వెంకటాద్రినగర్, గంపలబస్తీ తదితర కాలనీల్లో బోరు నుంచి ఘాటైన రంగు నీళ్లు ఉబుకుతున్నాయి. తాగడానికి, వాడుకోవడానికి చుక్క నీరు పనికిరాకుండా పోతోంది. నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. జీడిమెట్లలోనూ సగటు సూచీ 100 దాటిందని పీసీబీ నివేదిక పేర్కొంది. బొల్లారం పారిశ్రామికవాడలో ఓజోన్ కాలుష్యం సురక్షిత పరిమితులకంటే ఎక్కువగా నమోదవుతోంది. 17 రోజులు వరుసగా ఈ ప్రాంతంలో భూస్థాయి ఓజోన్ అత్యధికంగా ఉందని అధ్యయనాల్లో వెల్లడైంది. వాయుకాలుష్యంతో స్థానికులు ఊపిరితిత్తుల సమస్యలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వ్యర్థ రసాయనాలను ఇష్టానుసారంగా పారబోస్తుండటంతో జల కాలుష్యం పెరిగి స్థానికంగా తాగునీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావంపడుతోంది. వాయునాణ్యత సూచీ సైతం 100కి పైగా ఉంది.

**నియంత్రణ చర్యలేవీ..?**

రాజధాని పరిధిలో 3 నైట్ పెట్రోలింగ్ బృందాలు రాత్రి నుంచి ఉదయం వరకు గస్తీలో ఉంటాయి. ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది పారిశ్రామికవాడలతో పాటు పౌరుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో తిరిగి కట్టడికి చర్యలు తీసుకోవాలి. తూతూమంత్రంగానే తనిఖీలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సమాచారం ఇచ్చిన అరగంటకు గానీ ఘటనాస్థలికి చేరుకోవడం లేదని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## లైసెన్సులు వారివి.. ఆటోలు వీరివి!




హైదరాబాద్: గ్రేటర్‌లో కొత్త ఆటోల పర్మిట్ల జారీకి సంబంధించి చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రేటర్‌లో ఎల్పీజీ, సీఎన్‌జీ,ఎలక్ట్రిక్ కలిపి మొత్తం 45 వేల కొత్త ఆటో పర్మిట్ల జారీకి ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. మరో 25వేల పాత ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను తీసుకునే అవకాశం కల్పించింది. ఈ క్రమంలో మార్కెట్ ధర కంటే రూ.40వేల నుంచి రూ.60 వేలు అధిక ధరలకు విక్రయించాలని కొందరు ప్రైవేటు ఫైనాన్షియర్లు కొత్త ఆటోలను నల్లబజారు బాట పట్టించడానికి పకడ్బందీగా ప్రణాళిక వేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం హైదరాబాద్‌లో కొత్త ఆటో కొనాలంటే ఓఆర్ఆర్ పరిధిలో నివాసం ఉన్నట్లు గుర్తింపు కార్డుతోపాటు ఆటో డ్రైవింగ్ లైసెన్సు, గతంలో తన పేరుతో ఆటో లేనట్లు ధ్రువీకరణ పత్రంతో ప్రొసీడింగ్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడే అసలు తంతు నడుస్తోంది. చాలామందికి గుర్తింపుకార్డు, లైసెన్సు ఉన్నా వారు ఆటో నడిపేందుకు ఆసక్తిగా లేరు. ఈ వివరాలను సేకరించి వారి పేరుతో ప్రొసీడింగ్స్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. తర్వాత వీరి పేరుతోనే కొత్త ఆటో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అలా వాటిని ఫైనాన్షియర్ల గుప్పిట్లో పెట్టుకుని తర్వాత అధిక ధరలకు విక్రయించి వారి పేరుతో ట్రాన్స్‌ఫర్ చేయడం లేదంటే అద్దెకు తిప్పడం చేస్తున్నారు. 20వేల ఎల్పీజీ, సీఎన్‌జీ ఆటోలకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేయగా...ఇందులో కొన్నింటిని బ్లాక్ మార్కెట్ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

**ఒకరి పేరుతో ఆటో.. మరొకరు యజమాని**

గ్రేటర్‌లో ప్రస్తుతం లక్షన్నర వరకు ఆటోలు తిరుగుతున్నాయి. వాటిలో 50-60 వేల ఆటోలకు ఎవరు యజమానో తెలియడం లేదు. ఫైనాన్స్ తీసుకొని ఆటోలుకొన్న చాలామంది ఈఎంఐలు కట్టలేక ఫైనాన్షియర్లకే అప్పగించేస్తున్నారు. వీటిని వారు వేరొకరికి విక్రయిస్తున్నారు. వివిధ కారణాలతో అవి వారి పేరుపైకి మారడంలేదు. అలాంటి ఆటోలను ఉపయోగించి అసాంఘిక శక్తులు నేరాలకు పాల్పడితే ఎవరు బాధ్యులనేది కీలకం. తాజాగా కొత్త ఆటోల కేటాయింపులో బ్లాక్‌చేయడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి దందాకు దారితీసే ప్రమాదం ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంలో పారదర్శకత ఉండేలా చూడాలని ఆటో యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

## అయిదు నెలలు.. మూడు సార్లు




రామగుండం : రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో తరచూ సాంకేతిక అవాంతరాలతో యూరియా ఉత్పత్తికి తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని అయిదు నెలల్లో మూడుసార్లు అమ్మోనియా పైపులైన్ లీకేజీ కారణంగానే ఉత్పత్తి నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో లీకేజీలను శాశ్వతంగా అరికట్టలేకపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏటా సుమారు నెల రోజుల పాటు కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి వార్షిక మరమ్మతు చేపడుతుండగా మిగతా 11 నెలలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉత్పత్తి కొనసాగాల్సి ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 25 రోజుల్లోనే వార్షిక మరమ్మతు పూర్తిచేసుకొని ఉత్పత్తిని ప్రారంభించగా ఈసారి 40 రోజులు పట్టింది. వార్షిక మరమ్మతు కోసం మే 8న ఉత్పత్తి నిలిపివేయగా అనంతరం జూన్ 16న ప్రారంభమైంది. నెల రోజుల్లోనే అమ్మోనియా లీకేజీ కారణంగా జులై 16న ఉత్పత్తి నిలిపివేయగా మరమ్మతు అనంతరం ఆగస్టు 4న ఉత్పత్తి ప్రారంభం కాగా కేవలం 10 రోజుల్లోనే అదే లీకేజీ కారణంగా మరోసారి నిలిపివేయాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం తిరిగి ఈ నెల 23న ఉత్పత్తి ప్రారంభం కానున్నట్లు భావిస్తుండగా జాప్యం జరిగే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జులై వరకు లీకేజీలు, మరమ్మతు కారణంగా సుమారు ఒకటిన్నర నెలపాటు యూరియా ఉత్పత్తిని కోల్పోవాల్సి వచ్చింది.**శాశ్వత పరిష్కారంపై నిర్లక్ష్యం**ఆర్ఎఫ్‌సీఎల్‌లో తరచూ ఎదురవుతున్న అమ్మోనియా లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటేనే కర్మాగారం పురోగతి సాధించడంతో పాటు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోనుం ది. నిధులు, విద్యుత్తు కొరత, సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోకపో వడంతో పాటు వివిధ కారణాలతో ఖాయిలా పడ్డ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎరువుల కర్మాగారం మూసివేతకు గురైంది. ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలో వివిధ రాష్ట్రాల్లో ఎరువుల కర్మాగారాలు ఉండడంతో ఢిల్లీలో కేంద్ర కార్యాలయం ఉండేది. ఆర్ఎఫ్‌సీఎల్ పరిధిలో కేవలం రామగుండంలో మాత్రమే కర్మాగారం ఉండడంతో సంస్థ కేంద్ర కార్యాలయాన్ని ఇక్కడికి మార్చాలనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు స్థానిక నాయకులు కేంద్రాన్ని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు.

**పెరుగుతున్న ఒత్తిళ్లు...** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా యూరియా కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా కేటాయింపులపై ఆయా రాష్ట్రాల నుంచి కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. తమ రాష్ట్రాలకు యూరియాను తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులే స్వయంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు ఆగస్టులో 65వేల టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి మార్గదర్శకాలు జారీ అయినప్పటికీ పక్షం రోజుల్లోనే ఉత్పత్తి నిలిచిపోవడంతో సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం ఆరంభంలోని ఏప్రిల్ నుంచి జులై వరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మరో అయిదు రాష్ట్రాలకు 4,16,659 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జులై వరకు లీకేజీల కారణంగా కేవలం 2,40,530 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు. ఆగస్టులో 36వేల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది.

## అను'గృహం' లేనట్టేనా?

నిజామాబాద్: 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. పనులను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. పూర్తయిన వాటిని ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రారంభించి, లబ్ధిదారులతో గృహ ప్రవేశ వేడుకలు జరిపించేందుకు సర్కారు నిర్ణయించింది. కానీ, జిల్లాలో ఇప్పటివరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లూ పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసుకోలేదు. గృహ ప్రవేశాలపై జిల్లా అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

కారణాలివే..

ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే లబ్ధిదారుకు ప్రభుత్వం వివిధ దశల్లో రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తుంది. తొలుత పునాది వరకు సొంతంగా నిర్మించుకుంటే సాయం మంజూరు మొదలవుతుంది. ఇందుకు రూ.లక్ష వరకు ముందే ఖర్చు చేయాలి. చాలామంది లబ్ధిదారులకు ఆర్థిక స్తోమత లేక తొలినాళ్లలో నిర్మాణాలకు ముందుకు రాలేదు. దీంతో పలువురు పేదలను అధికారులు గుర్తించి 'సెర్ప్' ద్వారా రూ.లక్ష వరకు బ్యాంకు రుణాలిప్పించారు. నిర్మాణాలు చేపట్టాక వర్షాలకు ఇసుక కొరత ఏర్పడటంతో పనులు నెమ్మదించాయి. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా భవన నిర్మాణ సామగ్రి ధరలూ



పెరిగాయి. మరోవైపు తాపీమేస్త్రీలు, కూలీల చెల్లింపులు భారంగా మారాయి. ఫలితంగా వందలాది మంది పునాదులు చేపట్టకుండానే చేతులెత్తేశారు. ఇళ్లు కట్టుకునే స్తోమత లేదంటూ ఎంపీడీవోలకు లేఖలు రాసిచ్చారు.

**నగర, పురపాలికల్లో మరింత వెనుకబాటు..**

గ్రామీణ ప్రాంతాల్లో ఎలాగోలా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకొస్తుండగా, పురపాలక సంఘాల్లో పెద్దగా ఆసక్తి కనబర్చటం లేదు. నిజామాబాద్ నగరంలో 1,420కి గాను 498 ఇళ్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయి. ఆర్మూర్‌లో 617కి 242, భీమ్‌గల్‌లో 131కి 51, బోధన్ పట్టణంలో 516కి 289 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ఇసుక కొరత రానివ్వొద్దని గృహ నిర్మాణ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సమీక్షలు నిర్వహిస్తున్నారు.

## పంట నష్టం.. రహదారులు ధ్వంసం!

ఆదిలాబాద్ : కుండపోత వర్షాలు శనివారం జిల్లాను అతలాకుతలం చేశాయి.. పత్తి, సోయా పంటలు నీట మునగగా.. రహదారులకు తీవ్ర నష్టం జరిగింది.. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం నివేదికను సిద్ధం చేస్తోంది. కలెక్టర్ రాజర్షి షాతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు త్వరలో జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో పెన్‌గంగా నదిపై ఇసాపూర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువనున్న జైనథ్, బేల మండలాల్లో వరద ప్రభావం క్రమంగా పెరుగుతోంది.. మరో మూడ్రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది..

**పంటలపై ప్రతాపం :** జిల్లా మొత్తం 11,152 ఎకరాల్లో పత్తి, సోయా, కంది పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా తేల్చింది. జిల్లాలోని 21 మండలాల్లోని 263 గ్రామాల పరిధిలో 4,086 మంది రైతుల పంటలకు నష్టం జరిగినట్లు ఆ శాఖ నిర్ధారించింది. అత్యధికంగా పత్తి 8,892, సోయా 1,070, కంది 906, మక్క 284 ఎకరాలు ఇతర పంటలు 65 ఎకరాల్లో నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ నివేదిక తయారు చేసింది.

**పీఆర్ పరేషాన్ :** పంచాయతీరాజ్ పరిధిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.3.70 కోట్లు, శాశ్వత పనులు చేపడితే రూ.55.80 కోట్లు అవసరమని పీఆర్ విభాగం తేల్చింది. ఆదిలాబాద్ గ్రామీణం, బోథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్ మండలాల పరిధిలో 24 వేర్వేరు ప్రాంతాల్లో 43 కి.మీ. రహదారులు, 28 కల్వర్టులు, 10 లోలెవల్ వంతెనలకు నష్టం జరిగింది.

**విద్యుత్తు శాఖకు దెబ్బ :** జైనథ్, ఇచ్చోడ, ఉట్నూరు, ఇంద్రవెల్లి మండలాల్లో 33 కేవీ లైన్ స్తంభాలు తొమ్మిది, 11 కేవీ స్తంభాలు 20, మరో 27 వ్యవసాయ, గృహ వినియోగ స్తంభాలు నేలవాలినట్లు గుర్తించిన విద్యుత్తు అధికారులు తాత్కాలిక మరమ్మతులకు రూ.9.60 లక్షలు అవసరమని తేల్చారు.

**ఆర్అండ్‌బీ గోడు :** ఆర్అండ్‌బీ పరిధిలో తాత్కాలికంగా 3.15 కోట్ల విలువైన పనులకు నష్టం వాటిల్లింది. శాశ్వతంగా పూర్తిచేయాలంటే రూ.70.20 కోట్లు అవసరమవుతాయని ఆ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఆదిలాబాద్ గ్రామీణం, ఉట్నూరు, ఇంద్రవెల్లి, నేరడిగొండ, తాంసి, తలమడుగు మండలాల పరిధిలో 145 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. మరో 28 కాజ్‌వేలు, 14 కల్వర్టులకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదిక తయారు చేసింది.

## జల పరవళ్లు.. సాగుపై ఆశలు

నిర్మల్ : ఇన్నాళ్లూ నీటి వనరులు పుష్కలంగా ఉన్న జిల్లాపై వరుణుడు కరుణ చూపించలేదు. మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీంలో వాన బీభత్సం సృష్టించింది. అక్కడి వాగులు పొంగిపొర్లి ప్రవహించాయి. చెరువులన్నీ నిండుకుండలా మారాయి. నిర్మల్ జిల్లాలో మాత్రం ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లు లేక బోసిపోతూ కనిపించాయి. ఈసారి జిల్లాపై వరుణుడు కరుణించాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, ఒర్రెలు పొంగి పొర్లుతున్నాయి. నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు నీటితో నిండుకుండలా కనిపిస్తున్నాయి.

**'గేట్లు' తెరుచుకున్న జలాశయాలు** జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్నవాగు, కడెం, ఎస్సారెస్పీ జలాశయాలు జలకళ సంతరించుకు న్నాయి. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో పరవళ్లు తొక్కుతున్నాయి. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల్లోకి వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఎత్తడంతో వేల క్యూసెక్కుల నీరు గోదావరిలో కలుస్తుండటంతో ఎస్సారెస్పీలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. లక్షకుపైగా క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుండటంతో జిల్లాలోని సరస్వతి ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాకాలం మొదలై రెండున్నర నెలలు గడిచినా భారీ వర్షాలు కురవ లేదు. ఆదిలోనే వరుణుడు మురిపించాడు. ఆ వానకు చెరువుల కింద ఆయకట్టు రైతులు వరినార్లు వేసుకున్నారు. తర్వాత అడపాదడపా ముసురుతో వాన కురిసినా జిల్లాలో ఆయకట్టు ఉన్న 661 చెరువుల్లోకి నీరు రాలేదు. వీటి కింద 56 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతుల్లో ఆందోళన మొదలైంది. వేసిన వరి నార్లు ముదురుతుండటంతో వరి సాగు కష్టమేనని భావించారు.

# నిబంధనలు అతిక్రమిస్తే.. లైసెన్స్‌లు రద్దే

కరీంనగర్ : ఉరుకుల పరుగుల జీవితాలు, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇంటికో వాహనం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే వాహనాలు నడపాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ఆర్సీ, ఇతర ధ్రువపత్రాలు ఉండాల్సిందే. కానీ చాలామంది ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇతరులకు ప్రమాదాలు చేస్తున్నారు. కొందరు మద్యం తాగి వాహనం నడుపుతున్నారు. కేసు తీవ్రతను బట్టి పోలీసుల సిఫార్సు మేరకు లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు..

**పాఠశాల స్థాయి నుంచి అవగాహన**

కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో రవాణాశాఖ కార్యాలయాలు, హుజూరాబాద్, రామగుండం, కోరుట్లలో యూనిట్ కార్యాలయాలు సేవలందిస్తున్నాయి. వీటి పరిధిలో 2025 జనవరి 1 నుంచి ఇప్పటివరకు 164 మంది వాహనదారుల లైసెన్స్‌లు రద్దు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసుల నమోదుతోపాటు తాత్కాలికంగా లైసెన్స్‌లు రద్దు చేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఒకసారి రద్దయితే తిరిగి లైసెన్స్ జారీ చేయకుండా



నిబంధనలు తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది.

**మైనర్లు వాహనం నడపొద్దు**

18 ఏళ్లు నిండి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తి మాత్రమే వాహనాలు నడపడానికి అనుమతి ఉంటుంది. చాలా మంది మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలా నడిపి ఏదైనా ప్రమాదం జరిగితే వాహనం ఇచ్చిన వ్యక్తి కూడా శిక్షార్హుడు అవుతాడని అధికారులు చెబుతున్నారు. వాహనాలను నడిపే విషయంలో పిల్లలకు వారి తల్లిదండ్రులు సరైన అవగాహన కల్పించకపోవడం, స్వయంగా వారే వాహనాలు ఇస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

**తప్పనిసరిగా పాటించాల్సినవి**

ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలి.
ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలి.
లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలి.
ట్రాఫిక్ సిగ్నల్లను అనుసరించాలి.
రహదారికి ఎడమ వైపు మాత్రమే వాహనం నడపాలి.
నీ మద్యం తాగి, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ట్రిపుల్‌డ్రైవింగ్ లాంటివి చేయరాదు.

**చట్టరీత్యా చర్యలు..**

ప్రతి వాహనదారుడు నిబంధనల మేరకు వాహనాలు నడపాలి. లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొద్దు. నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.

– పెద్దింటి పురుషోత్తం, డీటీసీ

**ఉమ్మడి జిల్లాలో వివరాలు...**

| జిల్లా | లైసెన్స్‌లు రద్దు |
|---|---|
| కరీంనగర్ | 59 |
| జగిత్యాల | 39 |
| పెద్దపల్లి | 42 |
| రాజన్న సిరిసిల్ల | 24 |

# మనకూ ఔటర్ రింగ్ రైలు

భువనగిరి : ఇప్పటికే రెండు రైలు మార్గాలు.. నాలుగు జాతీయ రహదారులు.. యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా వెళ్తున్నాయి. త్వరలో ప్రాంతీయ వలయ రహదారి (ఆర్‌ఆర్‌ఆర్) రానుంది. హైదరాబాద్ బాహ్య వలయ రహదారికి 20 కి.మీ. దూరంలోనే జిల్లా ఉంది. ఈ నేపథ్యం రైలు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు రైల్వే శాఖ రూపొందించిన ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు డీపీఆర్‌లో యాదాద్రి జిల్లా మీదుగా వెళ్లనుంది. దేశంలోనే ప్రప్రథమంగా ఔటరు రైలు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సికింద్రాబాద్–కాజీపేట రైలు మార్గంలో వంగపల్లి–ఆలేరు మధ్య, బీబీనగర్–నడికుడి మార్గంలో వలిగొండ–రామన్నపేట మీదుగా ఈ మార్గం వెళ్లనుంది.

ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే రూపొందించిన డీపీఆర్‌లో ఈ స్టేషన్లు రానున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి సమాంతరంగా ఈ ప్రాజెక్టు రానుంది. ట్రిపుల్‌ఆర్‌కు 3–5 కి.మీ. దూరంలో రైలు మార్గం వెళ్లనుంది. రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచి ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గించే ఉద్దేశంతో జాతీయ రహదారుల విభాగం, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ సంయుక్తంగా ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణం చేపడుతున్న విషయం విదితమే. హైదరాబాద్ మహానగరం చుట్టూ 361 కి.మీ. మీర వేయనున్న ప్రాంతీయ వలయ రహదారి జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా సుమారుగా 52 కి.మీ. వెళ్తుంది. భువనగిరి మండలం రాయగిరి వద్ద, చౌటుప్పల్‌లో ఇంటర్‌ఛేంజ్ సర్కిళ్లు రానున్నాయి. ప్రతిపాదిత ఔటర్ రింగ్ రైలు కూడా దాదాపు ఇదే మార్గంలో వెళ్లనుంది. డీపీఆర్‌లో చూపిన అలైన్‌మెంట్ ప్రకారం సికింద్రాబాద్–కాజీపేట రైలు మార్గంలో వంగపల్లి–ఆలేరు మధ్య, బీబీనగర్–నడికుడి మార్గంలో రామన్నపేట–వలిగొండ స్టేషన్ల మీదుగా వెళ్తుంది. ఈ ప్రాజెక్టులో పాత లైన్ మార్గంపై ఎత్తులో వంగపల్లి, వలిగొండ రైలు ఓవర్ రైలు (ఆర్వోఆర్) వంతెనలు వస్తాయి.

భువనగిరి, చౌటుప్పల్ ప్రాంతంలో అనేక పరిశ్రమలు వెలుస్తున్నాయి. జాతీయ రహదారులపై రద్దీ కూడా రోజురోజుకు పెరుగుతోంది. రాజధానికి చుట్టూ సమాంతర రోడ్డు, రైలు మార్గంతో నగరంపై ఒత్తిడి తగ్గుతుందని ప్రభుత్వ అంచనా.

**రైతుల గుండెల్లో రైళ్లు..**

జిల్లా మీదుగా ఔటర్ రైలు మార్గం వేయనున్నట్లు అధికారిక సమాచారం వెలువడటంతో రైతుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రాంతీయ వలయ రహదారికి భూసేకరణతో మనోవేదనకు గురై ఉన్న రైతులకు మరోప్రాజెక్టు తమ మెడపైకి వస్తుందని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే అనేకమార్లు ప్రభుత్వ అవసరాలకు భూములు ఇచ్చి తీవ్రంగా నష్టపోయిన తాము ట్రిపుల్‌ఆర్‌కు భూములు ఇవ్వమని రాయగిరి, భువనగిరి మండలం, చౌటుప్పల్ రైతులు భీష్మించారు. సర్వేను అడ్డుకున్నారు. అవార్డు జారీ కార్యక్రమం బహిష్కరించారు. ఈ నేపథ్యంలో ఔటర్ రైలు కూడా ట్రిపుల్ ఆర్‌కు సమాంతరంగా డీపీఆర్ ఖరారు చేసినట్లు వెల్లడికావడంతో ఆందోళన చెందుతున్నారు.

# వంకర్లు తిప్పారు.. వరదలో ముంచారు



హైదరాబాద్: నీరు పల్లమెరుగు.. నిజం దేవుడెరుగు సామెతను ఇరిగేషన్ అధికారులు మార్చిపోయినట్లున్నారు. అందుకే శేరిలింగంపల్లి, ఖాజాగూడ, బయోడైవర్సిటీ ప్రాంతాల్లోని కాలనీల్లో కురిసే వాననీటిని తీసుకెళ్లే వరద నాలాల వెడల్పును మార్చారు. రియల్టర్లకు లాభం కలిగించేలా వాటిని అష్టవంకర్లు తిప్పారు. రూ.7.41కోట్ల వ్యయంతో కొద్దినెలల క్రితం నాలాలు నిర్మించారు. మూడురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వీటి సామర్థ్యం చాలకపోవడంతోకాలనీలు, జనావాసాలను వరద ముంచెత్తింది. బయోడైవర్సిటీ కూడలి వద్ద ప్రిన్స్‌టన్‌మాల్ ఎదురుగా రెండుకార్లు మునిగిపోయాయి.

**ప్రవాహ తీరును గుర్తించకుండా మూతలు..**

శేరిలింగంపల్లి నుంచి ఖాజాగూడ వరకూ చెరువుల్లోకి మురుగు వెళ్లకుండా డ్రైనేజ్ డైవర్షన్ పేరుతో జీహెచ్‌ఎంసీ వరదనీటి నాలాలను నిర్మించాలని నిర్ణయించింది. వీటి బాధ్యతను మేడ్చల్ జిల్లా నీటిపారుదలశాఖ అధికారులకు అప్పగించారు. వరద నాలాలు నిర్మించేప్పుడే వాటి సమీపంలోని రియల్ వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాల ప్రహరీలను తొలగించకుండా నాలాల వెడల్పును తగ్గించారు. ఉదాహరణకు ఒక చోట నాలా వెడల్పు పది అడుగులుంటే ఏడు అడుగులకు కుదించారు. ఇంతేకాదు... నాలా వెడల్పు ఆరు అడుగుల కంటే ఎక్కువగా ఉంటే.. నాలాకు స్లాబ్ వేయకూడదు. ఇందుకు విరుద్ధంగా నాలాలపై మూతలు వేశారు.

**ఇక్కడ.. ఇలా తగ్గించారు...**

హఫీజ్‌పేట ప్రకాశ్‌నగర్ సమీపంలోని కొత్తకుంట నుంచి ఈర్ల చెరువులోకి వెళ్లే నాలాను నాలుగైదు అడుగులకు కుదించారు. శ్రీదీప్తినగర్ వద్ద నాలాలను వంపులు తిప్పారు.

నల్లగండ్ల చెరువు కింద సహజంగా ఉన్న నాలాను మరో మార్గానికి తిప్పారు. ఈ చెరువులోకి వచ్చే వరద నాలాను మరో నిర్మాణ సంస్థ కోసం రెండు అడుగుల వెడల్పు తగ్గించారు.

గోపి చెరువుకి వరదను తీసుకువచ్చే నాలాలను రియల్ నిర్మాణాల కోసం పూడ్చేశారు.

మియాపూర్ కాయిదమ్మ చెరువులో మురుగు చేరకుండా పైప్‌లైన్లు వేశారు. సరైన అలైన్‌మెంట్ లేక.. పైపుల్లోకి వెళ్లాల్సిన మురుగు తిరిగి చెరువులోకి చేరుతోంది.

# శ్వాస కోల్పోతున్న ఛాతీ ఆసుపత్రి



అమీర్‌పేట : తెలంగాణతో పాటు పరిసర రాష్ట్రాలకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి క్రమంగా ఉనికిని కోల్పోతుంది. 670 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం 310 పడకలే ఉన్నాయి. వైద్యశాలలో తాగునీటి వసతి లేదు. క్షయ, ఛాతీ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, అలర్జీ తదితర వ్యాధులకు చికిత్స అందించగలిగే వైద్య నిపుణులు ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నా దీని అభివృద్ధిని ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. స్వైన్‌ఫ్లూ, కోవిడ్‌లకు సమర్థంగా చికిత్స అందించిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం పడకల సంఖ్య తగ్గడంతో పాటు సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో నిత్యం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా అవసరాలకు చాలడం లేదు.

**చరిత్ర ఘనం.. ఉనికి ప్రశ్నార్థకం**

నిజాం సర్కారు పాలనలో జాగీర్దారు ఫక్రుంముల్క్ క్షయ ఆసుపత్రి ఏర్పాటు కోసం 70 ఎకరాలకు పైగా స్థలాన్ని అప్పటి ప్రభుత్వానికి ఇచ్చారు. దీంతో 670 పడకలతో నిజాం ప్రభుత్వం టీబీ ఆసుపత్రిని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన తరువాత ఛాతీ ఆసుపత్రి ప్రభుత్వ వైద్యశాలగానే కొనసాగుతోంది. నవాబు ఫక్రుంముల్క్ తాను వినియోగించిన విలాసవంతమైన ఇర్రంనుమా ప్యాలెస్‌లోనే ఛాతీ ఆసుపత్రి కొనసాగేది. ఇది శిథిలమైపోవడంతో అక్కడి పడకలను ఎత్తివేశారు. సమీపంలో నిర్మించిన కొత్త భవనంతో పాటు వెనుక వైపు ఉన్న షెడ్లలో మాత్రమే పడకలు కొనసాగుతున్నాయి. ఛాతీ ఆసుపత్రి ఆవరణలోని సుమారు 17 ఎకరాల స్థలంలో గత ప్రభుత్వం 1000 పడకలతో ప్రారంభించిన టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తికావచ్చింది. ఈ క్రమంలో ఛాతీ ఆసుపత్రి అభివృద్ధిపై అధికారులు దృష్టి నిలపడం లేదు.

**రోగుల సంఖ్యా అధికమే**

నిత్యం 450 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 300 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. 200 మందికి పైగా వైద్య సిబ్బంది ఉన్నారు. పెద్దసంఖ్యలో శ్వాసకోశ వైద్య నిపుణులు ఉన్న ఏకైక ఆసుపత్రి ఇదే కావడం గమనార్హం. ఈ పరిస్థితిలో ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

# రూ.కోట్లలో వ్యయం.. పనుల్లో జాప్యం



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పట్టణ ప్రగతి నిధులు పూర్తిగా నిలిచిపోవడంతో సమస్యలు మొదలయ్యాయి. రెండున్నర ఏళ్ల కిందట ఆధునిక హంగులతో కొత్త మార్కెట్లు, అమృత్ వర్షిణి ఆడిటోరియం పనులు చేసేందుకు పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులను కేటాయించారు. కిసాన్‌నగర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట నిర్మించే సమీకృత మార్కెట్లతోపాటు ఎస్సారార్ కళాశాల సమీపంలో ఆడిటోరియం నిర్మాణ పనులకు పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి హామీ నిధులను మంజూరు చేశారు. పద్మనగర్, కశ్మీర్‌గడ్డలోని పనులకు స్మార్ట్‌సిటీ నిధులు కేటాయించారు. కశ్మీర్‌గడ్డలోని నిర్మాణం స్లాబ్ దశలో ఉంది. మిగతా చోట్ల పురోగతి కనిపించడం లేదు.

**వివాదాస్పదంగా కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్**

కిసాన్‌నగర్‌లోని సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయి. అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేయడం, ఎంబీ పుస్తకం మాయం కావడంతో ఒక ఏఈ ఇటీవల సస్పెండ్ అయ్యారు. కేటాయించిన నిధులతో పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించాల్సి ఉండగా, అవేవి లేకుండానే బిల్లులు రికార్డు చేయడం వివాదాస్పదంగా మారింది. స్లాబ్‌లు, గోడలు, ప్లాట్‌ఫాంలు నిర్మించి వృథాగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్, అమృత వర్షిణి ఆడిటోరియం నిర్మాణాలు నిలిచిపోవడంతో.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మందుబాబులు స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నిత్యం గోడలు పగులకొడుతూ చిందరందర చేస్తున్నారు.

**ఎలా ఉన్నాయంటే..**

రూ.10.05 కోట్లతో కశ్మీర్‌గడ్డ రైతుబజారు స్థలంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ వేసేందుకు సెంట్రింగ్ పనులు చేస్తున్నారు.

రూ.5.80 కోట్లతో కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ స్థలంలో జీం1లో 146 దుకాణాలు, పార్కింగ్ వంటి సౌకర్యాలతో నిర్మించేందుకు స్లాబ్‌లు, దుకాణాల అరలు నిర్మించారు. ప్రస్తుతం ఈ పనులు నిలిచిపోయి పిచ్చి మొక్కలు పెరిగాయి.

కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట 2.31 ఎకరాల స్థలంలో మొత్తం 347 దుకాణాలతో నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అరలు, గోడల పనులు చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

# ఆదాయ మార్గం.. జాతీయ పురస్కారం

గోదావరిఖని : పొదుపు మంత్రం సింగరేణి సంస్థకు జాతీయ స్థాయిలో పురస్కారం తెచ్చిపెట్టింది. దుబారా నియంత్రించి సంస్థ ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపట్టడం ద్వారా సంస్థకు 2024 సంవత్సరానికి గాను ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి ఇచ్చింది. ఇటీవల దిల్లీలో యాజమాన్యానికి పురస్కారాన్ని అందజేసింది.

**18 గంటలు పనిచేసేలా..**

సింగరేణి బొగ్గు ఉత్పత్తికి వినియోగించే యంత్రాల పనిగంటలు పెంచటంపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఉపరితల గనుల్లో పనిచేసే




డంపర్లు, డోజర్లు, షావెల్ యంత్రాలతో పాటు భూగర్భ గనుల్లోని కంటిన్యూస్‌మైనర్, ఎస్డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల పనిగంటలు పెంచే ప్రయత్నం చేస్తోంది. దీని ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గే అవకాశం ఉంది. ఈ పొదుపు చర్యలకు సింగరేణికి జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. గత కొంతకాలంగా యంత్రాల పనితీరుపై దృష్టి సారించిన సింగరేణి కనీసం రోజుకు 18 గంటలు పనిచేసే విధంగా చర్యలు చేపట్టింది.

**నష్టం పూడ్చటానికి..**

భూగర్భగనుల ద్వారా గత ఐదేళ్లలో సంస్థకు రూ.13,093 కోట్ల నష్టం వాటిల్లింది. దీనిని అధిగమించేందుకు ఉపరితల గనుల్లో యంత్రాల పనిగంటలు పెంచారు. భూగర్భగనుల్లో ఉత్పత్తి వ్యయం తగ్గించటంతో పాటు లాభాలు అర్జించేందుకు ఎస్డీఎల్, ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరును మరింత మెరుగుపర్చుతున్నారు.

# కొత్త వారికి అవకాశం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పలు పథకాలను అమలు చేసింది. వీటిలో ప్రధానంగా మహాలక్ష్మిలో రూ.500కు వంటగ్యాస్, గృహజ్యోతిలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు వంటివాటికి రేషన్ కార్డులు తప్పనిసరిగా ఉండాల్సి ఉంటుంది. కాగా పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో వివిధ పథకాలకు అర్హులు దూరమయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. దీంతో లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.24 లక్షల మంది అర్హులు ఉండగా అందులో కేవలం 1.62 మందికి మాత్రమే మహాలక్ష్మి,




గృహజ్యోతి పథకాలు వర్తిస్తున్నాయి. మిగతా వారు దరఖాస్తు చేసుకున్నా అమలు కాలేదు. ఎంపీడీవో, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. కాగా కొత్తగా రేషన్ కార్డులు స్వీకరించిన వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటుండటంతో మరోమారు దరఖాస్తు చేసుకుంటున్నారు.

**దరఖాస్తులు స్వీకరిస్తున్నాం**

–శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌వో, సూర్యాపేట

మహాలక్ష్మి పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి ఇవి వర్తిస్తాయి. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# వైద్యుల కొరత.. రోగుల వెత

భువనగిరి : జిల్లాలో ఆరోగ్య కేంద్రాలను వైద్యులు, సిబ్బంది ఖాళీలు వేధిస్తున్నాయి. మొత్తం 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, భువనగిరి పట్టణంలో ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో సగటున 100 మందికి పైగా రోగులు వస్తున్నారు. పూర్తిస్థాయి వైద్యులు లేక రోగులు ఇబ్బంది లు పడుతున్నారు. 24 గంటల వైద్యం అందించే ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఇన్సులిన్ కూడా అందుబాటులో లేదు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో 'న్యూస్‌టుడే' పరిశీలన అంశాలు ఇవీ..రాజపేట మండల కేంద్రంలోని 24 గంటల వైద్య కేంద్రంలో ఒక్కరే వైద్యుడు సేవలు అందిస్తున్నారు. గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ కావల్సి ఉంది. జిల్లాలోని మారుమూల మండలం ఇది. ఇక్కడ సాయంత్రం వేళల్లో ఆత్మహత్యాయత్నాలు, పాము, తేలు కాటు ఘటనలు ఎక్కువగా జరుగుతుంటాయి. రాత్రి వేళల్లో స్టాఫ్ నర్సు వైద్యం అందిస్తున్నారు.యాదగిరిగుట్ట పీహెచ్‌సీకి నిత్యం వంద మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇద్దరు వైద్యుల్లో ఇటీవల ఒకరు పీజీ కోర్సుకు వెళ్లారు. దీంతో ఒక వైద్యుడితోపాటు సూపర్‌వైజర్ (మేల్) ఖాళీగా ఉన్నాయి. స్థానికులను, దేవస్థానానికి వచ్చే భక్తులను పరీక్షించడం కష్టంగా మారింది. గుండ్లపల్లి, మాసాయిపేటలో వైద్యుల పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. ఆత్మకూరు(ఎం) 24 గంటల పీహెచ్‌సీలో ఇద్దరికిగాను ఒక్క వైద్యుడే ఉన్నారు. ఆదివారం, ఇతర సెలవు రోజులు, అధికారుల సమావేశాలు, సమీక్షలు ఉన్న రోజుల్లో సిబ్బంది వైద్యమే రోగులకు దిక్కవుతోంది. భువనగిరి అర్బన్‌కాలనీలోని అర్బన్ హెల్త్‌సెంటర్(యూ హెచ్‌సీ) అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య సేవలు మాత్రమే అందుతున్నాయి. 24 గంటల వైద్యసేవలు అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రతి సోమవారం గర్భిణులకు వైద్యసేవలతో పాటు ఎన్‌సీడీ శిబిరం, వ్యాక్సినేషన్ అందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నిరోష తెలిపారు.

మోత్కూరు పీహెచ్‌సీలో తాగునీరు లేక రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల కింద మరమ్మతులకు గురైన నీటిశుద్ధి యంత్రంను బాగుచేయించడంలేదు. ఇక్కడ ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒకరిని రెండేళ్ల క్రితం భువనగిరి యూహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపారు. ఎంపీహెచ్‌ఎస్ (మేల్) పోస్టు, ఎంపీహెచ్‌ఈఓ, స్టాఫ్‌నర్స్ పోస్టులు ఏడాదిగా ఖాళీగా ఉన్నాయి.

చురకలు



## కొన ఊపిరితో ఆయుష్

కొయ్యలగూడెం : టి.నరసాపురం హోమియో ఆసుపత్రికి సొంత భవనం లేదు. వెలుగు సామాజిక భవనంలో కేటాయించిన గదిలో వైద్యురాలు రోగులకు సేవలందిస్తున్నారు.

సంప్రదాయ వైద్యం ఆయుష్‌ను వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో ఆయుర్వేద, యునాని, హోమియోపతి వ్యవస్థలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడాయి. చాలాచోట్ల సొంత భవనాలు లేవు. ఇటీవల కూటమి ప్రభుత్వం చొరవతో వైద్యుల నియామకం జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో భర్తీ కాక కొరత వేధిస్తోంది. సరైన వసతులు లేక ఆయుష్ ఆసుపత్రులు నిరాదరణకు గురవుతున్నాయి.

**జోన్-2లో..** ఉమ్మడి జిల్లాలైన కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మొత్తం 144 ఆయుష్ ఆసుపత్రులున్నాయి. వీటిలో సొంత భవనాలు ఉన్నవి పశ్చిమ గోదావరిలో 21 ఉన్నాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ప్రాంగణాల్లో 36 పని చేస్తుండగా.. మిగిలిన 30 చోట్ల అద్దె చెల్లించనక్కర్లేని భవనాల్లో ఉన్నాయి. నాలుగు చోట్ల అద్దె భవనాల్లో సాగుతున్నాయి. కొన్నిచోట్ల శిథిలమయ్యాయి. సొంత భవనాలు



లేనిచోట్ల దాదాపు ఓపీ సేవలకే కాని రోగులు ఇన్ పేషెంట్లుగా ఉండి చికిత్స పొందే అవకాశం లేదు.

**ఇంకా 32 చోట్ల ఖాళీలు..** ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఆయుష్ వైద్యుల నియామకాల్లో భాగంగా జోన్-2లో ఆయుర్వేదం 22, హోమియోపతి వైద్యులు 16 మందిని నియమించింది. ప్రస్తుతం ఆయుర్వేదం 88 మందికి 69 మంది, హోమియోపతిలో 48 మందికి 36 మంది, యునానిలో 8 మందికి ఏడుగురు వైద్యులు పని చేస్తున్నారు. ఇంకా 32 చోట్ల వైద్యుల భర్తీ జరగాల్సి ఉంది. పాడైన భవనాలకు ఏఏఎమ్ నిధులతో కొంతమేర మరమ్మతులు చేసినప్పటికీ ఇంకా మిగిలే ఉన్నాయి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు పూర్తి చేయిస్తామని ఏలూరుకు చెందిన ఆయుష్ జోన్-2 ప్రాంతీయ ఉపసంచాలకుడు(ఆర్‌డీడీ) కార్యాలయం అధికారులు చెబుతున్నారు.

## సమీక్షిస్తారా.. సరిపెట్టేస్తారా?

ఏలూరు : జిల్లాలో ఎరువుల కొరత రైతులను వేధిస్తోంది. కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నా వ్యవసాయశాఖ స్పందన నామమాత్రం. పారిశుద్ధ్యం లోపించి దోమలు విజృంభిస్తున్నా, గత పాలకులు పంచాయతీ నిధుల్ని కొల్లగొట్టినా యంత్రాంగానికి పట్టడం లేదు. అధికారుల క్షేత్రపర్యటనలు అరుదుగా ఉండటంతో బ్లీచింగ్, ఫాగింగ్ మొక్కుబడి తంతుగా మారాయి. విద్యుత్తు సంబంధిత సమస్యలతో ప్రధానంగా ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్లయినా ఏలూరు వైద్య కళాశాల భవనాలు పూర్తికాలేదు. ఇవన్నీ డీఆర్సీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**ఇదిగో యంత్రాంగ నిర్లక్ష్యం**

వైకాపా హయాంలో కొందరు సొసైటీ ఛైర్మన్లు, కార్యదర్శులు కుమ్మక్కై ఇష్టానుసారం రుణాలిచ్చి అక్రమాలకు పాల్పడ్డారు. టి.నరసాపురంలో రూ.16 కోట్లు, పోతునూరు, కామవరపుకోటలో రెండేసి కోట్లు,



బాదంపూడి, జంగారెడ్డిగూడెం, సరిపల్లి సొసైటీల్లో రూ.1.50 కోట్ల దాకా పక్కదారి పట్టాయని తేల్చారు. ఏ ఒక్కచోటా ఆస్తులు వేలం వేసి రికవరీలు చేయటానికి దస్త్రాలే సిద్ధం చేయలేదు.

ఏలూరు బోధనాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్య సేవలు కంటితుడుపుగా ఉంటున్నాయి. ట్రామాకేర్ సేవలకు నోచుకోవటం లేదు. కొన్ని విభాగాల్లో వైద్యుల కొరత ఉందని మధ్యాహ్నం తర్వాత సేవలు అందించటం లేదు. హౌస్ సర్జన్లపైనే ఆసుపత్రి నడుస్తోంది. 2021లో వాడిన విద్యుత్తు వినియోగానికి ఇటీవల అధికారులు డిమాండ్ నోటీసులు నోటీసులు పంపారు. నాలుగేళ్ల తర్వాత వసూళు ఏమిటని ఆక్వా రైతులు ప్రశ్నిస్తున్నారు. కైకలూరులో 133 కేవీ స్టేషన్ కార్యరూపం దాల్చలేదు.

నూజివీడు పెద్ద చెరువు గతేడాది అధికవర్షాలకు తెగిపోయింది. దానికి ఇప్పటికీ శాశ్వత మరమ్మతులు చేయలేదు.

చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో పలు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రహదారులు గుంతలుపడి రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నాయి.

## పులికి ఆకలేస్తోంది!

పెద్దదోర్నాల : నల్లమల అటవీ ప్రాంతంలో పులులు, చిరుతల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వాటి ఆహారమైన దుప్పులు, సాంబార్‌లు, ఇతర జంతువుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. దీంతో ఆహార వేటలో భాగంగా అవి అడవి దాటి బయటకు వస్తున్నాయి. ఆ క్రమంలోనే కొద్ది రోజు క్రితం దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం, అర్ధవీడు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆవులు, గేదెలను సంహరించాయి. తాజాగా చిన్నారుట్ల చెంచు గిరిజన గూడెంలో ఓ చిరుత సంచరిస్తుండడం అక్కడి వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో వన్య మృగాల ఆహార కొరత తీర్చేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇతర ప్రాంతాల నుంచి జింకలు, దుప్పులను ఇక్కడకు తరలిస్తోంది.

**వన్యప్రాణుల తరలింపు...**కొందరు పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు ప్రైవేటుగా జూలు ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో వన్యప్రాణులను సాకుతున్నారు. ప్రభుత్వం వీటిని నిషేధించడంతో అధికారులు అక్కడ ఉన్న జంతువులను స్వాధీనం చేసుకుని సమీప అటవీ ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారు. ఈ క్రమంలోనే కాకినాడలోని ఓ ప్రైవేటు జూలో వందకు పైగా దుప్పులు, సాంబార్‌లతో పాటు... శ్రీ సత్యసాయి జిల్లాలోని కొండ ప్రాంతంలో మరో నలభైకి పైగా వన్యప్రాణులను స్వాధీనం చేసుకుని నల్లమలకు తరలించారు. వీటిని నేరుగా అడవిలో వదిలేస్తే... కొత్త ప్రాంతం కావడంతో మనలేక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. ఆ సమస్య తలెత్తకుండా ఇక్కడి వాతావరణం అలవాటు చేసేందుకు ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. **వాతావరణానికి అలవాటు పడేలా...**మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో దోర్నాల రేంజ్‌లోని తెట్టెగుండం, కొర్రప్రోలు రేంజ్‌లోని పెద్దపెంట, నెక్కంటి రేంజ్‌లోని ఆరెపెంట, గంగారపెంట ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు. హెక్టారు విస్తీర్ణంలో ఉండే ఎన్‌క్లోజర్ చుట్టూ తొమ్మిది అడుగుల కంచె వేశారు. బయట నుంచి తెచ్చే వన్యప్రాణులను 21 రోజుల పాటు వీటిలో ఉంచి సంరక్షిస్తారు. వాటికి అవసరమైన గడ్డి, నీరు అందులో అందుబాటులో ఉంచుతారు. ఈ వాతావరణానికి అలవాటు పడ్డాక అడవిలో విడిచిపెడతారు.

# అడ్డగోలు క్రాసింగ్‌లు.. అంతులేని విషాదాలు



పుత్తూరు : శ్రీవారి దర్శనార్థం రోడ్డుమార్గంలో ప్రముఖులు, భక్తులు నిత్యం విచ్చేస్తుంటారు.. స్వామివారిని త్వరగా దర్శించుకోవాలనే ఆత్రుత.. తిరుగు ప్రయాణంలో త్వరగా గమ్యస్థానం చేరుకోవాలనే ఉద్దేశంతో వాహనదారులు వేగం పెంచుతుండగా హఠాత్తుగా అనుకోని ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా మల్లవరం సమీప కాలూరు క్రాస్ నుంచి నగరిలోని తడుకుపేట వరకు అనధికారిక క్రాసింగ్‌లు పెద్దఎత్తున వెలిశాయి.. ఇటీవలి సర్వే ప్రకారం మూడేళ్లలో 172 మంది మరణించగా 254 మంది గాయపడ్డారు.. తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో జరుగుతున్న మృత్యుఘోషపై ప్రత్యేక కథనం.

**తిరుపతి గ్రామీణ పరిధిలో..**

తనపల్లి క్రాస్ వద్ద హెచ్చరిక బోర్డులు లేక 15 ప్రమాదాలు జరిగి 11 మంది మరణించారు. రామచంద్రాపురం కూడలివద్ద నిత్యం ప్రమాదాలే. ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాల బస్సును లారీ ఢీకొని పదిమంది విద్యార్థులు గాయపడ్డారు. ఇప్పటివరకు ఇక్కడ 13 మంది మృతిచెందగా, తొమ్మిది మంది గాయపడ్డారు.

**పుత్తూరు**

పట్టణ పరిధిలోని కొండలచెరువు వద్ద డివైడర్‌ను కొట్టేసి అనధికారికంగా దారి ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటివరకు 15 ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతిచెందారు. సమీప గోవిందపాళెం, మరాఠీగేటు ప్రాంతంలో ఐదుగురు ప్రాణాలు వదిలారు. పుత్తూరు పున్నమి కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతిచెందారు.

**వడమాలపేట..**

అంజేరమ్మ కనుమ, తడుకు రైల్వేస్టేషన్, శిరుగురాజుపాళెం, మజ్జిగగుంట ప్రాంతాల్లో అనధికారికంగా రోడ్డు డివైడర్‌ను కొట్టేసి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఇప్పటివరకు 17 మంది మృత్యువాత పడ్డారు. వడమాలపేట మండలంలో కొటాల వద్ద నలుగురు, కదిరిమంగళం, వడమాలపేట బైపాస్ వద్ద నలుగురు, వెంగళరాజుకండ్రిగ వద్ద ఇద్దరు మృతిచెందారు.

**రేణిగుంట పరిధిలో..**గాజులమండ్యం పారిశ్రామికవాడ వద్ద అనధికారికంగా డివైడర్ పగులగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఏడాదిలో ఐదుగురు మృతిచెందారు. కేఎల్ఎం ఆస్పత్రి వద్ద తిరుపతి-చిత్తూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, కడపకు వెళ్లే కూడలిలో కనీసం సిగ్నళ్లు లేవు. ఉదయం, సాయంత్రం కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పది ప్రమాదాలు జరిగి నలుగురు చనిపోయారు. **ప్రభుత్వానికి నివేదించాం**

తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుతోపాటు అనధికారిక దారులు మూసివేయడంతో ప్రమాదాలు పూర్తిగా నివారించవచ్చు. నిత్యం తనిఖీలు చేయడం, అతివేగంగా వెళ్లేవారికి జరిమానా విధించడంతో చాలావరకు ప్రమాదాలు తగ్గించవచ్చు. ప్రమాదాలు, ఉల్లంఘనలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే సర్వేచేసి ప్రభుత్వానికి నివేదించాం.

చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

# రూ.22.88 కోట్లు పత్తాలేవు



చిత్తూరు : జిల్లా పరిషత్‌లో ప్రజాధనాన్ని హారతి కర్పూరంగా మార్చేశారు.. గత వైకాపా పాలనలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రికి వీరవిధేయుడిగా వ్యవహరిస్తూ వైకాపా నాయకుల కనుసన్నల్లో కొనసాగిన విశ్రాంత సీఈవో ప్రభాకరరెడ్డి.. పలు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.. ఈ ఆరోపణలకు ఆడిట్‌లో వెలుగుచూసిన అంశాలే నిలువెత్తు నిదర్శనం. 2023-24లోనే ఎన్నడూ లేనంతగా 90 అభ్యంతరాలకు సంబంధించి రూ.22.88 కోట్లకు లెక్కల్లేవంటూ ఆడిట్‌శాఖ ధ్రువీకరించింది..

**ఆర్థిక సంఘం.. రూ.13.50 కోట్లు**

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.13.50 కోట్లకు లెక్కల్లేవు. ఈ నిధులను ఎక్కడ, ఏపనికి ఖర్చు చేశారో తెలియదు. నిధులేమో విడుదల చేశారు. పనుల అంచనాలు, టెండర్ల ఊసేలేదు. నిధులు నిర్వహణకే ఖర్చుచేశారా లేదా పనులు జరగకుండానే స్వాహా చేశారా అనేది విశ్రాంత సీఈవోకే తెలియాలి. ట్రెజరీ నుంచి తప్పుడు వోచర్లు సమర్పించి డ్రా చేసినట్లు వెలుగు చూసింది.

**అస్తవ్యస్తంగా పీఎఫ్ విభాగం..**

జడ్పీ పీఎఫ్ విభాగంలో సమగ్రంగా రికార్డులే లేవు. వడ్డీ చెల్లింపులు, రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు. క్యాష్‌బుక్ నిర్వహణ గాలికొదిలేశారు. పీఎఫ్ వ్యక్తిగత లగ్జరీ రికార్డులు లేవు. జడ్పీ ఆస్తులు, అతిథి గృహాల వివరాలు లేవు. జడ్పీ ఆదాయ లెక్కలు గాలికొదిలేశారు.

**జీఎస్టీ జమెక్కడ?**

జీఎస్టీ, వ్యాట్, ఐటీ, క్యూసీ తదితర పన్నుల రూపంలో సమకూరిన రూ.25-30 లక్షలు ప్రభుత్వానికి జమ చేయలేదు. దస్త్రాలు లేవు. సర్వీసు పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్ నగదు రూ.2.05 కోట్లు సాధారణ నిధులకు మళ్లించారు. రికార్డులు సక్రమంగా లేవు.

**ఇష్టానుసారంగా ఖర్చు..**

మండల పరిషత్‌లకు నిధుల కేటాయింపుల్లోనూ నిబంధనలు పాటించలేదు. సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఎం.బుక్‌లు, అగ్రిమెంట్లు, టెండర్లు, అంచనాల వివరాలు లేవు. తలసరి గ్రాంట్, సీనరేజీ సెస్సు తదితర పద్దులకు సంబంధించి నిబంధనలు పాటించ లేదనే ఆరోపణలు ఉన్నాయి. జడ్పీ సాధారణ నిధులు ఇష్టానుసారంగా ఖర్చుచేశారు. ఏడాదిలో సభలు, సమావేశాల పేరుతో భోజనం, టిఫిన్ ఖర్చులకు రూ.31.28 లక్షలు వెచ్చించారు.

**అధికారులకు నోటీసులిచ్చాం..**

2023-24 ఆడిట్ అభ్యంతరాలు పరిష్కరించుకోవాలని అప్పటి జడ్పీ సీఈవో, అధికారులకు నోటీసులు ఇచ్చాం. పరిష్కరించుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు.

గోవిందప్ప, ఆర్‌డీడీ, ఆడిట్ శాఖ

# సరిపోని.. ఊతం

పుంగనూరు : దక్షిణాది రాష్ట్రాల్లో పుంగనూరు, పలమనేరు టమాటా మార్కెట్లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రైతులు పండించే ప్రముఖ వాణిజ్య పంటల్లో టమాటా ఒకటి. సాధారణంగా మార్చి నెలాఖరు నుంచి జూన్, జులై వరకు పంట సీజన్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది ఆలస్యంగా మొక్కలు నాటడంతో సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. పుంగనూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల్లో దాదాపు 16 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం సీజన్ ముగియడంతో చాలామంది రైతులు టమాటా పంటతో పెట్టిన పెట్టుబడి రాకపోగా.. కర్రలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దిగుబడులు తగ్గేకొద్దీ ధరలు**

మే, జూన్, జులై నెలల్లో వచ్చిన దిగుబడులు, పలికిన ధరలు చూస్తే దిగుబడులు తగ్గే కొద్దీ ధరలు పలికాయనేది స్పష్టమవుతోంది. పుంగనూరు, పలమనేరు, వి.కోట మార్కెట్లలో మేలో సరాసరి రోజుకు రెండువేల దిగుబడి వచ్చేది. కిలో రూ.5-6 మధ్య పలికింది. జూన్‌లో 1500 టన్నులు రాగా కిలో రూ.17-20, జులైలో 1100 టన్నులు రాగా రూ.30-32 పలికింది.

**250 టన్నులు గగనం..**జూన్ నెలాఖరు నుంచి కొద్దికొద్దిగా ధరలు పెరుగుతూ వచ్చాయి. ధరలు లేకపోవడంతో కొత్తగా మొక్కలు



నాటలేదు. పైగా ఉన్న తోటల సస్యరక్షణ, సస్యరక్షణ పనులు చేయకపోవడంతో దిగుబడులు తగ్గాయి. మేలో రోజుకు రెండువేల టన్నులు రాగా.. ప్రస్తుతం 250 టన్నులు రావడం కష్టంగా మారింది. దీనికితోడు దిగుబడుల నాణ్యత లేకపోవడంతో కాయలు రోడ్డు పక్కన పడేస్తున్నారు. పుంగనూరు, పలమనేరు, వి.కోట మార్కెట్లలో ఆదివారం కిలో రూ.40 నుంచి రూ.42 వరకు పలికింది. 20 రోజులుగా కిలో రూ.40 తగ్గకుండా ధరలు పలుకుతున్నాయి.

## భూములు సిద్ధం.. అనుమతులే తరువాయి

నగరి : చిత్తూరు జిల్లా సరిహద్దులో పారిశ్రామిక హబ్ నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే ఆశయానికి అనుగుణంగా అవసరమైన భూములు సిద్ధంగా ఉన్నాయి. ప్రధానంగా నగరి నియోజకవర్గంలో వీకేఆర్‌పురం, మాంగాడు, కోసలనగరం ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి పరిశ్రమలకు అనుకూలంగా ఉన్నందున, వాణిజ్య కేంద్రమైన చెన్నైకు 80 కి.మీ. దూరంలో ఉన్నందున పారిశ్రామిక హబ్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం ఆలోచించింది. తదనుగుణంగా భూముల సేకరణ ప్రక్రియ పూర్తి చేసి ఏపీఐఐసీకి అందించింది. ఈ ఆలోచన మొదలైన నాటి నుంచి అనుమతుల కోసం ఎదురుచూపులు తప్పటం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి, బయట నుంచి వచ్చే వారికి నమ్మకం కలిగేలా మొదట మన ప్రాంతంలోని వారికి అవకాశం ఇచ్చి చూపితే ఈ ప్రక్రియ వేగవంతమవుతుంది.

**ప్రతిపాదన దశ దాటని టెక్స్‌టైల్ పార్కు..**

టెక్స్‌టైల్ పార్కు మాట ఇప్పటిది కాదు. 1998 నుంచి నగరిలో వినిపిస్తున్న రాజకీయ హామీ. నియోజకవర్గంలో మరమగ్గ పరిశ్రమ ద్వారా వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఏడాదికి రూ.3 నుంచి రూ.5 కోట్ల వరకు వస్త్రఉత్పత్తి సాగిస్తున్న పరిశ్రమ నేటికీ కుటీర పరిశ్రమగానే కొనసాగుతోంది. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా ఇక్కడ టెక్స్‌టైల్ హబ్ ఏర్పాటు ప్రతిపాదన



దశ నుంచి అడుగు ముందుకు పడలేదు. నగరి, పుత్తూరులో 26 వేల నేతకార్మిక కుటుంబాలు, 45 మరమగ్గాలు ఉన్నాయి. వారికి సాంకేతిక సహకార కేంద్రంతోపాటు హబ్ ఏర్పాటుచేస్తే ఉపాధి రెట్టింపయ్యే అవకాశం ఉంది. ఇతర పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉంది.

**చిత్తూరు-తచ్చూరు హైవే పక్కనే..**

ప్రస్తుతం చిత్తూరు తచ్చూరు హైవే నగరి మండలంలో రావటంతో ఇటు చెన్నై, అటు బెంగళూరుకు రవాణా సులవవుతుంది. దీనికి అతిచేరువలో పక్కనే వీకేఆర్‌పురం వద్ద 152,13 ఎకరాల భూమి సిద్ధంగా ఉంది. ఇందుకు అవసరమైన రోడ్డు కోసం మరో 8.12 ఎకరాలు ఇటీవలే రెవెన్యూ అధికారులు సేకరించి సిద్ధం చేశారు. మాంగాడులో మరో 89.12 ఎకరాలు సిద్ధంగా ఉంది. ఇందుకు జాతీయ రహదారి నుంచి రోడ్డు కోసం మరో 11 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించారు. ఇలా అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఇక ఆలోచన అమలు చేయడంలో వేగం అవసరం.

## కట్టకుంటే కట్టేయండి

కైకలూరు పేదలకు సొంతింటి కల సాకారం చేస్తామని వైకాపా ప్రభుత్వం బాకాలూదింది. స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేస్తామనడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రక్రియ ప్రారంభంకాగానే లబ్ధిదారులే ఇంటి నిర్మాణాలు చేసుకోవాలనడంతో చాలామంది ఆసక్తి చూపలేదు. కాగ్ అభ్యంతరం.. రెండున్నరేళ్లవుతున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఈ గృహ నిర్మాణాల్లో ఎటువంటి పురోగతి లేదు. ముందస్తు చెల్లింపులపై కాగ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కూటమి ప్రభుత్వం పునాది దశ పనులు మొదలు పెట్టని వారి నుంచి నగదు తిరిగి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా ముందస్తు నగదు తీసుకున్న లబ్ధిదారులు 3,320 మంది ఉండగా రూ.6.37 కోట్లు నగదు రికవరీ చేయాల్సి ఉంది.

**ముందస్తు చెల్లింపులు..** వైకాపా హయాంలో ఇంటి స్థలం ఇచ్చినా వందలాది మంది నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో వెనకడుగు వేయడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. కేంద్రం నుంచి అదనపు నిధులు రావాలంటే గృహ నిర్మాణ సంస్థలో ఉన్న నిధులు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇందుకోసం 2022-23లో పునాది దశ దాటని గృహాలకు సర్దుబాటు నిధులుగా లబ్ధిదారుకు రూ.20 వేలు ముందస్తు చెల్లించారు.

**సదుపాయాలు లేకనే..** వైకాపా అనాలోచిత నిర్ణయాలతో నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో జగనన్న కాలనీల పేరిట స్థలాలు ఇచ్చారు. మోస్తరు వర్షం పడితే చెరువులను తలపిస్తున్నాయి. భవన నిర్మాణ సామగ్రి చేరవేసుకునే వెసులుబాటు లేదు. అవస్థలు పడలేక నగదు ఇచ్చినా ఇంటి నిర్మాణాలు చేయలేక పోయారు. 'పనులు ప్రారంభించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగదు వెనక్కి ఇవ్వాలని నోటీసులు అందిస్తున్నాం. ఇప్పటి వరకు రికవరీ ఏమీ లేదు.' అని గృహనిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ తెలిపారు.

## మళ్లీ మీ సేవలో..

భీమవరం : కూటమి ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 మార్కెట్ యార్డులకు ఛైర్మన్ల నియామకాలను దాదాపు పూర్తి చేసింది. ఇక మార్కెటింగ్ శాఖను గాడిన పెట్టి రైతు ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయనుంది. మార్కెట్ యార్డుల్లో చప్టాలు, గోదాములను రైతులు ఉచితంగా వినియోగించుకోవచ్చు. గిట్టుబాటు ధర లేనప్పుడు, వర్షాల సమయంలో ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను ఇక్కడ నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది. గోదాముల్లో నిల్వ చేసుకునే పంట ఉత్పత్తులకు మార్కెట్ ధర ఆధారంగా మార్కెటింగ్ శాఖ




తక్కువ వడ్డీకి రుణాలు కూడా మంజూరు చేసేది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వ చేసే పంట ఉత్పత్తులపై రుణం అందించనుంది. ఈ ఖరీఫ్ పంట కాలంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.8.20 కోట్లు రుణం మంజూరు చేయడానికి అవకాశం కల్పించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్‌కుమార్ తెలిపారు. ఖరీఫ్ కోతలు పూర్తయిన తరువాత రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర వచ్చిన తరువాత విక్రయించుకోవచ్చునన్నారు. ఒక్కో రైతుకు పంట మార్కెట్ విలువ ఆధారంగా రూ.2 లక్షల వరకూ రుణం మంజూరు చేస్తామన్నారు.

## వెయ్యి దీపాలు వెలుగుతూనే ఉన్నాయ్

హిందూపురం : హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, సడ్లపల్లిలోని ఎన్టీఆర్ కాలనీ, కొల్లకుంట, విద్యానగర్ ఇలా అనేక ప్రాంతాల్లో పగలు సైతం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. పట్టణంలో వీధి దీపాలు లేని ప్రాంతాలను గుర్తించి, మూడవ విద్యుత్తు లైన్ లేకపోయినా దాదాపు వెయ్యి చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి ఆన్ ఆఫ్ చేసే వ్యవస్థ ఉండదు. దీంతో పగటి పూటా వెలుగుతూనే ఉన్నాయి. మూడో లైన్ ఏర్పాటు చేయాలని అధికారులు మొదట్లో ఆలోచన చేసినా, ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో నెలకు రూ.లక్షల్లో విద్యుత్తు బిల్లు వస్తోంది.



**రూ.2 లక్షలతో తీగ బిగిస్తే చాలు..**

అన్ని వీధి దీపాలకు ఆన్ ఆఫ్ వ్యవస్థ ఉండాలంటే పట్టణంలో మూడో విద్యుత్తు లైన్ కోసం రెండు కిలోమీటర్ల పొడవున తీగను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి రూ.2 లక్షలు మాత్రమే ఖర్చవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సొమ్ము ఖర్చు పెడితే అంతకు మించిన ప్రయోజనం మున్సిపాలిటీకి చేకూరుతుంది. నిరంతరం బల్బులు వెలుగుతుండటంతో బిల్లు తడిసి మోపెడు అవుతుందని తెలిసినా, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. ఇప్పటికైనా అధికారులు మున్సిపాలిటీ తరపున సొంతంగా మూడవ తీగను ఏర్పాటు చేసుకోవడం లేదా.. విద్యుత్తు శాఖతో సమన్వయంతో అయినా బిగించాల్సి ఉంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి, మూడో తీగ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## సంక్షోభంలో ఆక్వా సాగు

కోట : ప్రస్తుతం ఆక్వా సాగంటే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం.. ధరలపతనం.. వెరసి రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎగుమతులపై 50 శాతం సుంకం విధించడం, రవాణా, ఇతర ఖర్చులతో రూ.లక్షలు పెట్టి సాగుచేసిన రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. టన్నుకు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు సాగు రైతులు నష్టపోతున్నట్లు అంచనా.

తిరుపతి జిల్లాలో సుమారు రెండువేల మంది రైతులు సుమారు పదివేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. రైతులు ఎక్కువగా వెనామి, టైగర్ సాగు చేస్తున్నారు. ఎకరాకు 2 నుంచి 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ క్రమంలోనే అమెరికాకు 30వేల టన్నుల వరకు ఏటా ఎగుమతి చేస్తున్నారు. వెనామి గతంలో 100 కౌంట్ కిలో రూ.240 ఉండేది. ట్రంప్ పెంచిన సుంకం దెబ్బతో రూ.210కు పడిపోయింది. దీంతో మూడు టన్నులపై రూ.1.20 లక్షల వరకు రైతులు నష్టపోతున్నారు. మొత్తం మీద రూ.12 కోట్లకు పైగానే జిల్లా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. టైగర్ సాగులోనూ రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆక్వారంగానికి జీవంపోయాల్సిన అవసరం ఉంది. రాయితీలు ఇతర



ప్యాకేజీలు ప్రకటిస్తేనే ఊరట లభిస్తుందని చెబుతున్నారు.

జిల్లాలో సాగు ఎకరాల్లో..

చిల్లకూరు 2,500 కోట 2,000 వాకాడు 2,500

చిట్టమూరు 2,000

**ప్రభుత్వం ఆదుకోవాలి**

కొక్కుపాడులో పదెకరాలలోపు రొయ్యలు సాగు చేస్తున్నాం. ఎకరా సాగుకు రూ.5 లక్షలకు పైగానే పెట్టుబడి అవుతోంది. 100 కౌంట్‌తో అమ్మితే గతంలో కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు తక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇలాగైతే సాగు కష్టతరంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి రంగాన్ని కాపాడాలి.

జితేంద్రరెడ్డి, రైతు, కొక్కుపాడు

**తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు**

అమెరికా, ఇతర దేశాలకు చేసే ఆక్వా ఎగుమతుల కారణంగానే విదేశీ మారక ద్రవ్యం అధికంగా వస్తోంది. అలాంటిది ట్రంప్ సుంకం పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎగుమతులకు విధించిన సుంకాన్ని తగ్గించేలా అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరపాల్సిన అవసరముంది.

వసంతకుమార్‌రెడ్డి, రైతు, కర్లపూడి

**త్వరలోనే స్పష్టత** ట్రంప్ వేసిన సుంకాలతో వాస్తవంగా ఆక్వా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఇబ్బందులు పడకుండా నష్టాలు నుంచి బయటపడేందుకు కమిటీని వేసింది. తద్వారా అధ్యయనం చేసి రైతులకు మేలు జరిగేటట్లు చూస్తుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.రాజేష్, జిల్లా మత్స్యశాఖాధికారి

## యూరియాకు రెక్కలు.. తేలని లెక్కలు



అనంతపురం : జిల్లా అంతటా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 3 డీసీఎంఎస్‌కు, నందేశ్వర ఫార్మర్ ప్రొడ్యూజర్ కంపెనీకి కలిపి 2,784 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. ఏ సొసైటీలో ఎంత మంది రైతులకు ఎంత యూరియా పంపిణీ చేశారో డీబీటీ నివేదికలు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఆదేశించినట్లు తెలిసింది. అయితే యూరియా పక్కదారి పట్టించినట్లు సమాచారం. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్ విక్రయించే యూరియా లెక్క తేలడం లేదు.

రాయదుర్గంలో తిరుమల ఆగ్రో సెంటర్ నిర్వాహకుడు సుమారు 22.32 మెట్రిక్ టన్నుల (221 బస్తాలు) యూరియాను ఇటీవల బళ్లారికి తరలించే ప్రయత్నం చేశాడు. గోదాములో నిల్వలకు, రికార్డు నిల్వలకు చాలా వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించారు. అందులో 14.32 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. జేసీ కోర్టుకు పంపగా విచారణలో ఉంది.

జిల్లాలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా యూరియాకు డిమాండ్ పెరిగింది. అయితే ఎక్కడా నిల్వలు లేవు. జిల్లాలో యూరియా పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. హెూల్‌సేల్, ప్రైవేటు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి, దోపిడీకి పాల్పడుతున్నారు. జిల్లాకు కేటాయించిన యూరియా ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఎక్కువ కేటాయింపులు జరగాలి. ఆ తర్వాత డీలర్లకు కేటాయించాలి. అయితే అధికారులు లోపాయికారి ఒప్పందంతో డీలర్లకే ఎక్కువగా కేటాయింపులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. యూరియా అందక రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

**ఈ-పాస్ పక్కనపెట్టి విక్రయాలు**

రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లకు యూరియాను ప్రతినెలా సరఫరా చేస్తూ వచ్చారు. ఈ-పాస్ ఆధార నంబరును నమోదు చేసి రైతుకు యూరియా సరఫరా చేయాలి. అయితే వారెవరూ ఈ-పాస్ యంత్రాలు వాడలేదు. బస్తా ధర రూ.266.50 ఉండగా రూ.350-400 వరకు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతర జిల్లాల్లోని ఆధార్ నంబర్లతో యూరియాను తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు వారీగా పంపిణీ లెక్కలు బయటకు తీస్తే పెద్దఎత్తున అక్రమాలు బయటపడే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొనడం గమనార్హం.

జిల్లాకు యూరియా కావాలని వ్యవసాయాధికారులు రాష్ట్ర అధికారులను కోరారు. వారు ఆన్‌లైన్‌లో పరిశీలించి మీ వద్ద యూరియా దండిగా ఉందని బదులిచ్చారు. క్షేత్రస్థాయిలో దుకాణాలు, ఆర్ఎస్‌కేలు, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లలో పరిశీలిస్తే ఎక్కువ భాగం ఈ-పాస్ యంత్రాలు వాడలేదని బయటపడింది. గత కొన్నేళ్లుగా యంత్రాలను వాడటం లేదు. గాడిలో పెట్టాల్సిన అధికారులు గాలి కొదిలేశారు.

**ఎక్కడా కొరత లేదు**

ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ సంయుక్త సంచాలకులు (అనంతపురం)

జిల్లాలో 4,162 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. ఎక్కడా కొరత లేదు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే డీలర్ల లైసెన్సులు రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం

## పశు సంపదకు ఆపద!



ధర్మవరం : తాడిమర్రి మండల సరిహద్దులోని పెద్దకోట్ల, దాడితోట గ్రామాల సమీపంలోని చౌడమ్మకొండలో అదానీ సంస్థ పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడుతోంది. కొండలో పనులు చేస్తుండటంతో మేతకు ఉపయోగపడే చెట్లు, మొక్కలు నేలకొరుగుతున్నాయి. ఫలితంగా పశువులు, గొర్రెలు, మేకలకు మేత లేకుండా పోతోంది. పాడిరైతులు గ్రాసాన్ని అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయలేక పశువులను అమ్మేస్తున్నారు. మరికొందరు పశువుల మందలను తీసుకుని ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

**ఆ గ్రామాల్లో పశు ఘోష**

తాడిమర్రి మండలంలోని దాడితోట, పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాల్లో పశు సంపద ఎక్కువగా ఉంది. పాడి పరిశ్రమపై వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. మూడేళ్ల క్రితం మూడు లక్షలకుపైగా ఉన్న పశువులు, జీవాలు ప్రస్తుత గణాంకాల ప్రకారం యాభైవేలకు లోపే ఉన్నాయి. కొండంతా ధ్వంసం చేసి ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. పచ్చదనం కనుమరుగవుతోంది. మేత లేని కారణంగా పశువులు తరిగిపోతున్నాయని పాడిరైతులు వాపోతున్నారు.

**హామీ విస్మరించారు**

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పరిశ్రమ వల్ల పశువుల మేతకు కొరత ఏర్పడితే ఆయా అటవీ ప్రాంతాల్లో గడ్డి విత్తనాలు చల్లడం, మొక్కలు నాటడం వంటివి చేస్తామని పరిశ్రమ పెద్దలు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ హామీని విస్మరించారని పాడి రైతులు లబోదిబోమంటున్నారు.

**మేత లేకుంటే ఇబ్బందే**

గంగయ్య, పెద్దకోట్ల గ్రామం

మూడు, నాలుగు గ్రామాలు గొర్రెలు, మేకలు, ఎనుములతోనే కుటుంబాలను పోషించుకుంటున్నాం. పరిశ్రమ వచ్చినప్పటి నుంచి కొండలో బ్లాస్టింగ్ చేపడుతున్నారు. శబ్దాలకు పశువులు కొండపైకి వెళ్లడం లేదు. కొండలో మేత లేకపోవడంతో వలస పోతున్నాం. పరిశ్రమ వస్తే మంచిదే. అయితే పాడి రైతులు కూడా బాగుండాలి కదా. సంక్షేమం కోసం ఏదైనా చేయాలని కోరుతున్నాం.

సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతా భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్

రెండు రోజుల్లో అదానీ సంస్థ ప్రతినిధులను కార్యాలయానికి పిలిపించి ఈ సమస్యపై చర్చిస్తా. పశువులకు మేత లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఉంటాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

## కబ్జా కోరల్లో కాలువ గట్టు!



పరిగి : పెన్నా, జయమంగళి నదుల నుంచి వరద నీటిని పరిగి చెరువుకు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పరిగి కాలువ గట్టు (సప్లయ్ ఛానల్) ఆక్రమణకు గురైంది. కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం గట్టును చదును చేసి తమ సొంత భూముల్లోకి కలుపుకొన్నారు. 10 అడుగుల వెడల్పు ఉన్న గట్టు చివరకు నడిచి వెళ్లేందుకు సైతం లేకుండా పోయింది. వర్షాకాలంలో వరద నీటిని చెరువుకు మళ్లించే సందర్భంలో ప్రవాహం ఉద్ధృతి ఎక్కువైతే బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో కాలువ కోతకు గురయ్యే అవకాశం ఉంది. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని పరిగి సప్లయ్ ఛానల్‌లో ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్ల వ్యయంతో ఐదేళ్ల కిందట పూడిక మట్టి, ముళ్లకంపను తొలగించి గట్లపై మట్టితో నింపి పటిష్ఠం చేశారు. వరద నీరు ప్రవహించే సమయంలో కాలువ కోతకు గురైతే యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించేందుకు 10 అడుగుల మేర గట్టుపై మట్టి వేయించారు. అయితే కొందరు స్వార్థపరులు గట్లపై ఉన్న మట్టిని తొలగించి ఆక్రమించుకున్నారు.పగిరి మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నది వరద నీటిని చెరువుకు మళ్లించేందుకు నదికి అడ్డంగా బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖ అధికారులు ఏడు షట్టర్ల గేట్లను ఏర్పాటు చేశారు. 3 కిలోమీటర్ల మేర కాలువను 15 అడుగుల వెడల్పుతో తవ్వారు. అప్పట్లో రైతులు స్వచ్ఛందంగా కాలువ ఏర్పాటుకు తమ పొలాల్లో కొంత భూమిని దానంగా ఇచ్చారు. ఇటీవల తమ పొలాల్లోనే కాలువ వెళుతోందని గట్టుపై ఇరిగేషన్‌శాఖ అధికారులు వేసిన మట్టిని తొలగించి తమ పొలాల్లోకి కలుపుకొన్నారు. కొందరు రైతులు ఏకంగా గట్టుపై ముళ్ల కంచె ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు వర్షపు నీరు కాలువలోకి ప్రవహించకుండా లోతట్టు ప్రాంతాల్లో మట్టిని నింపి పూడ్చేశారు. గతంలో చెరువుకు నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం రైతుల నుంచి భూమిని సేకరించింది. ప్రజా అవసరాల కోసం భూములు ఇచ్చిన రైతులకు వాటిపై హక్కు ఉన్నప్పటికీ ఆక్రమించేందుకు వీలు లేదని చట్టం చెబుతోంది.

**సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం** రమణారెడ్డి, డీఈఈ ఇరిగేషన్ శాఖ, పెనుకొండ పరిగి సప్లయ్ ఛానల్ గట్టు ఆక్రమణకు గురైన ప్రాంతాలను సర్వే చేయిస్తాం. ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటాం. కోతకు గురైన కాలువ గట్లకు మరమ్మతులు చేయిస్తాం.

## బిరబిరా.. కృష్ణమ్మ

కుప్పం : అసలే కరవు ప్రాంతం.. వర్షాలు పడితేగానీ తాగు, సాగు నీరందని దుస్థితి.. ఎలాంటి ప్రాజెక్టులు సైతం లేకపోవడంతో ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితి.. ఒకానొక సమయంలో తీవ్ర వర్షాభావంతో రైళ్ల ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించాలని యత్నించటం.. ఆ సమయంలోనే వర్షం కురవడంతో చెరువులు నిండి నీటి సమస్య తీరింది.. అలాంటి సమస్య మళ్లీ రాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.575 కోట్ల వ్యయంతో హంద్రీ-నీవా కాలువను కుప్పానికి మంజూరు చేయించారు. అప్పట్లో ఆ పనులు ముందుకు సాగకుండా వైకాపా నాయకులు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో కుప్పానికి హంద్రీ-నీవా నీరు తెచ్చేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారు.

కుప్పం కరవు తీరేలా హంద్రీ-నీవా జలాలను ఈనెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పురపాలికలోని పరసముద్రంలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీరు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. మరో పది, పదిహేను రోజుల్లో హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి కృష్ణా జలాలు రానున్నాయి. ఈ దఫా వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో కృష్ణమ్మ జలాలు



ఎప్పుడెప్పుడు వస్తాయా అని రైతులు, ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ జలాలు కుప్పం నియోజకవర్గంలోని చివరి చెరువు అయిన పరమసముద్రం చెరువుకు చేరనున్నాయి.

**సామర్థ్యం పెంచేందుకు చర్యలు..**

హంద్రీ-నీవా జలాలతో కుప్పం నియోజకవర్గంలోని 430 చెరువులు నింపనున్నారు. ఈ నేపథ్యంలో చెరువుల సామర్థ్యం, చెక్‌డ్యాంలను బాగు చేయడం, నీటినిల్వలో ఎలాంటి లోపాలు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు, నాయకులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

**పనులు వేగవంతం** హంద్రీ-నీవా పనులు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయి. కృష్ణా జలాలతో చెరువులన్నీ నింపి కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం. త్వరలో కుప్పానికి నీళ్లు రానున్నాయి.కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ

## దోచుకుంటున్నా.. కేసుల్లేవ్..!

తిరుపతి : తిరునగరిలో మెప్మా గాడినపడటం లేదు. 26వ డివిజన్ పరిధిలో రెండేళ్ల కిందట ఓ ఆర్పీని, కార్పొరేటర్ భర్త సహకారంతో నియమించుకున్నారు. సదరు ఆర్పీ రూ.29 లక్షలు స్వాహా చేసింది. మెప్మా అధికారులు, వైకాపా నాయకులు రాయభారం చేయగా రూ.12 లక్షలు మాత్రమే చెల్లించి చేతులెత్తేసింది. మెప్మా అధికారులు ఆర్పీకి ఫోన్‌చేస్తేకార్పొరేటర్ భర్త అడ్డుపడుతూ వచ్చారు. సీవో, సీఎంఎం మెప్మా నియమించిన ఆడిట్ బృందంతో కాకుండా ప్రైవేటు ఆడిట్ చేయించడంపై అప్పట్లో విమర్శలు ఉన్నాయి. ఇటీవలే లక్ష్మీపురం, పార్వతీపురం ఝాన్సీ లక్ష్మీభాయి సమాఖ్య ఆర్పీ లత రూ.కోటి వరకు కాజేశారు. ఈ సొమ్ము వస్తుందో రాదో తెలియని పరిస్థితి. 26 సంఘాలకు చెందిన మూడువేల మంది మహిళలు బాధితులుగా మిగిలారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. సంఘాల్లో జరిగే మోసాలు వాటంతటవే బయటపడితే తప్ప అధికారులు పట్టించుకోరు. రూ.కోట్లలో అక్రమాలు జరిగినా మెప్మా సిబ్బంది, అధికారుల పంచాయితీతో సమసిపోతుందే తప్ప కనీసం ఒక్క పోలీస్ కేసు



నమోదుకావడం లేదు. పోలీస్ కేసులు నమోదు కాకపోవడం, ప్రైవేటు ఆడిట్ బృందాలచే ఆడిట్ చేయించడం, ఆర్పీలను లాగిన్ లేకుండా కొనసాగించడం వెనుక ఉన్నతస్థాయి సిబ్బంది హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా ఏకంగా 13 మంది ఆర్పీలు లాగిన్‌లు తొలగించినప్పటికీ అనధికారింగా కొనసాగుతున్నారు. సంఘాలపై పెత్తనం కొనసాగిస్తున్నారు.

**వీడని వైకాపా వాసనలు**

సభలు, సమావేశాలు, వైకాపా నేతల వ్యక్తిగత ప్రచారం, జనసమీకరణ వంటి అంశాలకు గత పాలనలో మెప్మా వేదికైంది. అప్పట్లో కీలకంగా పనిచేసిన సిబ్బందే ఇప్పటికీ మెప్మాను శాసిస్తున్నారు. బదిలీ చేసినా పలుకుబడి ఉపయోగించి ఇక్కడే కొనసాగుతున్నారు.

## వర్గోన్నతే..విధానం పాతదే

భీమవరం : జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య సిబ్బంది కొరత వేధిస్తోంది. 30 నుంచి 100 పడకలకు వర్గోన్నతి పొందిన ఈ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై గత వైకాపా ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది. వ్యాధి నయం కోసం ఆసుపత్రికెళ్తే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. గతంలో సీహెచ్‌లుగా ఉన్న ఆసుపత్రులు ప్రస్తుతం ప్రాంతీయ ఆసుపత్రులుగా వర్గోన్నతి పొందినా పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బంది నియామక టెండరు ప్రక్రియలో మాత్రం సామాజిక ఆసుపత్రులుగా ఉండడంతో పాత విధానాన్నే కొనసాగిస్తున్నామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. టెండరు ఖరారు సమయంలో సరిచేసి ఆసుపత్రి హెూదాకు తగ్గట్టుగా సిబ్బంది నియామకం చేపడతామన్నారు.

**పదకొండు మంది సిబ్బందితో సేవలు..** భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి నిత్యం 350 మంది రోగులు వస్తారు. ప్రాంతీయ ఆసుపత్రుల్లో 22 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది ఉండాలి. ఇక్కడ మాత్రం 11 మందే ఉన్నారు. వారికి కూడా రెండు మూడు నెలలకోసారి వేతనాలు అందుతున్నాయి. ఆసుపత్రి పాత భవనంతోపాటు కొత్తగా నిర్మించిన భవనంలోని గదులను శుభ్రం చేయడం వారికి పని భారమవుతోంది. పాలకొల్లు, నరసాపురంలో కూడా ఇదే పరిస్థితి. **పరిసరాల్లో అపరిశుభ్రత..** ఆసుపత్రుల ప్రాంగణాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వర్షాకాలంలో వివిధ జ్వరాలు, జలుబు, దగ్గు ఇతరత్రా రుగ్మతల రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఆసుపత్రి ప్రాంగణాలు, రోగులుండే వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం ఆసుపత్రికి వచ్చేవారికి శాపంలా మారింది.

# బౌద్ధ చైత్యం.. శిథిలం

కోరుకొండ : జిల్లాల్లోని కాపవరం పాండవుల మెట్ట ఎన్నో బౌద్ధ ఆనవాళ్లకు నిలయంగా ఉంది. ఇక్కడ కొండపై బౌద్ధ సన్యాసులు నివసించిన గదులు, ఆరామాలు, కుండ పెంకులు, సున్నం నూరిన కల్లం, ధ్యాన మందిరాలు, డ్రెయినేజీ వ్యవస్థ, మెట్ల మార్గం వంటివి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతం సరైన నిర్వహణ లేక వెలవెలబోతుంది. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గతంలో ఇక్కడ తవ్వకాలు జరిపారు. బౌద్ధ ఆనవాళ్లకు చిహ్నంగా జీర్ణోద్ధరణ పనులు చేపట్టి పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత కాలంలో నిర్లక్ష్యానికి గురైంది.

**నిర్లక్ష్యంతో వెలవెల..**

పర్యాటక ప్రాంతంగా తీర్చదిద్దాల్సిన ఈ ప్రాంతం గత వైకాపా ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో తీసిన బౌద్ధ ఆనవాళ్ల చరిత్ర కనుమరుగైంది. అయిదేళ్ల కాలంలో ప్రచారానికే తప్ప ఆచరణలోకి రాలేదు. కొండ చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప మెస్ నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశారు. కొండ పైభాగంలో పూలతోటతో గార్డెన్ ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఇప్పుడది లేదు. పైన చేపట్టిన పలు రహదారి నిర్మాణాలు ఇప్పుడు పూర్తిగా పాడైపోయాయి. కొండమెట్లు కూడా



అభివృద్ధికి నోచుకోలేదు. పాండవులు నివసించారని చెప్పుకొనే గుహలకు రక్షణ లేకుండా పోయింది. తాగునీరు, రహదారి, కొండమెట్ల మార్గం, సందర్శకులు వచ్చేందుకు కాపవరం నుంచి కొండకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చొరవ చూపుతోంది.

**పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం..**

బౌద్ధ చరిత్ర కాలగర్భంలో కలిసిపోకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. పురావస్తు శాఖ అధికారులతో మాట్లాడాం. కూటమి ప్రభుత్వ సహకారం, ఎంపీ పురందేశ్వరి ద్వారా కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నాం. ఇలాంటి అరుదైన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి సందర్శకులకు అందించాలన్నదే లక్ష్యం. బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం

# మహిళా ప్రాంగణం.. వెలవెల

తిరుపతి : తిరుపతి– తిరుచానూరు మార్గంలోని మహిళా ప్రాంగణం వెలవెలబోతోంది. గతంలో మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తూ వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించిన ప్రాంగణం సమస్యల కేంద్రంగా మారింది. భవనాలు దెబ్బతినడంతోపాటు ఆవరణం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షం పడినా చుట్టూ నీరుచేరి చెరువును తలపిస్తోంది. ప్రస్తుతం పదిమంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరూ చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో మహిళా ప్రాంగణం నిర్లక్ష్యానికి గురికాగా.. ప్రస్తుతం ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తోంది. ప్రాంగణంలోని భవనాల తాత్కాలిక మరమ్మతులకు రూ.55 లక్షల అవసరం ఉంది. నిధులు మంజూరు చేసి ప్రాంగణానికి పూర్వవైభవం తీసుకొస్తే ఉ



మ్మడి జిల్లాలోని నిరుపేద మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, నిధుల కోసం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసినట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ ఫర్జానా తెలిపారు.

**స్థలం ప్రైవేటు వ్యక్తులకు..**

గత ప్రభుత్వ పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా శిక్షణ కార్యక్రమాలకు పూర్తిగా ముగింపు పలికారు. ప్రాంగణానికి చెందిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. అప్పట్లో దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా ప్రాంగణం అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రాంగణం చుట్టూ అనేక దుకాణాలు వెలిశాయి.

# మీసం మెలేస్తున్న రొయ్య

నిడదవోలు : సిరుల పంటగా పేరొందిన రొయ్యల సాగు చేపట్టిన రైతులు గత కొంతకాలంగా అనేక ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. గతంలో అమెరికా ఆంక్షలతో ధర పడిపోయింది. అనంతరం నిబంధనల సడలింపుతో కొద్దికొద్దిగా ధర పెరిగింది. అయినా రైతులకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర దక్కలేదు. ఇటీవల ప్రతికూల పరిస్థితి కారణంగా అప్పటికప్పుడు పట్టుబడి పట్టి వచ్చిన ధరకు విక్రయిస్తున్నారు. గత నెలలో రూ. 220 పలికిన వంద కౌంట్ ధర ప్రస్తుతం రూ.260కు చేరింది. 90 కౌంట్ గతేడాది డిసెంబరు 21న రూ.270



ఉంటే, గత నెల రూ.220, ప్రస్తుతం రూ.260కు చేరింది. 40 కౌంట్ ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.345 వరకు పలికింది. ప్రస్తుతం చాలా చోట్ల పంట లేదు. ఇప్పుడిప్పుడే రైతులు పంట ప్రారంభంలో ఉన్నారు. ఇది చేతికి రావడానికి మూడు నెలల సమయం పడుతుంది. ప్రస్తుతం పంట లేకపోవడంతో ఎగుమతికి యూఏఈ, కువైట్, థాయ్‌లాండ్, సౌదీ, చైనా దేశాలకు చిన్నకౌంట్లకు ఆర్డర్లు రావడంతో ధర పెరుగుతోంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.ప్రస్తుతం జిల్లాలో 15 శాతం చెరువుల్లో మాత్రం పంట ఉంది. 85 శాతం చెరువుల్లో చాలా మంది రైతులు ఇప్పుడిప్పుడే పంట వేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట ఉంది

# స్కిట్ విలీనంలో మెలిక..!




శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) విలీనంపై అనంతపురం జేఎన్‌టీయూ తాజాగా రాష్ట్ర దేవాదాయ శాఖకు షరతులు పెట్టడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 4న కళాశాల తెరుచుకోనున్నట్లు ఇప్పటికే పాలకులు, ఆలయ అధికారులు స్పష్టం చేశారు. తాజాగా పెట్టిన షరతుల నేపథ్యంలో కళాశాల ప్రారంభంపై సందిగ్ధం నెలకొంది.

**కూటమి ప్రభుత్వం ఉదారత**

వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు స్కిట్ పురోభివృద్ధిని గాలికి వదలిపెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కళాశాలకు జీవం పోయాలని, విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సంకల్పించింది. అయితే కళాశాల నిర్వహణకు ముక్కంటి ఆలయ నిధులు అవసరం లేదంటూ మంత్రి లోకేశ్ స్పష్టం చేయడంపై ఆనందం వ్యక్తమైంది. జేఎన్‌టీయూకు అనుసంధానించి మూడేళ్ల వ్యవధిలో కళాశాల అభివృద్ధి, నిర్వహణకు రూ.120 కోట్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆగస్టు 4న కళాశాలను పునఃప్రారంభం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివెరిసింది.

**ఇవీ షరతులు..**

జేఎన్‌టీయూ దేవాదాయ శాఖ కమిషనర్ ఎదుట నాలుగు షరతులు ఉంచింది. వీటిపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

విలీన ప్రక్రియ పూర్తయ్యాక ఆస్తుల వాపస్ చేయడంపై ఎలాంటి నిబంధనలు ఉంచకూడదు.

కళాశాలకు స్థలం అప్పగింత విషయమై 33 ఏళ్ల లీజు చాలా నామమాత్రంగా ఉండాలి. ఎకరాకు 99 పైసలు మించకూడదు. భవిష్యత్తులో పెంచకూడదు.

ఇక్కడున్న భవనాలకు జేఎన్‌టీయూ అద్దెలు చెల్లించదు.

జేఎన్‌టీయూ చట్టం (2008 చట్టం సంఖ్య 30) ప్రకారం ప్రస్తుతం ఉన్న బోధనా సిబ్బందిని తీసుకోరు.

విద్యా, బోధనేతర సిబ్బందిని దేవాదాయ శాఖ మాత్రమే చూసుకోవాలి. అవసరమైతే విద్యా సిబ్బందిని స్కిట్‌కు అద్దె ప్రాతిపదికన ఇవ్వొచ్చు. మిగిలిన 90 మంది బోధనేతర సిబ్బందిని పొరుగు సేవకులుగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

# కూలేదాకా.. పట్టించుకోరా..!




రాజమహేంద్రవరం : రెండు రోజుల కిందట వర్షాలకు నల్లమందు సందులో బంగారం దుకాణం పైకప్పు కూలిపోయింది. పాత భవనం కావడంతో వర్షాలకు నాని పోయింది. ఆ సమయంలో భవనం కింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.గత ఏడాది వంకాయల వారి వీధిలో రెండంతస్తుల భవనం కుప్పకూలింది. ఇంట్లో ఉన్న వారంతా బయటకు పరుగు తీయడంతో ప్రమాదం తప్పింది. పప్పుల వీధి, రంధి వారి వీధిలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయి.నాలుగేళ్ల కిందట పాత భవనం కూలిన సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలో పురాతన భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిలో కొన్ని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో వర్షాలకు పాత భవనాలు నేలమట్టం అయ్యే ప్రమాదం ఉంది. పాత భవన యజమానులకు నోటీసులిచ్చి, నేలమట్టం చేయాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉన్నా.. యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కేవలం నోటీసులు జారీ చేసి మమ అనిపిస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, నల్లమందు సందు, గంటాలమ్మగుడి వీధి, గోదావరి గట్టు దిగువన తాడితోట, దానవాయిపేట, ప్రకాశంనగర్ వంటి ప్రాంతాల్లో ఈ తరహా భవనాలు అధికంగా ఉన్నాయి.

**నామమాత్రపు మరమ్మతులతో సరి**

మెయిన్ రోడ్డు చుట్టుపక్కల కి.మీ దూరం వరకూ సుమారు వెయ్యికి పైగా దుకాణాలు ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాలకు ప్రధాన వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరం నిత్యం రద్దీగా ఉంటుంది. రోజుకు రూ.13 కోట్ల వరకు బంగారం అమ్మకాలు జరుగుతుంటాయి. వస్త్రాలు, ఇతర వాణిజ్య దుకాణాలు కలిపి మరో రూ 15 కోట్ల వరకూ వ్యాపారం ఉంటుంది. ముంబయి, గుజరాత్‌కు చెందిన వ్యాపారులు ఇక్కడే స్థిరపడిపోయారు. అప్పట్లో అద్దెకు తీసుకున్న భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా వ్యాపార కార్యకలాపాల నిమిత్తం ఖాళీ చేసేందుకు ఇష్టపడటం లేదు. భవన యజమానులు కూడా అద్దె వస్తుందనే భావనతో చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఎక్కడైనా భవనాలకు పగుళ్లు వస్తుంటే చిన్న చిన్న మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. దీంతో అవి ప్రమాదకరంగా మారుతున్నాయి.

**ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా..**

నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో 240 గృహాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. వాటిలో 160కి పైగా నోటీసులు జారీ చేశారు. మిగిలిన వాటిలో యజమానులు ఇతర దేశాల్లో ఉండటంతో మిన్నకుండిపోయారు. రెండేళ్ల కిందట ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 13 భవనాలు ఖాళీ చేయించారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో మళ్లీ వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇరుకు రోడ్లు ఉంటాయి. ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. కనీసం రోడ్డు ఆక్రమణలు కూడా తొలగించలేకపోతున్నారు.

# నరసింహా.. నీ భూముల సర్వే మాయేనా?



అంతర్వేది : నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా వర్ధిల్లుతున్న అంతర్వేది లక్ష్మీనర సింహస్వామి ఆలయ భూముల సర్వే మరుగున పడటంతో భక్తజనం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్వామివారికి ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 890 ఎకరాల భూమి ఉంది. వీటి నుంచి వచ్చే లీజులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటిని సవరించడానికి ఇటీవల ప్రారంభించిన సర్వే ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

**అంతంతమాత్రంగానే లీజు**

స్వామివారికి సఖినేటిపల్లి మండలం అంతర్వేది, కేశవదాసుపాలెం, గొంది, శృంగవరప్పాడులోనే సుమారు 600 ఎకరాల పైనే ఉన్నాయి. వీటినుంచి లీజు ఎకరాకు రూ.200 నుంచి రూ.2000, నాలుగు నుంచి ఆరు బస్తాల ధాన్యం మాత్రమే ఉంది. ఇవన్నీ గత 40 ఏళ్ల కిందట నిర్ణయించినవి కావడంతో వాటిని పెంచాలని, పాత బకాయిలు(సుమారు రూ.2 కోట్లు) వసూలు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతో దేవాదాయశాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

**అధికారులు ఆదేశించినా..**

నాలుగు నెలల కిందట ఆర్డీవో మాధవి, దేవాదాయశాఖ అధికారులు దేవస్థానం కౌలు రైతులకు తెలియజేసి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఎవరూ హాజరు కాలేదు. కొందరు మాత్రం ప్రత్యేకంగా ఆర్డీవో, అప్పటి ఆలయ ఏసీ సత్యనారాయణను కలిసి లీజులు పెంచొద్దని కోరారు. దీనికి వారు అంగీకరించకపోవడంతో భూముల పరిస్థితిని చూసి నిర్ణయం తీసుకోవాలని వేడుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో రెవెన్యూ, దేవాదాయ, వ్యవసాయ, మత్స్య, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో కలిపి బృందాలుగా ఏర్పాటు చేసి భూమి ఏ సాగులో ఉంది? ఏ కౌలు రైతుకు ఎంత లీజుకిచ్చారు? ఆ వివరాలు దేవస్థానం రికార్డుల్లో ఉన్నాయా లేదా.. తదితర విషయాలపై సర్వే చేసి వివరాలను రెండు నెలల్లో ఇవ్వాలని ఆదేశించారు.

**నెలలు గడుస్తున్నా..**

నెలలు గడుస్తున్నా ఈ సర్వే ఏ స్థితిలో ఉందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సమగ్రంగా సర్వేచేసి లీజులు పెంచాలని, పాత బకాయిలు వసూలు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**బకాయిలు వసూలు చేస్తాం**

ఆలయ భూముల సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నాను. ఇటీవల ఆర్డీవో వద్దకు వెళ్లి త్వరగా చేయించాలని కోరాను. పాత బకాయిలు కూడా వసూలు చేస్తాం. చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటాం. వరప్రసాద్, ఏసీ, అంతర్వేది దేవస్థానం

# అవగాహనతో ఆపద దూరం

అమలాపురం : కడలి కెరటాలపై ప్రాణాలకు తెగించి సంద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు తుపాన్ల సమయంలో అప్రమత్తంగా లేకుంటే ముప్పు తప్పదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం సముద్రంపై అల్పపీడన ద్రోణి ప్రభావం ఉండటంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**సాంకేతికత వినియోగించుకుని..**

సముద్రంలో విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో ఎలా అప్రమత్తం కావాలనే అంశాంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. వీటిని ముందుగానే పసిగట్టి సురక్షితంగా తీరానికి ఎలా చేరుకోవాలనే అంశాలను వివరిస్తున్నారు. ఇందులో భాగంగా మెకనైజ్డ్ బోట్లకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం వెసులుబాటు ఉన్న ట్రాన్స్‌ఫాండర్లను అమరుస్తున్నారు. దీని ద్వారా సముద్రంలో బోటు ఎక్కడ ఉందో అక్షాంశాలు, రేఖాంశాలతో సహా తెలుస్తుంది. ఆపదలో కోస్టు గార్డు సిబ్బంది నుంచి సాయం పొందవచ్చు.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో అంతర్వేది, అల్లవరం మండలం ఓడలరేవు, కాట్రేనికోన, బైరవపాలెం, తీరాల నుంచి సుమారు 2వేల బోట్లు సముద్రంలోకి వేటకు వెళ్తున్నాయి. వీటిపై మత్స్యకారులు సుమారు 10 నుంచి 15 రోజుల పాటు సముద్రంలోనే ఉంటారు. తుపాను సమయంలో వీచే గాలులకు బోట్లు తట్టుకోలేవు. కొన్ని సుదూర ప్రాంతాలకు కొట్టుకుపోతుంటాయి. మరికొన్ని ప్రమాదాలకు గురవుతుంటాయి. సాధారణంగా మే– అక్టోబరు నెలల మధ్య తుపాన్లు వస్తుంటాయి. వాతావరణ



సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసు కోవడం ద్వారా ఆపద నుంచి తప్పించుకోవచ్చు.

**వివరాల నమోదు..**

వేటకు వెళ్లే వారు తమ వివరాలను సంబంధిత మత్స్యశాఖ అధికారులు, సచివాలయాల్లో సాగర మిత్రల వద్ద విధిగా నమోదు చేసుకోవాలి. ఏ దిశవైపు వెళ్తున్నారు..? తీరం నుంచి ఎంత దూరంలో వేట సాగించనున్నారు..? చరవాణి నంబర్లు వంటి వివరాలు సిబ్బంది సేకరిస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం..**

మత్స్యకారుల రక్షణ చర్యలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి మెకనైజ్డ్ బోటుకు జీపీఎస్ సాంకేతికత ఉన్న ట్రాన్స్‌ఫాండర్లను అమరుస్తున్నాం. ఈ పరికరం వాతావరణ మార్పులపై మత్స్యకారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంది. దీనిని నిరంతరం ఆన్‌లో ఉంచుకోవడం ద్వారా ఆపద సమయంలో తక్షణ సహాయం అందించే వీలు కలుగుతుంది.పీవీ శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలో వివరాలు

తీరం విస్తీర్ణం: 94 కి.మీ.

వేట సాగించే బోట్లు: 1,945

మత్స్యకారులు: 11,352

ల్యాండింగ్ సెంటర్లు: 07

# అవినీతి స్తంభాలాట


నంద్యాల : విద్యుత్తు స్తంభాలు గుత్తేదారులకు కాసులు కురిపిస్తుండగా విద్యుత్తు శాఖకు రూ.కోట్ల నష్టం తెచ్చిపెడుతున్నాయి. నాణ్యత లేకపోవడంతో చిన్నపాటి గాలికే కుప్పకూలుతున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 3,201, నంద్యాలలో 5,232 స్తంభాలు కూలిపోయాయి. గత మూడు నెలల కాలంలో నంద్యాల జిల్లాలో రూ.1.56 కోట్లు, కర్నూలులో రూ.96 లక్షల నష్టం వాటిల్లింది. హెచ్‌టీ స్తంభాలతో రూ.10 లక్షలు, తీగలతో రూ.50 లక్షల వరకు నష్టం వచ్చింది.

**నాటడం గాలిలో దీపం**

స్తంభం కిందిభాగంలో ఐదడుగుల స్థానంలో ఒక గీత ఉంటుంది.. అక్కడివరకు స్తంభాన్ని భూమిలో పాతి రాళ్లు, కంకర, ఇసుక, సిమెంటు వేయాల్సి ఉంటుంది. ఐదు అడుగుల మేర గుంత తీయాలి. కానీ నాసిరకం విద్యుత్తు స్తంభాలు వాడటంతో పాటు నిబంధనల మేరకు కంకర, రాళ్లు వేయకుండా కేవలం మట్టి వేసి పూడ్చేస్తున్నారు. భూమి పైభాగంలో స్తంభం చుట్టూ 1.5 అడుగుల మేర సిమెంట్ దిమ్మె నిర్మించాలి. ఇవేవీ పాటించకపోవడంతో కొద్ది నెలలకే ఒరిగిపోతున్నాయి.

**అదనపు భారం**

సాధారణంగా విద్యుత్తు స్తంభం గంటకు 20 కి.మీ వేగంతో వీచే గాలులకే తట్టుకోగలదు. సాధారణంగా ఎల్‌టీ కనెక్షన్లకు 8 మీటర్ల పొడవైన స్తంభాలు వాడతారు. దీని ధర రూ.3 వేలు. రెండో రకం



9.1 మీటర్ల పొడవు ఉండగా.. పట్టణ ప్రాంతాల్లోనే వినియోగిస్తున్నారు. మూడో రకం 11 మీటర్ల పొడవు ఉండగా.. ధర రూ.9 వేలు. 90 శాతం స్తంభాలు 8 మీటర్ల పొడవువే వాడుతున్నారు. 4 మీటర్లకు బదులు 3 మీటర్ల లోతులోనే స్తంభాన్ని పాతుతున్నారు. దీంతో చిన్నపాటి గాలులకే నేలకూలుతున్నాయి. విద్యుత్తు స్తంభం కూలితే తీగలు, కాసారాలు దెబ్బతింటాయి. వాటికి మరో రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చవుతుంది.

**నాణ్యత నాసి**

విద్యుత్తు శాఖ అవసరాల నిమిత్తం స్థానికంగా తయారీ దారుల నుంచి స్తంభాలు కొనుగోలు చేస్తుంది. తయారీదారులు ఒకరిద్దరే ఉండటం.. అధికారులు ఏటా వారినే ఆశ్రయిస్తుండటం కలిసి వస్తోంది. దీన్ని తయారీదారులు ఆసరా చేసుకొని నాణ్యత లేనివి కట్టబెడుతున్నారు. నిబంధనల ప్రకారం ఒక స్తంభం కాలపరిమితి 15 ఏళ్లకుపైగా ఉండాలి.. 24 అడుగుల పొడవుతోపాటు 140 కిలోల బరువు ఉండాలి.. ఇందులో ఏ ఒక్క నిబంధన పాటించడం లేదు. కంకర, సిమెంట్ మిశ్రమాన్ని సరిగా వేయడం లేదు. సరిగా క్యూరింగ్ కూడా చేయడం లేదు. స్తంభం లోపల ఇనుపకడ్డీలు 5–6 ఎంఎం మధ్యలో ఉండాలి.. కానీ 4 ఎంఎం వాడుతున్నారు.


# వైకాపా కొలత.. పన్ను ఎగవేత

చిత్తూరు : వైకాపా పాలనలో ఆస్తి పన్ను విధింపులో అక్రమాల గుట్టు రట్టువుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల్లో ఇంటింటా చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లాలో 1,995 ఇళ్లకు అసలు పన్నే మదింపు చేయలేదని తేలింది. మరికొన్ని నిర్మాణాలకు తక్కువ కొలతలు చూపించి ఆస్తి మదింపు చేసేశారు. వైకాపా ప్రభుత్వంలో కొత్తగా నిర్మించిన భవనాలకు, ఇళ్లల్లో 50 శాతానికి పైగా పన్ను పరిధిలోకి రాకుండా ఆ పార్టీకి చెందిన నేతలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అడ్డుకున్నారు. వీరు నగర, పురపాలక అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి వాటివైపు వెళ్లకుండా చేశారు. వాటిపై పన్ను విధించేందుకు అధికారులు సాహసించలేదు.

**కోకొల్లలుగా లోపాలు**

అదనపు అంతస్తులు, ఇళ్లు, వాణిజ్య కేటగిరి పరిధిలోకి వచ్చే దుకాణాలకు పన్ను మదింపు తక్కువ విధించినట్లు గుర్తించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఇళ్ల యజమానులతో కుమ్మక్కై చేతివాటం చూపించినట్లు తెలుస్తోంది. సిబ్బందితోపాటు, అధికారులకు ముడుపులు అందినట్లు ఆరోపణలున్నాయి.

**కమిషనర్లకు నోటీసులు?**



ఆస్తి పన్ను మదింపునకు లక్ష్యాలు నిర్దేశించారు. తాజాగా కొత్త అసెస్‌మెంటు నంబర్లు కేటాయించి పన్ను విధిస్తున్నారు. దాంతో పురపాలక సంఘాల్లో రూ.లక్షల్లో ఆదాయం పెరుగుతోంది. ఈ విషయంలో ఇప్పటి వరకు అక్రమాలు గుర్తించని పలువురు కమిషనర్లకు నోటీసులు ఇచ్చేందుకు ప్రభుత్వం పరిశీలనలో ఉంది.

తిరుపతి నగరపాలక సంస్థకు రూ.18,25,36,965 ఆస్తిపన్ను పెంచాలని(కొత్త నిర్మాణాలతోపాటు, కొలతలు తక్కువగా చూపిన వాటిని గుర్తించి) లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు రూ.1,41,82,342 మాత్రమే చేసి, 7.77 శాతం సాధించారు. చిత్తూరుకు రూ.5,01,57,562 లక్ష్యంగా కాగా ఇక్కడ రూ.52,08,506 విధించి, 10.38 శాతం సాధించారు.

# యూరియా.. ఏదయా?

చిత్తూరు : జిల్లా వ్యవసాయ శాఖలో పాలన గాడి తప్పుతోంది. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు కావస్తున్నా యూరియా కొరత రైతాంగాన్ని పట్టిపీడిస్తోంది. వ్యవసాయ శాఖ పర్యవేక్షణ, సరైన ప్రణాళికలు లేకపోవడమే కారణమని రైతులు, ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు. సాగైన విస్తీర్ణాన్ని బట్టి యూరియా కొరత తలెత్తకూడదు. పశుగ్రాసం సాగుకు యూరియా అధికంగా వేస్తుండటంతోనే కొరత తలెత్తుతోందని వ్యవసాయ శాఖ చేతులు దులుపుకొంటోంది. వ్యాపారులు రైతులను పీడిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**వ్యవసాయ శాఖలో గాడితప్పిన పాలన**

ఏ మండలంలో పంట సాగెంత..? ఎంత యూరియా అవసరం? నెల వారీ కేటాయింపులెంత? రానున్న నెలకు ఎంత అవసరం, తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాల్సిన జిల్లా వ్యవసాయ శాఖకు సరైన ప్రణాళికలే లేవు. పశుగ్రాసానికి ఇచ్చేది లేదు, పంటల సాగే లేదంటూ కొర్రీలు వేస్తూ కేటాయించకపోవడంతో 10-15 మండలాల్లో ఒక బస్తా కూడా లేదు. కొందరు ఏవోలు సరఫరాకు ప్రతిపాదనలు పంపినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు.

చిత్తూరులో కేవలం 1-2 దుకాణాల్లో యజమాని ఇచ్చినప్పుడు వెళ్లి తీసుకుంటేనే యూరియా. అదీ బస్తాపై రూ.40-50 అధిక ధర ఇవ్వాల్సిందే. జిల్లా కేంద్రంలోనే ఇలా సాగుతుంటే.. జిల్లా వ్యాప్తంగా పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కొందరు అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.మార్క్‌ఫెడ్‌లో సుమారు 2 వేల టన్నులు నిల్వ ఉ



ంది. జిల్లాలో 280 రైతుసేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) ఉండగా.. కేవలం 10-20 ఆర్ఎస్‌కేలలో కూడా యూరియా లేదు. ఇక సహకార పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల్లో నిల్వలు లేవు.

**వ్యాపారుల చెలగాటం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 కిలోల యూరియా బస్తా ధర రూ.266.50. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని.. కొందరు ఎరువుల దుకాణాదారులు కృత్రిమ కొరత సృష్టించి.. అధిక ధరలకు విక్రయిస్తూ కర్షకులను దోపిడీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

**గుళికలు తీసుకుంటేనే ఇస్తారట..**

గుళికల మందు ప్యాకెట్ తీసుకుంటేనే యూరియా బస్తా.. ప్యాకెట్ వద్దంటే యూరియా లేదంటూ సోమవారం చిత్తూరు పాత బస్టాండు వద్ద ఓ ఎరువుల దుకాణంలో రైతులకు ఎదురైన చేదు అనుభవం. కిలో గుళికల మందు ప్యాకెట్, యూరియా బస్తా కలిపి రూ.420 విక్రయిస్తున్నారు. అదీ నగదు రూపేణా చెల్లిస్తేనే. డిజిటల్(ఆన్‌లైన్) విధానంలో నగదు చెల్లిస్తామంటే యూరియా ఇచ్చేదిలేదని కచ్చితంగా తెగేసి చెబుతున్నారు.

**రైతులందరికీ అందజేస్తున్నాం**

పంటలు సాగు చేసిన రైతులందరికీ యూరియా అందజేస్తున్నాం. సాగు విస్తీర్ణం ప్రకారం మండలాలకు సరఫరా చేస్తున్నాం. యూరియా దొరకని వారు మండల వ్యవసాయాధికారులను సంప్రదిస్తే సమస్య పరిష్కరిస్తారు.

– మురళీకృష్ణ, జేడీఏ

జిల్లాలో ఖరీఫ్ సాగు వివరాలు (హెక్టార్లలో..)

సాధారణ సాగు: 71,305

సాగైంది: 6,432

వేరుశనగ: 1,479

వరి: 821

# రాబడి ఇవ్వని మార్కెట్ యార్డులు



గుంతకల్లు : వ్యవసాయ మార్కెట్ యార్డుల నుంచి ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఫలితంగా యార్డుల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి అక్కడి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. గుంతకల్లు యార్డులో రైతులను ఆదుకోవడానికి రూ.50 లక్షలతో నిర్మించిన రైతు బజార్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇక్కడ పెద్దసంఖ్యలో వ్యవసాయ గోదాములు, దుకాణాలు ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం, పలు ఉత్పత్తులపై మార్కెట్ సెస్సును తొలగించడంతో యార్డుల పరిస్థితి అయోమయంగా మారుతోంది. రైతులు మాత్రం దళారులు, వ్యాపారుల చేతుల్లో మోసపోతున్నారు.

**మూడో గ్రేడ్‌కు పడిపోయిందిలా..**

గతంలో గుంతకల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు జిల్లా యార్డుగా ఉండేది. తరువాత ప్రభుత్వం జిల్లాలో 13 యార్డులను ఏర్పాటు చేసింది. గుంతకల్లు యార్డులో భాగంగా ఉన్న గుత్తి యార్డును 1995లో వేరు చేశారు. ప్రథమ శ్రేణిలో ఉన్న యార్డు ఈరోజు మూడో గ్రేడ్‌కు దిగజారింది. ప్రస్తుతం యార్డుల్లో క్రయవిక్రయాలు జరగడం లేదు. ఈనెల 27న బాధ్యతలు చేపట్టనున్న కొత్త పాలకవర్గమైనా యార్డులో క్రయవిక్రయాలు ప్రారంభించడానికి, రైతు బజార్‌ను రైతులు వినియోగించుకునే విధంగా చూడటానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. గుత్తిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోనూ క్రయవిక్రయాలు జరగడం లేదు. రైతు బజార్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేసినా.. తరువాత పనులు చేపట్టలేదు.

**క్రయవిక్రయాలు కొనసాగిస్తాం**

– బాలాజీ, యార్డు కార్యదర్శి

గుంతకల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు జరిగే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటాం. రైతు బజార్‌ను వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తాం. రైతులు పండించే కూరగాయలను రైతు బజార్‌కు తీసుకొస్తే ఉచితంగా గదులను కేటాయిస్తాం.

# పైపులు మురుగులో.. గరళం గొంతులో!



అనంతపురం : అనంత నగరంలోని పాతూరు, రాణినగర్, వినాయక్‌నగర్, ఎస్‌కేడీనగర్, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల రంగు మారిన నీరు సరఫరా అయింది. పాతూరు, బోయవీధి, గౌసుల వారవీధి, ఉమానగర్, బ్రాహ్మణవీధి, గాంధీబజార్, మటన్ మార్కెట్ ప్రాంతాలకు 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్ల ద్వారానే నీరు అందిస్తున్నారు. కొన్నిచోట్ల డ్రైనేజీలో పైపులైన్ ఉంది.

తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్, నందలపాడు, చేనేత కాలనీ, ఓంశాంతి నగర్‌లో తరచూ కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలోని డ్రైనేజీని పెన్నానదిలోకి వదులుతున్నారు. రాయదుర్గంలోని 28వ వార్డులో డ్రైనేజీలో ఏర్పాటు చేసిన పైపులు తరచూ లీకవుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వంలో రూ.14 లక్షలతో పనులు చేపట్టి కొంత పూర్తిచేశారు. గత వైకాపా పాలనలో పట్టించుకోలేదు. గుంతకల్లు 11 వార్డు తిలక్‌నగర్‌లో ఈనెల 6న కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. కొన్నిరోజులుగా తాగునీరు రంగు మారి.. పురుగులు వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. అనంత నగరపాలక సంస్థతో ఇతర పురపాలికల్లో తరచూ రంగు మారిన నీరు సరఫరా అవుతున్నాయి. దశాబ్దాల నాటి పైపులైన్లు కావడంతో ఎప్పుడికక్కడ లీకవుతున్నాయి. అందులోనూ చాలా వరకు డ్రైనేజీలో ఏర్పాటు చేయడంతో లీకయిన ప్రతిసారీ నీరు కలుషితమవుతోంది. కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నా నిధుల సమస్యతో ముందుకు సాగడం లేదు.

తుప్పుపట్టిన పైపులైన్లు

ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో 1,64,000 లక్షల కుళాయిల ద్వారా నిత్యం 10 కోట్ల లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. అనంతపురం మినహా మిగతా పట్టణాల్లో పైపులైన్లకు కాలం చెల్లింది. చాలాచోట్ల తుప్పుపట్టాయి. లీకేజీ సమయంలో మురుగు, హానికర క్రిములతో పాటు సీసం వంటివి తాగునీటిలో కలిసే అవకాశం ఉంది. దీనివల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

**సక్రమంగా శుభ్రం చేయక..**

నిబంధనల ప్రకారం ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలి. ఉదయం, సాయంత్రం ట్యాంకులో బ్లీచింగ్ ద్రావణాన్ని కలిపిన తర్వాత నీటిని సరఫరా చేయాలి. నెల రోజులకు ఒకసారి పూర్తిగా శుభ్రం చేయాలి. వర్షపు నీరు చేరకుండా ట్యాంకు, సంప్‌వెల్‌పై మూతలు పెట్టాలి. వాల్వ్‌పిట్స్ వద్ద నీరు, చెత్తచెదారం లేకుండా చూడాలి. అనంతపురం మినహా ఇతర పురపాలికల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను సక్రమంగా శుభ్రం చేయడం లేదు.

# సారూ.. భోజనం పెట్టించరూ!



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతీయ, సామాజిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు భోజనం అందడం లేదు. గత వైకాపా పాలనలో భోజన వసతి కల్పించని పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్‌లుగా చేరిన వారికి ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో ఇప్పటికీ రోగులకు ఇవ్వకపోవడంతో ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనాలను హోటళ్లలో సొంత డబ్బుతో కొనుగోలు చేసి తింటున్నారు.

**వందలాది మంది..**

అనంతపురంలోని సీడీ ఆసుపత్రిలో 60 పడకలు, గుంతకల్లు, తాడిపత్రి, ధర్మవరం ప్రాంతీయ వైద్యశాలల్లో వంద చొప్పున పడకలు ఉన్నాయి. సామాజిక వైద్యశాలలకు సంబంధించి కళ్యాణదుర్గం, గుత్తి, ఉరవకొండలో 50 చొప్పున పడకలు.. తనకల్లు, కొత్తచెరువు, గోరంట్ల, నల్లమాడ, శింగనమల, పామిడి, కణేకల్లు, సి.కె.పల్లి ఆసుపత్రుల్లో 30 పడకల చొప్పున ఉన్నాయి. వీటి పరిధిలో రోజుకు సగటున 800 మంది వరకు ఇన్‌పేషెంట్‌లుగా చికిత్స పొందుతున్నారు. కదిరి, మడకశిర, రాయదుర్గం, పెనుకొండ, హిందూపురం, రొళ్ల ఆసుపత్రులకు సంబంధించి గుత్తేదారులకు టెండర్ గడువు పూర్తయినా సరఫరా చేస్తున్నారు.

**టెండర్లు పిలిచినా..**

ఈఏడాది మే 25న, జూన్ 11న అధికారులు టెండర్లు పిలిచారు. మొదటిసారి 19 మంది, రెండోసారి 37 మంది గుత్తేదారులు పాల్గొన్నారు. వారికి నిబంధనల మేరకు అర్హత లేకపోవటంతో ఎంపిక చేయలేదు. గతంలో సరఫరా చేసిన అనుభవం, టర్నోవర్ తదితర అంశాలు టెండర్‌లో ఉన్నాయి. దీంతో ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది.

**త్వరలోనే ఎంపిక చేస్తాం..** – డాక్టర్ పాల్‌రవికుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, భోజనం సరఫరా చేసేందుకు ముందుకు వస్తే బాధ్యతలు అప్పగించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించాం. ప్రభుత్వం ఒక్కో రోగికి అల్పాహారం, భోజనం సమకూర్చినందుకు రోజుకు రూ.80, వైద్యుడికి రూ.100 చొప్పున చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

# కడుపు కోత.. కాసుల మోత

అనకాపల్లి : ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్తే ఏదో ఒక కారణం చెప్పి సిజేరియన్లు చేస్తున్నారు. జిల్లాలో రెండేళ్ల గణాంకాలను పరిశీలిస్తే సగానికి పైగా శస్త్రచికిత్స చేసిన ప్రసవాలే ఉన్నాయి. అరికట్టేందుకు చర్యలు చేపట్టాల్సిన ఉన్నతాధికారులూ సమీక్షలతో సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. గర్భిణులకు ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, నియంత్రించలేనంతగా మూర్ఛ వచ్చినప్పుడు, కడుపులో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, బిడ్డకు గుండె సమస్య, తల్లీబిడ్డ ప్రాణాలకు ప్రమాదం ఉన్న సందర్భాల్లోనే శస్త్రచికిత్సలు చేయాలి. అవసరమున్నా, లేకున్నా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు శస్త్రచికిత్సలు చేస్తూ రూ.వేలల్లో బిల్లు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ కొందరు వైద్యులు సిజేరియన్లకే మొగ్గు చూపుతున్నారు. సాధారణ ప్రసవమే జరుగుతుందని అప్పటివరకు చెప్పిన వైద్యులు.. ఒక్కసారిగా శస్త్రచికిత్స చేయాలని చెబుతుండటంతో గర్భిణి కుటుంబ సభ్యులు ఏం చేయాలో పాలుపోక సిజేరియన్లకు అంగీకరిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్‌తోపాటు వార్డులో ఉంచి తల్లీబిడ్డను ఇంటికి పంపేందుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆపరేషన్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలు అవుతోంది. ఇలా వసూలు చేసే అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గైనకాలజిస్టు ఒకరు సస్పెండ్ అయ్యారు. ఇటీవల కాలంలో విశాఖ మానసిక వైద్యశాల నుంచి వైద్యురాలిని



డీఎంహెచ్‌వోగా నియమించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాలపై సమీక్షలు నిర్వహిస్తూ ఎందుకు సిజేరియన్లు చేయాల్సి వచ్చిందో వైద్యుల నుంచి వివరణతో కూడిన నివేదిక తీసుకోవాలి. ఇదేమీ జరగడం లేదు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు 3,995 ప్రసవాలు జరిగాయి. వీటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2,870 ప్రసవాల్లో 1,075 సిజేరియన్లు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,123 ప్రసవాలు జరగ్గా 803 శస్త్రచికిత్స చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో గర్భిణులకు జరిగే శస్త్రచికిత్సలపై ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలి. అనకాపల్లి జిల్లా ఆవిర్భావం తర్వాత డీఎంహెచ్‌వోగా నియమించిన వ్యక్తి కొంతకాలం పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో క్షయ నివారణ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈయన చాలాకాలం ఇన్‌ఛార్జిగానే కొనసాగారు. అనంతరం గజపతినగరం నుంచి వైద్యుడిని డీఎంహెచ్‌వోగా నియమించారు. ఆయన బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేదు. దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోవడంతో జిల్లా క్షయనివారణ అధికారికే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

**తనిఖీలు చేస్తాం**

అవసరం లేకుండా సిజేరియన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వారిపై దృష్టిసారిస్తాం. అత్యవసరం అయితే తప్ప శస్త్రచికిత్సకు వెళ్లొద్దు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి.

డాక్టర్ హైమావతి, డీఎంహెచ్‌వో, అనకాపల్లి

# విచారణకు ఏడాదైనా సరిపోదా..!

అనకాపల్లి: గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు.. అధికారులు దూకుడు పెంచేవారు. పొక్లెయిన్లు తీసుకుకెళ్లి మరీ నిర్మాణాలను నేలమట్టం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఫిర్యాదులు చేసినా అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత ప్రభుత్వంలో సంచలనంగా మారిన విస్సన్నపేట భూముల వ్యవహారంపై విచారణ చేపట్టి ఏడాది దాటినా.. నేటికీ వివరాలు బయటకు వెల్లడించకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల్లో నాటి దూకుడు.. ఇప్పుడు ఏమైందని గట్టిగా ప్రశ్నిస్తున్నారు.

నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆయన ప్రధాన అనుచరుడు బొడ్డేడ ప్రసాద్ కనుసన్నల్లోనే కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేటలో 609 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను ఆక్రమించారు. ఫిర్యాదులు వచ్చాక.. గతంలో ఆర్డీవోతో విచారణ జరిపారు. సుమారు పదెకరాలకుపైగా ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. చర్యలైతే అప్పట్లో తీసుకోలేదు. గత ప్రభుత్వంలో ఈ వ్యవహారంపై జనసేన నాయకుడు దూలం గోపీనాథ్ లోకయుక్తాను ఆశ్రయించారు. అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. విస్సన్నపేట భూములను జనసేన అధినేత సందర్శించారు. అధికారంలోకి వచ్చాక భూముల ఆక్రమణ, వైకాపా నేతల దోపిడీపై




విచారణ చేయిస్తామన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తి స్థాయిలో అక్రమాలు వెలికి తీస్తామని అప్పట్లో నేతలు గట్టిగా చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా చర్యలకు ఉపక్రమించలేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలూ ప్రస్తుతం నోరు మెదపడం లేదు.

గత ప్రభుత్వంలో భూముల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. విస్సన్నపేట లేఅవుట్‌ను మూడు, నాలుగుసార్లు అధికారులు పరిశీలించారు. గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. భూరికార్డులు సక్రమంగా లేకపోవడం, కొండలు కరిగించినా వాటిని ఎక్కడికి, ఎంత పరిమాణంలో తరలించారనే వివరాలు దొరక్కపోవడంతో కాలయాపన జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో విచారణ చేపట్టిన ఆర్డీవో నివేదిక సైతం ఇప్పటివరకు వెలుగుచూడలేదు. ఏడాదిపైగా అవుతున్నా భూఆక్రమణదారులకు నోటీసులూ ఇవ్వలేదు.

# అనసూయ మేడం ఖాళీగా ఏం లేదట..!

జబర్దస్త్ కామెడీ షో తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ముద్దుగుమ్మ అనసూయ. చాలా తక్కువ సమయంలోనే హీరోయిన్స్ రేంజ్‌లో అనసూయకు గుర్తింపు దక్కింది. ఒక యాంకర్‌గా ఎప్పుడూ, ఎవరికీ రాని గుర్తింపును అనసూయ దక్కించుకుంది. జబర్దస్త్ షో లో యాంకరింగ్ చేసినందుకు గాను అనసూయ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కొన్ని సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో అనసూయ చేసిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గానూ ఆఫర్లు దక్కించుకున్న అనసూయ జబర్దస్త్ మానేసిన తర్వాత కాస్త ఆఫర్లు తగ్గాయి అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తూ ఉంటారు. అనసూయ జబర్దస్త్ మానేయడం ద్వారా ఆమె పాపులారిటీ కూడా తగ్గుతూ వచ్చిందని సోషల్ మీడియాలో ప్రముఖంగా చర్చ జరుగుతూ ఉండేది. అనసూయ జబర్దస్త్‌ను వదిలేయడం తప్పే అని చాలా మంది అంటూ ఉంటారు. ఈ ఏడాది పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమాలో ప్రత్యేక పాటలో కనిపించిన అనసూయ మరే సినిమాతోనూ ఈ ఏడాదిలో వచ్చే పరిస్థితి



కనిపించడం లేదు. గత ఏడాది పుష్ప 2 సినిమాలో కనిపించింది. పుష్ప 1 సినిమాలోని పాత్రతో పోల్చితే పుష్ప 2 లో అనసూయ పాత్ర పరిధి తగ్గిందని, అంతే కాకుండా స్క్రీన్ ప్రజెన్స్ చాలా వరకు తగ్గిందని ఆమె అభిమానులు అనుకున్నారు. అయినా కూడా పుష్ప తర్వాత అనసూయ రేంజ్ మరింతగా పెరుగుతుందని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. సుకుమార్ అంతకు ముందు రంగస్థలం సినిమాలో ఈమెకు రంగమ్మత్త పాత్ర ఇవ్వడం ద్వారా ఒక్కసారిగా స్టార్‌ను చేశాడు. ఆ పాత్ర వల్లే అనసూయకు టాలీవుడ్‌లో పదుల సంఖ్యలో సినిమా ఆఫర్లు వచ్చాయి అనేది చాలా మంది చెప్పుకునే విషయం.

**అనసూయ ఆ తరహా పాత్రల కోసం చూపు..** రంగమ్మత్త వంటి పాత్రలను చేయాలని ఆశ పడుతున్న అనసూయకు పెద్దగా ఆఫర్లు రావడం లేదు అనేది చాలా మంది అభిప్రాయం. యాంకర్‌గా చాలా మంచి పేరు దక్కించుకున్న అనసూయ గత రెండేళ్లుగా పెద్ద సినిమాలు చేయడం లేదని, ప్రస్తుతం ఆమె చేతిలో సినిమాలు ఏమీ లేవనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అనసూయ సన్నిహితులు క్లారిటీ ఇచ్చారు. అనసూయ మేడం సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఖాళీగా ఏమీ లేదని, ఆమె రెగ్యులర్‌గా సినిమాలు చేస్తున్నే ఉందని అన్నారు. ప్రస్తుతం ఈమె ఫ్లాష్ బ్యాక్, వోల్ఫ్ సినిమాల్లో నటిస్తుంది. ఆ సినిమాలు మాత్రమే కాకుండా ఆకష్ పూరి హీరోగా రూపొందుతున్న తల్వార్ అనే సినిమాలో కీలక పాత్రలో అనసూయ నటిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఇప్పటి వరకు ఆ పాత్రకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్ లేదు. కానీ తల్వార్‌లో అనసూయ కీలక పాత్ర అని మాత్రం టాక్ వినిపిస్తుంది.

# కోట్లు సంపాదిస్తున్నా? ఖర్చు విషయంలో జాగ్రత్తే!

సక్సెస్ లో ఉన్న సెలబ్రిటీలంటే కోట్ల రూపాయల సంపాదన. సినిమాలు..యాడ్స్ రూపంలో రెండు చేతులా ఆదాయమే. ఆదాయానికి తగ్గట్లే ఖర్చులుంటాయి. గ్లామర్ ఫీల్డ్ లో ఎంత సంపాదించినా? కరెన్సీ ఖర్చుకు లెక్కుండదు. అవకాశాలున్నా లేకపోయినా ఫీల్డ్ లో ఉన్నంత కాలం కొన్నిరకాల మెయింటనెన్స్ తప్పదు. ఇక్కడే బ్యాలెన్స్ తప్పితే లెక్కలన్నీ తారుమారవుతాయి. పాత తరం నటుల్లో కోట్లుసంపాదించిన వారంతా? చివరి కాలంలో చిల్లి గవ్వ లేకుండానే కాలం చేసారు. అయితే ఇప్పటి జనరేషన్ నటీమణులు డబ్బు విషయంలో జాగ్రత్తగానే ఉంటున్నారు. ఖర్చు విషయంలో ఆచితూచే వ్యవహరిస్తుంటారు. అలాంటి వాళ్లలో నేను ఉన్నానంటూ ముందు



కొచ్చింది ఐటం భామ మలైకా అరోరా. డబ్బు లేని రోజుల్ని.డబ్బున్న రోజుల్ని రెండింటిని చూసానంటూ చెప్పు కొచ్చింది. ఆర్దికంగా కుటుంబం పడిన కష్టాలు తెలియడంతోనే డబ్బు విషయాలు జాగ్రత్తగా ఉంటానని మలైకా తొలిసారి ఓపెన్ అయింది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన మలైకా తల్లి ఎంతో కష్టపడి తమని పెంచిందన్నారు. మెడలో పుస్తులు తాకట్టు పెట్టి మరీ స్కూల్ ఫీజులు కట్టేదని తెలిపింది. '17 ఏళ్ల కే తాను కూడా పనికి వెళ్లడం ప్రారంభించిందంది. డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా ప్రతీ రూపాయి కూడబెట్టేదాన్ని. స్నేహితులతో షికార్లకు వెళ్లడం, పార్టీలంటూ ఎంజాయ్ చేసింది లేదంది. సెలబ్రిటీ అయిన తర్వాత కూడా డబ్బుతో అంతే జాగ్రత్తగా ఉన్నట్లు తెలిపింది. పెట్టే ప్రతీ రూపాయి ఖర్చు డైలీ ఓ పుస్తకంలో రాస్తుందట. ఖరీదైన వస్తువులు వంటివి ఇప్పటికీ కొనదట. షాపింగ్ కి వెళ్తే ఎంత ఖర్చు చేయాలి? అన్నది ముందే రాసి పెట్టుకుంటుందట. ఆ లెక్క దాటకుండా ఖర్చు చేస్తానంది. 'ప్రతీసారి బ్రాండెడ్ వస్తువులే తీసుకోవాలి? అనేది ఏమీ ఉండదు. తనకు కావాల్సిన బ్రాండ్ లేకపోతే మరో కంపెనీ బ్రాండ్ తో అడ్జస్ట్ అవుతానంది. వీలైనంత వరకూ తక్కువ ఖరీదులో ఉండే ఐటం కోసమే సెర్చ్ చేస్తానని తెలిపింది. మొత్తానికి మలైకా అరోరా కూడా బడ్జెట్ పద్మనాభం టైపు అని అర్దమవుతుంది. ఇది మంచి అలవాటే. చేతిలో డబ్బుందని విచ్చల విడిగా ఖర్చు పెడితే? డబ్బు లేని రోజంటూ ఒకటి ఎదురైనప్పుడు ఇబ్బందులు తప్పవు. ఆ విషయాన్ని మలైకా బాగా అర్దం చేసుకుంది.




# యువ హీరో అప్పుడే విలన్ అయ్యాడా?




క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయమైన సుహాస్ హీరోగా ప్రమోట్ అయిన సంగతి తెలిసిందే. అలాగని హీరో పాత్రలకే పరిమితం కాలేదు. హీరోగా వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూనే స్టార్ హీరోల చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నాడు. ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా కెరీర్ ప్రారంభించి హీరో అయిన నటుడు సుభాష్. దీంతో కెరీన్ ను అంతే జాగ్రత్తగా ప్లాన్ చేసుకుని ముందుకెళుతున్నాడు. ఫేం ఉన్నంత కాలమే అవకాశాలు వస్తాయన్న విషయాన్ని గ్రహించిన సుహాస్ ఆ క్రేజ్ ని తెలివిగా ఎన్ క్యాష్ చేసుకుంటున్నాడు. తాజాగా ఈ యంగ్ హీరో అప్పుడే కోలీవుడ్ లో విలన్ గా మారిపోయాడు. సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో మండాడి అనే సినిమా తెరకెక్కుతోంది. ఇందులో సూరి హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాలోనే సుహాస్ హీరోగా నటిస్తున్నాడు. సుహాస్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ అయిన పోస్టర్ తో విషయం వెలుగులోకి వచ్చింది. తాను విలన్ గా నటిస్తున్నాడు? అన్న సంగతి ఇంత వరకూ ఎక్కడా రివీల్ చేయలేదు. నేరుగా పోస్టర్ తోనే అభిమానుల్ని సర్ ప్రైజ్ చేసాడు. దీంతో సోషల్ మీడియాలో నెటిజనులు సుహాస్ కి విషెస్ తెలియజేస్తున్నారు. ఇండస్ట్రీలో తెలివైన గేమ్ ఆడుతున్నాంటూ పోస్టులు పెడుతున్నారు. సుహాస్ తరహాలోనే కార్తికేయ గుమ్మడి కొండ కూడా కోలీవుడ్ లో విలన్ గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆర్ ఎక్స్ 100తో హీరోగా ఎంట్రీ ఇచ్చిన కార్తికేయకు తమిళ చిత్రం వలిమైతో విలన్ అవకాశం వచ్చింది. అందులో హీరో అజిత్. అతడికి ప్రత్యర్ది పాత్రలో నటించి మెప్పించాడు. అదే తమిళ్ లో తొలి సినిమా. కానీ ఆ తర్వాత కార్తికేయకు కోలీవుడ్ లో విలన్ అవకాశాలు రాలేదు. మరి సుహాస్ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. సుహాస్ తమిళ పరిశ్రమకు తగ్గ నటుడే. అతడి ఆహార్యం తమిళ సినిమాలకు పర్ఫెక్ట్ గా సూటువుతుంది. సాధారణంగా తమిళంలో తెలుగు నటులకు అవకాశాలు రావడం చాలా అరుదు. అక్కడ ప్రాంతం ఆధారంగా ఛాన్సులిస్తుంటారనే విమర్శ ఉంది. గతం కంటే ఇప్పుడు మెరుగ్గానే పరిస్థితి ఉంది. ఈ క్రమంలోనే అప్పుడప్పుడు తెలుగు నటుల ఎంట్రీ కనిపిస్తుంది.

# చిరు - రావిపూడి మూవీ.. అనుకున్నట్టు జరుగుతుందా?



టాలీవుడ్ సీనియర్ అండ్ స్టార్ హీరో చిరంజీవి లీడ్ రోల్ లో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఓ సినిమా తెరకెక్కి స్తున్న విషయం తెలిసిందే. కొన్నాళ్ల క్రితం షూటింగ్ స్టార్ట్ అవ్వగా.. ఎప్పటిలానే అనిల్ రావిపూడి షూటింగ్ జెట్ స్పీడ్ లో నిర్వహి స్తున్నారు. రీసెంట్ గా ముచ్చటగా మూడో షెడ్యూల్ ను పూర్తి చేయడం విశేషం. అయితే ఇది రావిపూడికి కామనే. ఎందుకంటే ఎప్పుడూ మెరుపు వేగంతో సినిమాలను కంప్లీట్ చేస్తుంటారు. సాధారణంగా ఆరు నుంచి ఏడు నెలల్లో గుమ్మడికాయ కొట్టేస్తారు. ఇప్పుడు చిరు మూవీ రెండు నెలల క్రితం స్టార్ట్ చేసినా.. అప్పుడే సగం షూటింగ్ ను పూర్తి చేశారు. వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. ఆ విషయాన్ని పలుమార్లు ప్రస్తావించారు కూడా. కానీ ఇప్పుడు అనిల్ రావిపూడి అనుకున్నది చేస్తారా చేయరా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిజానికి సినిమా రిలీజ్ కు ఇంకా టైం ఉంది. కాబట్టి షూటింగ్ ను అనిల్ ఈజీగా పూర్తి చేయగలరు. కానీ మధ్యలో ఇప్పుడు టాలీవుడ్ లో సినీ కార్మికుల సమ్మె అడ్డుపడింది. 30 శాతం వేతనాల పెంపు కోరుతూ కార్మికులు 14 రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయితే సమ్మె మొదలయ్యాక కొందరు నిర్మాతలు.. కొన్ని సినిమాల షూటింగ్స్ కోసం వేరే నగరాల నుంచి కార్మికులు రప్పించి కొనసాగించారని టాక్ వినిపించింది. కానీ ఆ తర్వాత ఛాంబర్.. చిత్రీకరణలు నిలిపివేయాలని ఆదేశించడంతో అన్నీ ఆగిపోయాయి. ఆ నేపథ్యంలో చిరు- అనిల్ మూవీ షూటింగ్ కు కూడా తాత్కాలికంగా బ్రేక్ పడింది. దీంతో సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. కానీ అనిల్ రావిపూడి.. మాత్రం తన టార్గెట్ ను అందుకునేలా ఇప్పటికే ప్లాన్ చేసుకుంటున్నారని తెలుస్తోంది. గ్యాప్ కవర్ అయ్యేలా చూసుకుంటారట. దానికి తోడు తాజాగా ఫిలిం ఛాంబర్ కూడా నాలుగు ప్రతిపాదనలను ఫిలిం ఫెడరేషన్ కు పంపింది. వాటికి ఓకే అయితే నిర్మాతలు వేతనాలు పెంచుతారని చెప్పింది. అదే సమయంలో చిరు కూడా నిర్మాతలు, ఫెడరేషన్ సభ్యులతో చర్చలు జరపనున్నారు. దీంతో సమ్మె కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే అనిల్ రావిపూడి అనుకున్నట్లే చిరు సినిమాను కంప్లీట్ చేసేలా ఉన్నారు.

# బిగ్ బాస్ హెూస్ట్ గా నయనతారకు ఆఫర్!

లేడీ సూపర్ స్టార్ నయనతారకు బిగ్ బాస్ హెూస్ట్ ఆఫర్ వరించిందా? ఏకంగా బాలీవుడ్ బిగ్ బాస్ హెూస్టింగ్ బాధ్యతలే ఇవ్వాలనుకుంటున్నారా? అంటే అవుననే ప్రచారం తెరపైకి వస్తోంది. ఇప్పటివరకూ బాలీవుడ్ బిగ్ బాస్ ని లేడీ బాస్ రూల్ చేసింది రెండు సీజన్లు మాత్రమే. రెండవ సీజన్ ని శిల్పా శెట్టి హెూస్ట్ చేయగా, మరో సీజన్ ని పరాఖాన్ హెూస్ట్ చేసారు. ఆ తర్వాత మరే నటి హెూస్టింగ్ బాధ్యతలు చేపట్టలేదు. అర్దద్ వార్షీ, అమితాబచ్చన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ ఇలా కొంత మంది స్టార్లు హెూస్ట్ చేసారు. ఇప్పటికే బిగ్ బాస్ లో మేల్ డామినేషనే కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో తదుపరి సీజన్ హెూస్టింగ్ బాధ్యతలు నయనతారు కు అప్పగించాలని నిర్వాహకులు భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో ఇటీవలే నిర్వాహకులు



ఆమెను కలిసినట్టు తెలిసింది. నయనతార కూడా పాజిటివ్ గానే స్పందించిందట. కానీ చేస్తాను? లేదా? అన్న తుది నిర్ణయం ఇంకా వెల్లడించనట్లు తెలుస్తోంది. తాను ఎస్ చెప్పినా? నో చెప్పినా పాజిటివ్ గా తీసుకోవాల్సిందిగా కోరిందట. దీన్ని బట్టి నయనతార లో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఇలాంటి అవకాశాలు వస్తే మరో మాట లేకుండా నో చెప్పేది. సినిమా ప్రచారానికి, ప్రకటనలకు చాలా కాలంగా నయనతార దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. ప్రచారం కోసం ప్రత్యేక ప్యాకేజీ ఆఫర్ చేసినా ? నో చెప్పేది. అయితే ఇటీవలి కాలంలో లేడీ సూపర్ స్టార్ కూడా పద్దతి మార్చింది. మెగా స్టార్ చిరంజీవి 157వ సినిమా ప్రారంభానికి ముందే ప్రీ లాంచ్ ప్రచారంలో పాల్గొంది. దీంతో నిబంధనలు సడలించినట్లు నెట్టింట హైలైట్ అయింది. సొంత బ్యానర్లో సినిమా నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ప్రచారం విలువ తెలుసుకున్న నటిగా హైలైట్ అయింది. ఈ నేపత్యంలోనే చిరంజీవి సినిమా విషయంలో ప్రచారం పరంగా పాజిటివ్ గా ఉన్నట్లు కనిపించింది. తాజాగా బిగ్ బాస్ నిర్వాహకులుతోనూ పాజిటివ్ గా మాట్లాడటం ఆసక్తికరం. మరి ఆమె హెూస్ట్ చేస్తుందా? లేదా? అన్నది తేలాలంటే ఇంకా సమయం పడుతుంది. ప్రస్తుతం అమ్మడు నటిగా బిజీగా ఉంది.

# అందాల నికిషా ఏమాత్రం తగ్గలేదు

2010లో 'పులి' సినిమాతో తెరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ నికీషా పటేల్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. పవన్ కళ్యాణ్‌తో నటించే అవకాశం దక్కడంతో నికీషా ఖచ్చితంగా టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా మారే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ పవన్ వంటి స్టార్ హీరోతో సినిమా చేసే అవకాశం దక్కినా నికీషా కు లక్ కలిసి రాలేదు. పులి సినిమాతో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు అయితే దక్కింది. అందాల ఆరబోత చేయడంతో నికీషా పటేల్ ఎప్పటికప్పుడూ ఆకట్టుకుంటూ ఉంది. గుజరాతీ కుటుంబంలో జన్మించిన ఈ అమ్మడు చిన్న వయసులోనే ఇండస్ట్రీ లో అడుగు పెట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. హీరోయిన్‌గా టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు సినిమాలు చేసింది.

**పవన్ కళ్యాణ్ మూవీతో ఎంట్రీ...** పులి సినిమా తర్వాత కన్నడంలో నరసింహ సినిమా తో ఆకట్టుకుంది. కన్నడంలో ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ డకోటా పిక్చర్ సినిమాలోనూ నటించింది. తెలుగులో ఓం 3డి, అరకు రోడ్‌లో ఇలా కొన్ని సినిమాల్లో నటించింది. తెలుగులో



ఈమె చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. అయినా కూడా ఈ అమ్మడికి లక్ కలిసి వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సినిమాలు చేసిన ఈమెకు లక్ కలిసి రాలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అమ్మడు సినిమాలకు దూరంగా ఉంటుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈమె రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ అమ్మడు సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తుంది.

**30 సినిమాలు చేసిన నికీషా పటేల్...** కెరీర్‌లో 30 కి పైగా సినిమాలు చేయడం ద్వారా నటిగా గుర్తింపు దక్కించుకున్న నికీషా పటేల్ ఆకట్టుకునే అందంతో ఎన్నో ఫోటో షూట్స్ ను షేర్ చేసింది. నికీషా పటేల్ అందాల ఆరబోత ఫోటోలు ఎప్పుడూ వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి క్లీ వేజ్ షో తో అందాల నికీషా పటేల్ ఫోటోలు షేర్ చేసింది. అందమైన నికీషా పటేల్ బంగారు వర్ణపు డ్రెస్‌లో మెరిసి పోతుంది. అంతే కాకుండా ఆమె స్కిన్ టోన్ సైతం కలర్ ఫుల్‌గా కన్నుల విందు చేసింది. క్లీవేజ్ షో చేస్తూ, నడుము నాభి అందాలను చూపడం ద్వారా ఆకట్టుకున్న నికీషా పటేల్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఇంత అందంగా ఉన్న నికీషా పటేల్ కి లక్ కలిసి రాకపోవడం వల్లే ఆఫర్లు రావడం లేదు అనేది కొందరి మాట.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536